
ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక




వెల
4 అణాలు

సంపుటము 41 సంచిక 42


ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

జూలై 6 1949

వార్తాచిత్రాలు



గవర్నర్ జనరల్ రాజగోపాలాచారిగారు ఈమధ్య సిమ్లా వెళ్ళినప్పుడు తూర్పు పంజాబు గవర్నరు చందూలాల్ త్రివేది, ఆయన గౌరవార్థం విందుచేశారు. ఆ సందర్భంలో గవర్నరుజనరల్, ఇండియాలో స్విట్జర్లాండు ప్రతినిధిభార్య మదాం డాక్నికర్‌తో కరచాలనం చేస్తున్న దృశ్యమిది. ఇందులో త్రివేది ఎడమవైపునా, స్విస్ ప్రతినిధి డాక్నికర్ కుడివైపునా కనిపిస్తున్నారు.




ఇంగ్లాండులోని థేమ్సునదిలో పడవల పందాలు

మలయాలో కుష్ఠురోగ చికిత్సాకేంద్రము


మలయాలోని సెలాంగర్ స్టేటులో గల సుంగీబులో అనేచోట కుష్ఠురోగులకు ఒక కాలనీ వుంది. మలయా యూనియన్‌లోని అన్నిప్రాంతాల, అన్ని జాతులవారినీ అందులో చేర్చుకొంటారు. ఆ కాలనీలో రోగులకుగల వైద్య సదుపాయాలూ, వ్యాపృత్తులూ ఈ బొమ్మలలో గోచరమవుతున్నవి.




రోగనివారణకు ఇంజెక్షన్ ఇస్తున్నారు



చిన్న బిడ్డలు ఆడుకొంటున్నారు.



ఆస్పత్రిలో రోగులను ఉంచే శాల



కాలనీలోని ఆడవాళ్లు కుట్టుపనిలో నిమగ్నులై వున్నారు.

ఆంధ్రపత్రిక

ప్రతి బుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథములకెల్లన్.

—మహాభారతము.

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర ఆషాఢ శుద్ధ ఏకాదశి బుధవారము



డాక్ బంగాళాచిత్రంలో తార "సురయా"



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ జూలై నెల 6-వ తేది బుధవారము

పాకిస్తాన్ వైఖరి

దేశవిభజన జరిగిన అనంతరము భారత పాకిస్తాన్ ప్రభుత్వములు అనేక ప్రధానవిషయముల పై ఒడంబడికలు కుదుర్చుకొనవలసి వచ్చెను. అన్ని సమస్యలను రాజీ మార్గమున పరిష్కరించుకొనవలెనని భారతప్రభుత్వము గాఢముగ వాంఛించిన కారణముగ తరచు పాకిస్తాన్ అననుకూల వైఖరిని అనుసరించినను, సమాధానము సాధ్యమగుచుండెను. భారత దేశము ఒడంబడికలను అక్షరాల అమలు జరుపుచుండ పాకిస్తాన్ ప్రభుత్వము మాత్రము ఒడంబడికలు వేటిని అమలు జరుపక పోవుటే గాక, భారత దేశము ఒడంబడికలను అమలు జరుపుట లేదని, భారత ప్రధాన మంత్రి వాగ్దానములు, ప్రకటనలు నిరర్థకములని కరాచీ అధికారులు, పాకిస్తాన్ పత్రికలు కూడ విషప్రచారము చేయుచుండెను. న్యూఢిల్లీయందున్న పాకిస్తాన్ హైకమిషనర్, సామాన్య మర్యాదను కూడ నిర్లక్ష్యము చేసి భారత ప్రభుత్వముపై నిందాపూరితమైన ప్రచారము చేయుచుండెను. ఇతర ఆర్థిక, సాంఘిక వ్యవహారములకు సంబంధించిన ఒడంబడికలను అమలు జరుపకపోయినను అధమము ఉభయ అధినివేశములకు సఖ్యత కుదుర్చు నుద్దేశ్యముతో సంవత్సరము క్రితము కలకత్తాలో ఉభయ అధినివేశ ప్రతినిధులు కుదుర్చుకొనిన ఒడంబడికనైనను పాకిస్తాన్ గౌరవించి యుండవలసినది. ఈ ఒడంబడికను పాలించినందువలన పాకిస్తాన్‌కు కలుగు నష్టమేమియు లేదు.

ఈ ఒడంబడిక విషయముననె పాకిస్తాన్ ఇట్టి అననుకూలవైఖరిని ప్రదర్శించియుండ కాందిశీకుల ఆస్తి, సైనిక సామగ్రి, మున్నగు ఆర్థికలావాదేవీలకు సంబంధించిన ఒడంబడికలను అమలు జరుపునని ఆశించుట పొరపాటే కాగలదు. మాటకు కట్టుబడియుండుట పాకిస్తాన్‌విధానము గాదు. కాశ్మీర్ తగాదా, అపహృత స్త్రీల విషయములో నేమి, సైనిక సామగ్రి పంపకము, రొఖ్ఖం నిలువల విషయములలో నేమి పాకిస్తాన్ ప్రభుత్వము ఎన్నడు రాజీ సంప్రతింపుల ఫలితముగ కుదిరిన ఒడంబడికలను ఇప్పటివరకు అమలు జరిపియుండలేదు. కాని వీటన్నింటి విషయమునను పాకిస్తాన్ భారత ప్రభుత్వములో తప్పులు ఎన్నుచునే యున్నది. అట్టి కార్యక్రమములో కాందిశీకుల ఆస్తికి సంబంధించిన ఒడంబడిక గురించి పాకిస్తాన్ విదేశాంగ మంత్రి సర్ మహమ్మద్ జఫ్రుల్లాఖాన్ ఆరోపణ గమనార్హమైనది. కరాచీలో గతవారము జరిగిన సంప్రతింపులు విఫలమగుటకు గల యథార్థకారణములను సర్ జఫ్రుల్లా ప్రకటనే వెల్లడించుచున్నది. పాకిస్తాన్‌కు భారత దేశముతో సమాధానమునకు రావలెనను ఉద్దేశ్యము లేదు. భారత దేశముతో సమాధానపడి, ఉభయ అధినివేశములు సఖ్యతతో వ్యవహరించిన, ప్రస్తుత పాలకవర్గము ఒక్క క్షణమైనను అధికారమునందుండ జాలదు. పాకిస్తాన్ ఇక్కట్టులన్నింటికి భారత ప్రభుత్వ విధానమే కారణమని ప్రజల దృష్టిని దేశాంతర వ్యవహారములపై మరల్చ వీలగును.

గత జనవరి మాసములో జరిగిన కాందిశీకుల ఆస్తికి సంబంధించిన ఒడంబడికను పాకిస్తాన్ ఐచ్ఛికముగనె అంగీకరించినది. అయినను ఆ ఒడంబడిక జరిగిన తరువాత ఆరుమాసములవరకు దానిని అమలుజరుపుటకు ఎట్టి చర్య తీసుకొని యుండలేదు. అధమము ఆ ఒడంబడిక ప్రకారము కాందిశీకుల ఆస్తి సంరక్షణాధికారినైనను నియమించి యుండలేదు. తమ ప్రవర్తన ఆ విధముగ నుండ సర్ మహమ్మద్ జఫ్రుల్లాఖాన్, భారతప్రభుత్వం జూన్ 19 వ తేదీన ప్రకటించిన ఆర్డినెన్సు జనవరి ఒడంబడికకు విరుద్ధముగ నున్నదని ఆరోపించుచుండిరి. జనవరి ఒడంబడిక ప్రకారము భారతప్రభుత్వము జూన్ 6 వ తేదీనే ఈ ఆర్డినెన్సు వివరములను పాకిస్తాన్ ప్రభుత్వమునకు అందచేసినను భారతప్రతినిధి వర్గము కరాచీ సంప్రతింపులకు బయల్దేరువరకు కరాచీ అధికారులు సమాధానము పంపియుండలేదని శ్రీ గోపాలస్వామి అయ్యంగార్ వెల్లడించిరి.

జూన్ 19 ఆర్డినెన్సువలన యథార్థమునకు జనవరి ఒడంబడిక భగ్నము కాలేదు సరిగదా, ఆ ఒడంబడిక ప్రకారము కాందిశీకుల ఆస్తి సమస్యను పరిష్కరించుట సులభమగును. కొందరు ముస్లింలు భారతీయపౌరులుగ నుండి, ఇక్కడి తమఆస్తులను నిలుపుకొని, పాకిస్తాన్ వెళ్లి తిరిగి అచట కాందిశీకులమని ఆస్తులను సంపాదించుకొనుట జరుగుచున్నది. అట్టివారు కాందిశీకులని భారత ప్రభుత్వము ప్రకటించినగాని వారి ఆస్తి సమస్యను పరిష్కరించుట సాధ్యముకాదు. అట్టివారు పశ్చిమబెంగాల్, తూర్పుపంజాబు సందేగాక, ఇతర రాష్ట్రములందును ఉండుటవలన జూన్ 19 వ తేదీ ఆర్డినెన్సు అవసరమైనది. ఈ ఆర్డినెన్సు జారీ చేయుటవలన పాకిస్తాన్‌లో ఉండిపోయిన కాందిశీక ఆస్తికి భారత దేశమునందుండిపోయిన కాందిశీక ఆస్తిని సరిసమము చేయుట సాధ్యమగుచున్నది. అందువలన జనవరి ఒడంబడిక ప్రకారము ఈ సమస్యను సులభముగ పరిష్కరింప వీలగును. పాకిస్తాన్ ఇట్టి ఆర్డినెన్సును హర్షించుటకు బదులు, కరాచీ సమావేశమును భగ్నము చేయుటకు ఒకసాకుగ వినియోగించుకొనుటవల్లనె పాకిస్తాన్ సమాధానము కుదుర్చుకొనుటకు సిద్ధముగ లేదని, అందుకు ఇష్టపడుట లేదని స్పష్టమగుచున్నది. రెండేళ్ల పరిపాలనానుభవమును పొందిన అనంతరము కూడ పాకిస్తాన్ పాలకుల వైఖరి మారకున్న, ఇకముందు వారు విచక్షణతో వ్యవహరించి, ఒడంబడికలను పాలింతురని ఆశించుటకు వీలులేదు.

గ్రామస్వరాజ్యం

సహకార ఉద్యమములోవలెనే పంచాయితీఉద్యమమున కూడ చెన్నరాష్ట్రము భారతదేశమునందలి ఇతర రాష్ట్రములకు మార్గదర్శి యైనదని చెప్పవచ్చును. బొంబయి రాష్ట్రప్రభుత్వము ఇటీవలనే రాష్ట్రమందలి ప్రతి గ్రామమునకును ఒక పంచాయితీని స్థాపించుటకు నిశ్చయించెను. శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు స్థానిక స్వపరిపాలనా శాఖామాత్య పదవిని స్వీకరించిన వెంటనే పంచాయితీ బిల్లును సవరించి, మహాత్ముడు లక్షించిన రామరాజ్య స్థాపనమును సంకల్పించి యుండిరి. గ్రామ స్వరాజ్యము నెట్లు స్థాపించి అమలు చేయదలచిరో ఆ సందర్భముననె పత్రికా విలేఖరులకు వివరించి యుండిరి. కనుక దాదాపు రెండు సంవత్సరములుగ వారి యభిప్రాయములను చర్చించుటకు సూచనలు చేయుటకు రాష్ట్రప్రజలకు అవకాశము ఉండెను. అందువలననె వారు తమ పంచాయితీ బిల్లును ప్రజాభిప్రాయసేకరణకు గాక సెలెక్టుకమిటీ పరిశీలనకు నివేదింప నిశ్చయించిరి. పంచాయితీల పునర్నిర్మాణమును గురించి ప్రజలు, రాజకీయ సంస్థలు క్రొత్తగ తెలుపవలసిన యభిప్రాయములు ఏమియు లేవు. రాష్ట్రప్రజలు, ప్రజాప్రతినిధులు ఇంతకాలముగ వాంఛించుచున్నట్టి గ్రామ స్వరాజ్యమునె చంద్రమౌళిగారి బిల్లు స్థాపింప నుద్దేశించినది. బిల్లు సంకల్ప మిది గాదని, గ్రామస్వరాజ్య సాధనకు బిల్లు ఉపయోగపడదని రాష్ట్ర శాసన సభలందు జరిగిన అయిదురోజుల విమర్శలుకూడ నిరూపింపలేదు.

శాసనసభ సభ్యులు యావన్మంది స్థానిక స్వపరిపాలనా మంత్రి బిల్లును విప్లవాత్మకమైనదని తెలిపిరి. పంచాయితీ బోర్డు అధ్యక్షుని గ్రామ ప్రజలందరు చేరి ఎన్నుకొనవలెనను ప్రతిపాదన సర్వజనామోదమును పొందినది. గత మాసాంతమున రాజమహేంద్రవరములో జరిగిన రాష్ట్ర పంచాయితీ మహాసభ ప్రసంగములను, తీర్మానములను, అసెంబ్లీ, కౌన్సిల్ నందు సభ్యులు చేసిన విమర్శలను పరిశీలించిన స్థూలముగ అన్ని వర్గములు బిల్లు ప్రాతిపదిక సూత్రములను ఆమోదించినట్లు స్పష్టమగుచున్నది.

పంచాయితీలపై అధికారుల ప్రాబల్యము, అదుపు అధికముగ నుండునన్నది విచారింపవలసిన యంశము. అధికారమును స్థానికసంస్థల ఇన్‌స్పెక్టరు జనరల్‌నుండి తొలగించి రాష్ట్రసభ సూచన ప్రకారము రిజిస్ట్రార్ జనరల్‌ను నియమించిన అధికారుల ప్రమేయ మేమియు తగ్గదు.

ఏ శాసనము అయినను, సత్ఫలితములను సమకూర్చవలెనన్న, ఆ శాసనము సక్రమముగ అమలు జరుగవలసి యుండును. శాసనమునందు లోపములున్నను, అమలు జరుపుటలో అవి సర్దుబాటు కాగలవు. పంచాయితీల నిర్మాణముగాక, నిర్వహణ ఈ దృష్ట్యా అత్యంతప్రధానమగుచున్నది. పంచాయితీలపై "ఎక్జిక్యూటివ్" అధికారులను నియమించుటకంటె, ప్రతి పంచాయితీకి సలహాదారులను నియమించుట ఎక్కువ ప్రయోజనకరముగ నుండవచ్చును.

పంచాయితీలకు పన్ను విధించు అధికారముల నిచ్చుటలో సెలెక్టు కమిటీ వారు బిల్లు అంశములను ప్రత్యేక శ్రద్ధతో పరిశీలింపవలసి యుండును. శకటములపై పన్ను, ఇండ్లపై పన్ను, వీటైన, అవసరమైన మరి కొన్నింటిపైన పన్నులు విధించుటకు పంచాయితీలకు అధికార మిచ్చుట ప్రస్తుతపరిస్థితులలో అంత సమర్థనీయము గాదు. రాష్ట్ర ప్రభుత్వములపన్ను విధింపు అధికారములను గురించియే వాదోపవాదములు ప్రబలుతూ ఉండగా, పంచాయితీలకు ప్రత్యేకముగ కొన్ని పన్నువిధింపు అధికారములను కట్టబెట్టుట అంత దూరదృష్టితో కూడిన పని గాదు. సాగు పనులనుండి ప్రజల ఆరోగ్యము, విద్యా

నవల :

నాతిచెలి

టి.ఎడి. ప్రసాదరావు

1

మర్నాడు స్థిరచిత్తంతో పదిగంటలకే క్లాసుకు వెళ్లి కూర్చున్నాడు. అటెండెన్సు ఇయ్యటం అయినప్పటినుంచీ అరికాలు దురద పెట్టూనే ఉంది. క్లాసులో పాఠం చెవి కెక్కటం లేదు. పట్టుదలతో అల్లాగే కూర్చున్నాడు. ప్రొద్దున లేచినప్పుడు చదువుతప్ప ఇతర వ్యాసంగాల్లో వేటిల్లోనూ పడకూడ దని నిశ్చయించుకొన్నాడు.

"నీచప్రవర్తనకయిన సాహసం, ఉతను కార్యం అనుకొన్న పని చేయటానికి తోడు కాకుండా పోయిందే" అన్న కుమిలింపులో గతరాత్రి తండ్రిఉత్తరం చించేశాడు ప్రొద్దున్నే ఆ చించిన ముక్కలు మళ్ళీ కూర్చి చదువుకొన్నాడు. తను చేయనిపనే, చెయ్యవద్దని తండ్రిఅంటే కోపం రావాల్సిన అగత్యంలేదూ? ఉద్యమంలో పాల్గొనటానికి తనకున్న సాహసమెంతో నిన్న సాయంత్రమే బయలుపడింది. అప్పటికన్నా ఉద్విగ్నస్థితి మళ్ళీ తనకు ప్రాప్తించటం అసంభవం. పూర్వాపర విచారం లేని సాహసోత్తేజాలతో తప్ప, మంచిలోగాని, చెడ్డలోగాని అల్లాంటి కార్యాచరణ సంభవం కాదు.

కాని క్షణికోద్వేగంతో మంచిచెడ్డలు విచారించకుండా చేసిన పనికి తర్వాత పశ్చాత్తాపించటం, కాశీలో అడుగుపెట్టకముందే ప్రారంభమయింది. రైలులో గొలుసు లాగిన తర్వాత, "తాత్కాలికంగా వచ్చే మెప్పుకోసం, ముందు ఉరికి, తర్వాత వట్టిమొగం అనిపించుకోటం" నాగరకలక్షణం కాదని బుద్ధి వచ్చింది. తదనుగుణ్యంగానే ఉద్రేకాలను కొంత తమాయించుకొంటూ నడవటం నేర్చుకొన్నాడు. ఆ ఉద్రేకాలకు మంచిచెడ్డల విచక్షణ లేదు. ఉండుండి ఒకప్పుడు తలకు వైకం కల్పించి, మనలోని పశువులకు లాగుతూనే ఉన్నాయి.

ఉద్యమంవిషయంలో మళ్ళీ సాహసం వస్తుందన్న భయం లేదు. "భయం" అని అనుకొన్నందుకు మళ్ళీ చిరాకే వేస్తోంది

3

దేశభక్తి ఉద్రేకం తెచ్చుకోవలసిన ఉద్రేకంలాగే ఉంది. ఇంద్రియాలలో మనస్సులో జీర్ణమైపోయిన ఉద్రేకంలాగు లేదు. క్షణికోత్తేజ సమయాలలో తప్ప ప్రకోపించే స్థాయి ఉన్నట్టు లేదు. దానికి కలిగే భీకరప్రతిఫలాలలో కీర్తి కాంతుమిళితమయి ఉన్నా, ఆ కీర్తి తనలాంటి ప్రతి అనామకునికీ దక్కుతుం దన్న స్థైర్యము లేదు. గణనకురాని త్యాగంమీద అపేక్షకలిగే నిస్వార్థత తనకు లేదు, తనమీద తనకు చీదరింపు కలుగుతూంది.

ప్రక్కనున్న బెంగాలీ కుఱ్ఱవాడు మాస్టరు చెప్తూన్న పాఠం నోట్సు రాసుకొంటూన్నాడు. వ్రాసుకొనేలోపలే మాస్టరు చెప్పిన ముక్క మర్చిపోయాడులాగుంది.

"రావ్ జీ, మెథేన్ ఫార్ములా సి హెచ్ ఫోర్ కదూ !" అని తనవైపు తిరిగి ఆంగ్లంలో నెమ్మదిగా అడిగాడు.

తను అసలు వినలేదు.

"ఛస్ ! ఈ ఆలోచన లేవీ వద్దు" అంటూ బుద్ధిచెప్పుకొని మనస్సు మళ్లించుకొంటున్నాడు.

అతను మళ్ళీ అడిగాడు.

గుంభనంగా "ఊఁ" అని జవాబుచెప్పి మాస్టరు వంక దృష్టి కేంద్రీకరించాడు.

మాస్టరులోని అందవికారాలే కన్పడుతున్నాయిగాని పాఠం చెవుల కెక్కటం లేదు. మళ్ళీ మనస్సు పగకు చిత్తగిస్తోంది. ఎక్కడి కక్కడే మెలుకువ తెచ్చుకొంటున్నాడు.

ఇటుపక్క గుప్తా నోటుపుస్తకంమధ్యలో ఒక అమ్మాయిఫోటో పెట్టుకొని చూస్తూ గుటక లేస్తున్నాడు.

అటు వాలి ఫోటోవంక చూశాడు. గుప్తా చిరునవ్వుతో ఫోటో దగ్గిరగా చూపించి నోటు పుస్తకం మూసి విలాసంగా చూశాడు.

"ఆ అమ్మాయి ఎవరు?" అని రహస్యంగా అడిగాడు

గుప్తా చిరునవ్వుతో బల్లమీదికి తల వాల్చి "అందంగా లేదూ!" అని హిందీలో రహస్యంగా అడిగాడు.

"చాలా బాగుంది—" నిజంగానే అందంగా అనిపించిందికూడా.

గుప్తా మొగం వింతగా పెట్టి, "ఛుప్" అంటూ బల్లమీదే నోటుబుక్కు గుండె కదుముకొన్నాడు.

"పెళ్లిచేసుకోబోతున్నావా ?"

గుప్తా నవ్వుతూనే తల అడ్డంగా తిప్పాడు.

"నన్ను ప్రేమిస్తూంది"

అతనిమొగంవంక పరకాయించి చూశాడు. అందాలకు గుప్తాను, తననూ చెప్పవలసిం దేమీ లేదు. ఇది ప్రతివాళ్లకూ ఉంటూన్న జంజాటమే. నేమో !

"రేపు ఏప్రిల్ లో పెళ్లి" అన్నాడు మందహాసంతో సన్నగా గుప్తా.

అడ్డంగా తల తిప్పి మళ్లీ పెళ్ళంటున్నాడే అని ఆశ్చర్యపోయాడు. "ఆ అమ్మాయిని పెళ్లి చేసుకొంటున్నావా?" అని మళ్లీ ఇంగ్లీషులో అడిగాడు.

గుప్తా మళ్ళీ అడ్డంగా నే తల తిప్పుతూ మందహాసంతో "జానూ" అంటున్నాడు.

ఇది తన కథలాంటిది కాదు. స్వచ్ఛము, సాంప్రదాయికము. అరికాలు మళ్లీ దురద పెట్టూంది. తన నోటుబుక్కువంక చూసుకొన్నాడు. తనకు తెలియకుండానే పుస్తకంలో "ప్రభావతి, ప్రభావతి" అంటూ పెన్సులుతో వ్రాస్తూన్నాడు. అడావుడిగా పెన్సులుతో పేర్లు కనపడకుండా అడ్డగీతలు పులిమాడు.

"ఏమిటది!" అని అడిగాడు గుప్త.

తెలుగువాళ్ళ మధ్య కూర్చోలేదు. బ్రతికాను అనుకొన్నాడు. మాట తప్పించి—

"నిన్న చౌక్ లో పికెటింగ్ కు వెళ్ళావా ?"

గుప్తా భయంతో "లేదు అల్లాంటి వాట్లల్లో కలగచేసుకొంటే మా తండ్రి తంతాడు."

బెంగాలీవంక తిరిగి అడిగాడు.

"ఉహూ! నేను చదువుకోటానికి ఇక్కడికి వచ్చాను. అల్లరిచిల్లరగా తిరగటానికి కాదు" అంటూ అతను తీవ్రంగా ముఖంపెట్టి మళ్ళీ తన నోట్సు వ్రాసుకొంటున్నాడు.

గుప్తా కుతూహలంగా అడిగాడు "నువ్వు వెళ్ళావా ? ఏం జరిగింది?"

రాఘవరావుకు సత్యాగ్రహ విషయికంగా తనలో ఉన్న, ఇందాకటి ఆత్మనిరసనం సన్నగిలింది. లారీచార్జీ, ఫైరింగ్, సన్నగొంతుకలో వర్ణిస్తున్నాడు. గుప్తా కుతూహలంతో వింటున్నాడు.

"మిస్టర్ రఘువారావ్ !" —అదిరిపడి చూశాడు.

మాస్టరు తీవ్రంగా తనవంక చూస్తూ పిలుస్తున్నాడు. అడావుడిగా లేచి నిల్చున్నాడు. గుప్తా కిక్కురుమనకుండా తలవంచి ఏమీ ఎరగనట్టు నోటుబుక్కులో పెన్సులుగిలుపుతున్నాడు.

"మిస్టర్ రావ్, ఆల్డిహైడ్ ఫార్ములా ఏమిటి ?"

తల ఖాళీగా ఉంది. ఆల్డిహైడ్ ఏమిటో అసలు తెలియటంలేదు. నోటికి వచ్చిన మాట అనేశాడు:

"సీ హెచ్ ఫోర్".

క్లాసు అంతా గొల్లుమని నవ్వారు.

రాఘవరావు మొగం కందగడ్డ అయిపోయింది. సిగ్గుతో మొగం వాల్చుకున్నాడు.

"సెహబాస్! అసలు ఆల్డిహైడ్స్ అంటే ఏమిటి? ఆల్డిహైడ్స్ కు కీటోన్స్ కు భేదంఏమిటి?"

రాఘవరావు నిరుత్తరుడై తలవాల్చుకు నుల్చున్నాడు.

"ఇల్లా చూడు !"

రాఘవరావు అతికష్టంమీద తల ఎత్తాడు. చేజిక్కిన ఎలకతో చెలగాటం ఆడుతున్న పిల్లిలాగున్నాడు ఆ మాస్టరు. అతనిమీద కోపం కుములుకొస్తోంది.

"పోనీ, ఆర్గానిక్ కెమిస్ట్రీఅంటే ఏమిటి?" అని మాస్టరు విషపు నవ్వుమొగంతో అడిగాడు.

ప్రశ్న వినేటప్పటికి క్లాసుఅంతా గొల్లుమని నవ్వారు. గుప్తా కూడా తలవంచే కులుకుతూన్నాడు

వీళ్ళు బి. యస్ సి. విద్యార్థులేనా! వీధిబడిలో పిల్లలైనా తోటివిద్యార్థిపట్ల, ఇంతకన్న ఎక్కువ సానుభూతి చూపిస్తారే! ఆ బెంగాలీ అతను ఇందాక ఫార్ములా తెలియకే గదా తన్ను అడిగాడు; అతనుకూడా అతిగానే నవ్వుతున్నాడు. ఆలోకం అంతటిమీదా ఉక్రోషం వస్తూంది. తనూ మునుపు ఇతరుల విషయంలో అందరితో కలిసి అల్లాగే నవ్వా డన్న విషయం జ్ఞాపకం వచ్చి మరింత కుమిలించింది.

"అచ్ఛా! అచ్ఛా! కూర్చో ! నీచదువు విషయంలో నీకు లేని బాధ నా కెందుకు?" అంటూ కృతకంగా పెట్టిన జాలిమొగంతో మాస్టరు కూర్చోమని, మళ్ళీ పాఠం సాగించుకొంటున్నాడు. బరువుతో మోకాళ్లు వంచుకొని సీటులో కూలబడ్డాడు. తల అటూ ఇటూ తిప్పటం లేదు.

గుప్తా రహస్యంగా పలకరిస్తున్నాడు. ఇందాక అందరితోపాటు నవ్విన గుప్తా—

"ఈ మాస్టరు పట్టి బద్మాష్" అని గుప్తా నెమ్మదిగా సానుభూతి చెప్తున్నాడు. ఇందాకటి నవ్వుకు పశ్చాత్తాపం ప్రకటిస్తున్నాడు గుప్తా.

తను మాట్లాడలేదు.

క్లాసు అయిపోయాక మాస్టరు ప్రత్యేకంగా పిలిచాడు. "పదిహేనువందల మైళ్ళదూరంనుంచి వచ్చినవాడివి చదువుమీద ఎంత శ్రద్ధ చూపాలి!" అంటూ ఉపన్యాసం ఇస్తున్నాడు. తన మంచి కోరే అపేక్షకన్న, ఒకళ్ళకు బుద్ధి చెప్పటానికి అవకాశం దొరికినందుకే మాస్టరులో ఉత్సాహం ఎక్కువ కనుబడుతోంది. కిమ్మనకుండా విని గదికి కదిలాడు.

ఆరోజు రాత్రి మనస్సు చలించకూడ దనుకొంటూ పుస్తకం వేళ్లకంటించుకొని కూర్చున్నాడు. పదిరోజులపాటు అటూ ఇటూ కదలకుండానే ఎల్లాగో గడుపుకొన్నాడు.

2

పదకొండు దాటినప్పటినుంచీ ఊళ్ళోకి వెళ్ళకుండా క్లాసులో కూర్చోటం గడ్డయిపోతోంది. పదిరోజులు బిగబట్టుకొని ఆగాడు.

ఆనాడు కూడా సాయంత్రందాకా అల్లాగే ఆగాడు. యూనివర్సిటీలో కాలు నిలవటం లేదు.

"రాఘవరావ్ ! సినిమా కెళ్దాం వస్తావా ?" అంటూ వెంకట్రావ్ గదిలోకి వచ్చాడు.

"ఏం, సినిమా !"

"మాతాహరి ! గ్రేటా గార్బో ఏక్టుచేసింది. గార్బోచిత్రం ఏదీ చూడలే ! చూసితీరాలి !"

వెంకట్రావ్ కూడా ప్రక్కనే ఉంటాడు. బుద్ధి చలించటానికి ఆస్కారం తక్కువ. సినిమాకు బయలుదేరాడు.

ఒక విగ్రహంముందర గార్బో నృత్యం చేస్తోంది. "శివా" "శివా" అని రత్యంతకూజిత మొనరుస్తున్నట్లుగా బరువుగా అంటూంది.

ఆ విగ్రహాన్ని స్పృశిస్తూ, గడ్డకట్టిన ఉద్రేకాన్ని కరగించుకొంటూన్నట్లుగా, ఏనిండుతనమూ లేని అవయవాహాలను కదలించుకొంటూంది. మొగంలోమాత్రం, ఏదో అర్థంకాని, మానవత్వ ప్రాథమిక భావమే ఉద్విగ్నంగా, రామణీయకతల అవసరమే లేకుండా, చూపరుల మనస్సును కదలిస్తోంది. ఆ ఘట్టమంతా మనస్సుకు హత్తుకొంది. కాని జుగుప్సాకరంగానే ఉంది. భారతీయ సాంప్రదాయాలమీద భక్తితోనే, అర్థంచేసుకోకుండా అవకతవకగానే, దాని స్వరూపాన్ని పాశ్చాత్యులు చిత్రించబోయి, అయ్యవార్ని చేయబోయి కోతిని చేసి వెక్కిరింపులకు ఆస్పదం చేసినట్లుంది. కాని జుగుప్సా కరంగాఉన్నా కూడా, ఎల్లాగో ఇంద్రియ ప్రకోపవాన్ని కామేచ్ఛను మాత్రం ఆ ఘట్టం కల్గిస్తూనే ఉంది.

అది చిత్రంలోపం కాదేమో! తనలోని వాంఛను ప్రబలం చేసేందుకు కుక్షశాస్త నిష్పారవ్వఅయినా చాలి ఉండటం తన స్థితిలోపమే.

మాతాహారిని కాల్చి వేసిన ఘట్టంలోకూడా, తనలో సరియైన కరుణ కలుగలేదు. అసలు ఎవరి కరుణకూ అతీతమైన రూపమేదో గార్బో చిత్రంలో ప్రకటించుకొంటూ వచ్చింది. ఆ ఘనతయొక్క స్వరూపం ఛాయగా కనబడింది తప్ప అర్థమేమో అతనికి తెలియలేదు.

హాలులోనుంచి బైటికి వస్తూంటేవెంకట్రావ్ సంతోషంతో కళ్ళు తుడుచుకొంటూ అంటున్నాడు: "స్ప్లెండిడ్ ! స్ప్లెండిడ్ ! ఏం చక్కగా ఆక్టు చేసిందోయ్—శివుడిముందర నృత్యం ఎల్లా చేసిందంటావ్, మోస్టు బ్యూటి

(21-వ పేజీ చూడుడు)

వ్యవహారములవరకు గ్రామ పంచాయతీలు, పురపాలకసంఘములు నిర్వహించిన రాష్ట్రప్రభుత్వములు కేవలము పోలీసు పనులనుమాత్రమే నిర్వహింపవలసి యుండును. అట్టి సందర్భములో రాష్ట్ర ప్రభుత్వాదాయములో అధికభాగమును పంచాయితీలకే ఇవ్వవచ్చును.

బిల్లు లోపరహితము గాదని, పరిపూర్ణము గాదని మంత్రిగారే అంగీకరించి యుండిరి. బిల్లును సంస్కరించుటకు తాము సిద్ధముగ నున్నట్లు తెలిపిరి. కనుక సెలెక్టుకమిటీ సభ్యులు బిల్లును సమగ్రముగ పరిశీలించి అవసరమైన మార్పులు చేయుటకు పూర్తి యవకాశము గలదు. ఈ బిల్లువలన ఏర్పడు గ్రామస్వరాజ్యము, ప్రజా స్వామిక రిపబ్లిక్ స్థాపనకు దోహదము చేయునట్టిదిగ నుండవలెను. ఆ దృష్టితోనే సెలెక్టు కమిటీ సభ్యులు బిల్లును సంస్కరింపవలసి యుండును.

మహమ్మదీయ యుగములో నాణెములు

శ్రీ యెద్దనపూడి వెంకటరత్నం

అతీత వైభవోపేతయగు భారతీయతల్లి యొక్క విజ్ఞాన విభవములే విదేశీయుల నీ దేశమునకు ఆకర్షింపజేసినవి. అందు కేవలము మహమ్మదీయుల నీ దేశమునకు దారితీయించినవి వెండి, బంగారములే. "సబక్తజిన్, రెండవ పర్యాయము హిందూదేశముపై దాడి వెడలి, లాహోరు రాజునోడించి, అతనిని వశవర్తిని గావించుకొని, విస్తారము వెండి బంగారములను తనదేశమునకు కొల్లగొట్టుకొని పోయినాడు. అతను భారతదేశముపై దాడివెడలినప్పుడల్లా దేశమును కొల్లగొట్టి, వెండి బంగారములను దోచుకొని పోవడమే కాకుండా, మహమ్మదీయ మత ప్రవక్తయొక్క ఆదేశముల వ్యాప్తికి సహకారియగుచుండెడివాడు కూడాను. ప్రతి దండయాత్రసమయములో, హిందూ దేవాలయములను పడగొట్టి, అందలి దేవతా విగ్రహములను రూపుమాపుతూ యుండేవాడు. వీటిలో అత్యంత ప్రాముఖ్యత గన్నది, నాగర్‌కోట, సోమనాథ దేవాలయములు. సోమనాథ్ దేవాలయము అతి ప్రాచీనమైనది. గుజరాత్‌లోని సముద్రతీరమందు, పోర్చుగీసువారి రేవుపట్టణమగు 'డయ్యూ' పట్టణమునకు సమీపమందుండేది. దీనికి రెండువేల అగ్రహారము లుండేవి. రెండువేల మంది పూజారులు, పూజాదికములను నిర్వర్తిస్తూ యుండేవారు. దూరమందుండే గంగానదీతోయములతో, ప్రతినిత్యము, ఉదయము, సాయంకాలము విగ్రహానికి మార్జనము, నిత్యాభిషేకము చేస్తూయుండేవారు. వీరుగాక 3 వందల మంది బాజాభజంత్రీలు, 300 మంది భజన సంకీర్తనపరులు అయిదువందలమంది ఉత్తమకులం సంజాతలగు, నాట్యకళాపారంగతలగు దేవదాసీలు, సదాసన్నిధానవర్తులై సేవ జేస్తూయుండేవారు. దీనిని మహమ్మదు ముట్టడించి, శిథిల మొనరింపబోగా, కలయునంతద్రవ్యమిచ్చెదమని వేడినను వినక, దేవాలయమును, భూమట్టమొనరించి, అంద విగ్రహము నూడబెరికించి, బ్రద్దలుగొట్టించి, అందుండి వెలువడిన, వజ్రములను, ముత్యములను వెంట గొనిపోయినాడని, గిబ్బన్ అనే చరిత్రకారుడు వివరించి యున్నాడు".

నాణెములను, తమ ఆధిపత్యమును ప్రదర్శించుటకును, తమ ప్రభుత్వాధికార ప్రదేశ వ్యాప్తిని గుర్తింపజేయుటకుమాత్రమే, తమచే ఆజ్ఞాపింపబడిన సాంకేతికముల నమర్చి, నాణెములను ముద్రింపించి, చలామణీలో బెట్టజూచెడువారు కాని అన్యకృత్తియుండేది కాదు. పాలితులుకూడ తమ నిత్యజీవితావసరములగు పదార్థముల నిచ్చిపుచ్చుకొనటలలో మోసమునకు తావుండకుండుటకుగాను, వీటిని కొలమానములుగా వినియోగించుకొనెడివారు. వణిజులైనను, తమ తమ దేశజుల కవసరమగు ఆహారపదార్థములను, ఆయా తరుణముల ననుసరించి, సమకూర్చి నిలువ యుంచుటకు వినియోగించెడివారు. ఆ కాలపుప్రజలు, విషయవాంఛలకుగాని, భోగలాలసత్వమునకుగాని, విలాసవస్తుస్వీకరణేచ్ఛకుగాని మరుగలేదు. అప్పటి ప్రభుత్వములుకూడా, ముడిపదార్థములకు బదులుగా పారిశ్రామిక వస్తుసముదాయమును, మూల్యమిచ్చి, విదేశీయులవద్దనుండి గైకొనవలెననెడి వాంఛకు వశ్యులు కాలేదు. ఏతత్కారణమువలన, వాణిజ్యవ్యాపారములందలి నాణెముల జోక్యము యీ కాలపు మారకపు విధానమువలె భ్రమప్రమాదములకు హేతుభూతము కాలేదు.

కావుననే, నేటి ప్రాచ్య, ప్రతీచీ ఖండములందలి విఖ్యాతయశోవిశాలురగు చరిత్రకారులు, ప్రాచీన భారతావనియొక్క నిక్షిప్తవిభవమును గురించిగాక, ప్రత్యక్షముగా గోచరించు, ధన, కనక, వస్తువాహనాదికములయొక్కయు, నగరరాజములయొక్కయు, విఖ్యాతిని, విజ్ఞానమును, వైభవమునుగురించి గ్రంథస్థములు గావించిన విషయములను పఠించువారలకు గుండెలు ఝల్లుమనకమానవు. నాటి వైభవమును నేటి దైన్యతతో పోల్చిచూచినచో, విస్మయచిత్తులు కానివారుండరు. నేటి దుర్భరదారిద్ర్యావస్థను కనులార గాంచినంతనే కన్నీ రూరక మానదు. ఎన్నియుగము లెంత విచ్చలవిడిగా వెచ్చించినను తరుగ వనుకొన్న రజతకాంచనరత్నరాసు లెట్లదృశ్యమైనవా యని అచ్చెరువొందకపోరు.

భారతదేశమునందాధిపత్యము వహించి మహమ్మదీయ చక్రవర్తులలో నాణెముల ముద్రణమునుగురించిన సంస్కరణలమధ్య మించినవారు అల్తమష్ చక్రవర్తి. ఆ కాలపు నాణెముల కొకప్రక్కను సంస్కృతముతోగాని, ప్రాకృతముతోగాని అక్షరములును, మరొకప్రక్కను రాజచిహ్నముగాని, రాజు ప్రతిబింబముగాని ముద్రింపబడియుండేవి. భారతీయులవలెనే, మహమ్మదీయులుకూడ చాలకాలమువరకు తమచే ముద్రింపబడి, చలామణియందుంచుట కేర్పఱచుకున్న నాణెమున కొకప్రక్కను తమ పేరు ప్రతిష్ఠలకు సంబంధించిన సాంకేతికములను రెండవప్రక్కను తమతమ యిష్టదైవతముల విగ్రహములను చిత్రింపించుచుండెడివారు. ఆ కాలపు నాణెములు హస్తనిర్మితములే గాని, యంత్రముద్రితములుకావు రాజుయొక్క ప్రతిబింబము చిత్రింపబడవలె ననుసాంప్రదాయమునకు దారితీసినవాడు, గ్రీసుదేశపు చక్రవర్తియగు అలెగ్జాండరు దిగ్రేటు. బొమ్మవున్నవైపును 'సీదా' అనియును, యితర సాంకేతికములు చిత్రింపబడినవైపును 'వుల్టా' యనియును పేర్కొనుచుండెడివారు. దీనినే పాశ్చాత్యులు, 'ఫ్రంటు' అండ్ 'రివర్సు' అంటారు. క్రీ. శ. 1233 సంవత్సరములో అదివరకు చలామణిలో వుండే నాణెమును వొత్తిగించి, దానికి ప్రతిపదార్థముగా మరియొక నూతన నమోనాను ప్రతిపదారము గావించి, దానికి "టాంకా" యని పేరు పెట్టి ప్రచారమునందుంచ ఆజ్ఞాపించినాడు. నేటికిని ఒరిస్సాయందు, బంగాళమునందును, రూపాయని 'టాంకా' యని సంబోధించు సాంప్రదాయ మీకాలపునాటిదే. అటు పిమ్మట వీటినే 'ఢిల్లీ' లో కూడ ముద్రింపించి, వాటిని 'ఢిల్లీ' వాలా లని పేర్కొంటూ వచ్చారు. అప్పటిలో వీనియందు 180 గ్రెయినుల తూకం గల పరిశుద్ధమగు వెండిలోహము వుండేది. నాడు మొదలు మరియొక శతాబ్దమువరకూ భారతదేశపు నాణె పెట్టి మార్పులకును యెర గాలేదు.

ఇతని అనంతరం, నాణెముల సంస్కరణ కుద్యమించినవాడు 'అల్లాయుద్దీన్ ఖిల్జీ'. ఇతడు కొంచెం ఖర్చుమనిషి. యుద్ధవ్యయములక్రింద చాల ద్రవ్యము విచ్చలవిడిగా వెచ్చించినాడు. క్రమక్రమముగా ఆదాయముతక్కువకాజొచ్చిన కొలది వ్యయము మితిమీర జొచ్చినది. ఖర్చు తగ్గించు సాధనం దొరకలేదు. ప్రభుత్వపు సిబ్బందిని తగ్గించి ఖర్చును కుదించా లనుకుంటే కార్యనిర్వహణ కుంటుపడడమేగాక తగ్గినపోయిన సిబ్బంది యెదురుతిరిగి కుట్రలు పన్నుతారేమో అనే భీతావహంకూడా కలిగింది. పరపతిని వినియోగించి అప్పుతెచ్చి ఖర్చు సరిపుచ్చినా, పరపతి, అప్పును ఒకచోటనుండి, మరియొక చోటికి మార్చి కాలయాపన చేయుటకు వినియోగపడుతుందిగానీ, అదనపు ఆదాయమును రాబట్టి, ప్రభుత్వాదాయమును వృద్ధిచేయు, నిరపాయమగువనర్లు కల్పించలేదు. ఎటూ పాలుపోక, అదివరకు గ్రె 180 లు తూకం వుండే వెండి నాణెమునుండి, గ్రె 40 లు పరిశుద్ధలోహమును తొత్తిగించి, గ్రె 140 లు తూకం ప్రమాణముతోనే, మరియొక నూతన నాణెమును ముద్రించి, దానికి "అడలీ" అని నామకరణ మొనరించి, పూర్వపు 'టాంకా' విలువలే మారవలెనని శాసిస్తూ, అసలు 'టాంకా'ను, ప్రచారమునుండి తప్పించుట కాజ్ఞాపించినాడు. ఈ కృత్రిమ నాణెపు చలామణీవలన అదివరకు ప్రజల హస్తగతమైయుండే 'టాంకాలు' దాచివేయబడ్డాయి. నాణెంలో లోహం తగ్గించడంతోనే, తినుబండారాల ధర పెరుగడం ప్రారంభించింది. అదివరకు 'టాంకాకు' కుంచెడు లభించేవి. యిప్పటి 'అడలీకి' మూడుశేర్లే యివ్వడం ప్రారంభించారు వణిజులు. పాటకపువారల జీవితము దుర్భరము కాజొచ్చినది. ప్రభుత్వ ప్రతిష్ఠాపటుత్వములుకూడ సడలిపోయినాయి. ఆర్థికక్లిష్టతను చక్క జేసికొనటకు పన్నిన పన్నాగము తన యీప్సిత మీడేర్చక పోవుటయేగాక, నూతన చిక్కులను తెచ్చిపెట్టినది.

ఇతని తరువాత, నాణెముల సంస్కరణ కుద్యమించినవాడు, మహమ్మద్ బిన్‌టుగ్లకు. ఈతడు పదునాల్గవ శతాబ్దమునాటివాడు. ఇతని హయాములో కోశాగారము తుష్టిగాను, పుష్టిగానూ వుండేది. ఇతర ప్రాంతములను కొల్లగొటి తెచ్చిన వెండిబంగారములను ప్రభుత్వ బొక్కసమునకు చేరుస్తూయుండేవాడకూడాను. ఆ కాలములో వెండికి విలువ తగ్గినది - కాని వెండిబంగారు లోహములకు ఒకదానితో మరియొకదానికి యివ్వబడే విలువలో, మేరమీరిన వ్యత్యాస ముండేదకాదుకూడాను. 1 తులం బంగారమునకు 10 తులాలు వెండి లభించేది. చూచాడీ తంతు అంతాను - అదివరకు చలామణీలోవుండే 'అడలీ' అనే వెండినాణెమును మార్కెటునుండి తప్పించి, దానికి ప్రతిపదార్థముగా బంగారులోహముతో నాణెము ముద్రింపబడవలెనని తన రాజ్యమంతటా, తాఖీదులు పంపుతూ, బంగారు నాణెమును ముద్రింపించి దానికి, 'దీనార్'అని పేరుబెట్టి, ప్రచారములో బెట్టించాడు. దీని తూకం గ్రె 200 లుండవలెనన్నాడు. దీనితో పాలితులగుండెల్లో రాయి పడింది. ప్రజలకద్దనుండే బంగారమంతా ప్రభుత్వపు బొక్కసమునకు జేర్చుటకిది యొక పన్నాగమని అనుమానించారు. నాణెముల మారకం స్తంభించినది. ప్రభుత్వాజ్ఞలకు పటుత్వము లేకపోయింది. ప్రజల నిర్లక్ష్యం ప్రభువుయొక్క కోపానలం మరింత రెచ్చగొట్టింది. వెంటనే విలువలేని లోహములతో నాణెములు ముద్రింపించి వాటిని చలామణీలో బెట్టుట కాజ్ఞాపించినాడు. ఈ విధానముకూడ కార్యవారి కాలేదు. కొంతకాలము, చర్మపు రూపాయలను కూడ చలామణిలో బెట్టించినాడని వాడుక. పాలితులపై పగదీర్చుకొనుటకు తన శాయశక్తులా తంటాలుపడ్డాడు. కాని సఫలీకృతమనోరథుడు కాలేకపోయాడు. వేడిపాలను త్రాగుటచే తమూతికాలినపిల్లి పాలను చల్లార్చి పెట్టినా, వాటి నారగించుటకు వెరచుట సహజమైనట్లు, పాలితులు యితనివలన అమలులో బెట్టబడు ప్రతిమార్పును, అనుమానాస్పదులై అనుసరించుటకు వెరుస్తూయుండేవారు. తుదకు ప్రాణం విసిగి రూపాయివస్తువను 0-8-0 కి అమ్మాలని కఠిన నిర్బంధాజ్ఞలు జారీచేశాడు. ఏమీ లాభంలేక పోయినది. తుదకు తేలిం దేమిటంటే, డబ్బుపిచ్చి. ఎంతటి ఆగర్భశ్రీమంతునైనా మతిభ్రష్టుని గావిస్తుందనే లోకోక్తిని సార్థకపరచింది. తుదకి తనని పిచ్చివాడని పేర్కొన సాహసించారు కూడాను.

ఇల్లాంటి పిచ్చిరాజులు ఒక్క ఆశియా ఖండములోనే కాగు ఐరోపాఖండమందు కూడా ఉన్నారు. ఇంగ్లాండు నేలిన రాజులలో ఆరవ హెన్రీ లగాయతు మూడవ విల్లియం వరకు ఆర్థిక ఝక్కట్టులకు లోనైనవారే. ఎనిమిదవ హెన్రీ కాలములో, పౌను ఎన్ని ఎగతతలకు, దిగతీతలకు లోను గావింపబడినదో, ఆదేశపు ప్రజలకే యెరుక. బ్రిటిషువారి దుర్భర దారిద్ర్య పరివేదనను, సెసిల్ ప్రభువు, గ్రీన్సు హిస్టరీ ఆఫ్ ది ఇంగ్లీషు పీపులు అను గ్రంథమునందు పూసగ్రుచ్చినట్లు వర్ణించియున్నాడు.


భారతదేశము నేలిన మహమ్మదీయ చక్రవర్తులలో, టుగ్లకు అనంతరం నాణెముల సంస్కరణ కుద్యమించినవాడు అక్బరు. ఒకే విధమగు, తూకం, వన్నెగల, వెండితో, నాణెములు ముద్రింపించి, నాణెముయొక్క విలువ అదే నాణ్యము గల ముద్ద లోహపు విలువతో కొంచెం యించుమించు సమతుల్యంగానుండవలె నని శాసిస్తూ, తన పాలిత దేశమంతటా ఒకే విధమగు నాణెము చలామణీ యందుంప జూచినవాడితడే. ప్రభుత్వేతరులు నాణెములను ముద్రించకూడదని నిషేధించినవాడకూడ యీతడే. పాటకజనసముదాయమున కందుబాటులో నుండుట కను వుండునట్లు, రాగితో చిల్లరనాణెములు ముద్రింపబడుట కనుమతింపబడినది యితనికాలములోనే. నాణెముల ముద్రణమునకు వినియోగింపబడు వివిధ లోహములకును, ఒకదానితో మరియొక దానికి తరతమము లేర్పర్పబడినది. 40 రాగినాణెముల కొక వెండినాణెము, 10 వెండినాణెముల కొక బంగారునాణెము లభించేవి. ఈ తరతమములు, అప్పటికి, వెండిబంగారము, రాగి యుత్పత్తులను బట్టిన్నీ, ప్రజల కాయా లోహములయందుండే అపాయ్యతనుబట్టిన్నీ నిర్ణయింపబడేవి. ముద్దలోహములను, ప్రభుత్వ టంకసాలకు గొనిపోయి, నాణెములుగా ముద్రింపించుకొనగోరినవారికి, స్వల్ప మజూరీ పుచ్చుకొని, కోరిననాణెములు ముద్రించి యిచ్చే సౌకర్యముండేది. ఇతని కాలములోనే వెండినాణెమునకు 'రూపాయి' అనే పేరు కలిగినది. ఇతని కాలములో 'మొహరీ'లను బంగారునాణెములుకూడ చలామణీలో వుండేవి.

భారతదేశమందలి మొగలాయి ప్రభుత్వ అంతిమదశనాటికి, రమారమి 200 రకముల బంగారు నాణెములును, 556 రకముల వెండి నాణెములును, 214 రకముల విదేశముల నాణెములను తిరుగాడుచుండెడివని చరిత్రకారులు వ్రాసియున్నారు. కొంతకాలమువరకు భారతదేశములో గవ్వలుకూడ చలామణీయందుండేవి. సాధారణముగా భారతీయులలో, ఒకడు తన నిర్ధనత్వమును వెలడింపవలసివచ్చినప్పుడు "నావద్ద నొక చిల్లిగవ్వయినా లేదు" అనుటను బట్టియు, ఒకనికి సహాయముచేయ నిష్టములేనప్పుడు "నీకొక గుడ్డిగవ్వనకూడా యివ్వను" అను వాడుకపదములనుబట్టి, గవ్వలుకూడ వాణిజ్య వ్యాపారములందు కొలమానములుగా గణుతింపబడుచుండెడివని యూహింపనగును. "కౌడీకకాంనైషడీకపుర్యత్‌నై"అనే మహమ్మదీయ లోకోక్తినిబట్టి, యీ గవ్వల కొలమానం మహమ్మదీయుల సాంప్రదాయమా అనే అనుమానమునకుకూడ తావుండకపోదు.

వీటి నన్నిటిని సమన్వయించి చూచినచో, భారతదేశమునందు నాణెముల చలామణీ, పదార్థముల నిచ్చి పుచ్చుకొనుటలలో, కొలమానములుగా వినియోగింపబడెడివిగాని, మారకపు విధానములో ఒకరి నొకరు మోసగించి అక్రమపు లాభము సంపాదించు ఉద్దేశముతో సృష్టింపబడినవి కావని సువ్యక్తము కాగలదు. భారతదేశమందు మొగలాయీసామ్రాజ్య మంతరించినది. ఆంగ్లేయులు కాలూనారుగాని, అప్పటి కింకను, ఫ్రెంచి, డచ్చి, పోర్చుగీసు మొదలగు వైరివర్గపువారు భారతదేశమునందు విడిసియుండుటవలన, వంటనే తీవ్రసంస్కరణల కుద్యమించక, చాలకాలమువరకు మొగలాయీల పరిపాలనావిధానమునే అనుకరిస్తూ వచ్చారు. వ్యవహారకాండకు సంబంధించిన కార్యకలాపములకు సంబంధించిన రాజకీయ పారిభాషికపదము (*Nomenclature*) లన్నీ చాలవరకు నేడుకూడ వారివే.



ఇరులర్ గ్రామం



ఇరులర్ యువతులు



,, పులులనుకూడా కొట్టగల ఇరులర్ ఆయుధం



ఇరులర్ "ఇంటిపెద్ద"



ఇరులర్ కన్య



ఇరులర్ "ఇల్లాలు"

ఇరుళజాతి ఆదిమవాసులు

శ్రీ వెన్నెలకంటి రాఘవయ్య, ఎం. ఎల్. ఏ.

కోయంబత్తూరు, నీలగిరి, కొంతవరకు చెంగల్‌పట్టు జిల్లాలలో నివసించే ఆదివాసులకు ఇరుళలు అని పేరు. కోయన్ అను ఇరుళ నాయకుడు క్రొత్తగా నిర్మించుకున్న పుత్తూరుకే అతని జాతిని అనుచరులను ప్రక్కనున్న అట్టపాడి కొండలకు తరిమి ఆ ప్రదేశాన్ని ఆక్రమించుకొని ప్రస్తుతపట్టణపు పునాదులను నిర్మించుకున్న ఆధునిక ప్రజలు కోయంబత్తూరు అని పేరు పెట్టినారని స్థలపురాణము. సారవంతమైన లోయలనుండి కొండగుహలలోకి ప్రతిచోట తరుమబడ్డ ఆదివాసుల దుఃఖకరమైన చరిత్ర అన్నిచోట్ల ఇట్టిదే. కోయంబత్తూరుకు 10 మైళ్ల లోనున్న అట్టపాడి కొండలకు అసలుపేరు అష్టపదికొండలు అని. కొండలుండే ఉనికినిబట్టిగాని, అచ్చట పెరిగే ఎనిమిది కోనలుగల ఆకులనుబట్టి గాని ఈ పేరు వచ్చిఉండవచ్చును.

అష్టపదికొండలు 3000 అడుగుల ఎత్తు. అచ్చటచ్చట ఒకటి రెండు సోనలు వందలకొలది మెలికలు తిరుగుచూ, కుళ్లిన ఆకు అలం పశుపక్ష్యాదులు వేసిన పెంటతోనూ మాలిన్యమైన దుర్గంధపు నీటిని, కొండలను అనాదినుండి అంటుకొనియున్న బీదప్రజలకు అందజేయుచుండును. ఇచ్చట ఉన్న పదివేలమంది ఇరుళలకు ఈ నీరే ఆధారము. మచ్చునకైన ఒక్క బావికూడ ప్రభుత్వము త్రవ్వించిన పాపాన బోలేదు. ఎన్నో వేల సంవత్సరములనుండి, మన్నెపు జ్వరం, పంటిబబ్బులు, బల్లవ్యాధి, పాలిపోయి రక్తహీనమైన ముఖములులేని వ్యక్తే కనపడదు. చిరకాలపు జుగుప్సవల్ల, అగాధమైన అజ్ఞానమువల్ల, ఎడతెరిపి లేని ఆకలివల్ల మలమలమాడిన ఇరుళజాతి వేయి సంత్సరాలక్రింద ఎట్లుండినదో ఇప్పుడుకూడ అట్లే యున్నది.

ఇరుళలు, యానాదులు, చెంచులు ఒకే తెగవారని నా అభిప్రాయము. వీరి కందరికి అలవాట్లలోను, చూపులలోను, పద్ధతులలోను అనేక పోలిక లున్నవి. చిట్టినెత్తి, సన్నని కాళ్లు, ఇరుకైన నొసలు, పొడుగైన పొట్టలు నిర్మలమైన కండ్లు, కండలుతిరిగిన చేతులు చట్టిముక్కులు అందరికి సమానమైన లక్షణాలు. యానాది చిందు, చెంచునాట్యము, ఇరుళ నృత్యము చాలమట్టుకు ఒకటిగానే ఉండును.

ఇరుళజాతి భాష మలయాళము అరవము మిశ్రమము. స్త్రీలు ఎదురు రొమ్మువరకు మలయాళీలవలె చీరను రోలికి గుడ్డ చుట్టినట్లు చుట్టుకుంటారు. పాలిండ్లు కనుపడకుండునట్లు వివిధ రంగుల పూసల పేర్లను విపరీతముగ ధరిస్తారు. చెవుల్లో చెవ్వాకులు, దీర్ఘంగా సాగుచుండు బరువైన విత్తళి ఉంగరాలు, రెట్టలకు, మణికట్టులకు చుట్టుకొన్న నల్లపూసల పేర్లు, వెండి, పావలా, బేడ, అర్ధరూపాయల నాణ్యములకు బొందలు చేసి గుచ్చుకొన్న దండలు ఇరుళలకు అతి ప్రియమైన ఆభరణాలు. నల్లని వెంట్రుకలు కురుచగా ఉన్నప్పటికీ అందమైన ఉంగరాలు తిరిగి, తెరలు తెరలుగా శిరోభాగాన్ని కప్పుచుండును. జెడ వేసుకున్న స్త్రీ ఒక్కరుకూడ నాకు కనుపించలేదు. స్త్రీలకు మనవారి కున్నంత సిగ్గు లేదు. సుందరమైన వక్షస్థలాన్ని ప్రదర్శించుటకు వీరి కున్న కోర్కె ఆదివాసుల కందరికీఉన్న వాంఛే. ఎన్ని సొగసులు చేసినప్పటికీ ఇరుళస్త్రీలు అందగత్తెలని ఎవరు అనజాలరు.

ఇరుళల పేర్లు విచిత్రంగా ఉంటాయి. పౌరాణికమైన పేర్లకన్నను, పట్టణాలపేర్లే వారికి చాల యిష్టము. పుదుచ్చేరి, మద్రాసు, మధుర, తంజావూరు, కలకత్తా ఇట్టి పేర్లు అనేక స్త్రీల కుండుట వింతైన విషయము.

ఇరుళస్త్రీలు ప్రసవసమయంలో భర్తనుతప్ప మరెవ్వరిని ప్రక్కన ఉండనీయరు. స్త్రీలు సహితము పోకూడదు. వారసత్వపు హక్కులను నిస్సంశయముగ నిర్ణయించుకొనుటకో లేక మరే కారణమువల్లనో ఈ ఆచారము నేటికి వారిలో ప్రబలియున్నది. మంత్రసాని సహాయము తీసుకోనందువల్ల మరణించే బాలింతల సంఖ్య పెరుగుచున్నదని నేను కనుగొన్న చింతనీయమైన సంగతి. ఇరుళలు కూడ యానాది చెంచులవలెనే సోమరితనానికి ప్రాలుమాలికకు పేరుపడ్డవారు. చద్దిగంజి త్రాగి, పొగాకు తొడిమను బుగ్గను పెట్టుకొని, గోచికి పోగా మిగిలిన మురికిపాతను భూమిమీదపరిచి, నెత్తిపైకి వచ్చిన సూర్యకిరణములు సూటిగా కండ్లలో పొడిచే వరకు వేపచెట్టునీడలో నిద్రాదేవిని ఆశ్రయించియుండు ఇరుళలను కుప్పలు కుప్పలుగా చూడగలము. ఇక వెన్నెలరాత్రులలో పొడుగైన కోయమద్దెలలను మెడలకు తగిలించుకొని, మైళ్లకొలది కనుపడుచుండు నెగళ్లవెలుతురులో వేకువజాము కోడికూతవరకు పాటలు పాడుచు, చిందులు త్రొక్కుచు, స్త్రీపురుషులు పైన ప్రక్కన పడుచూ ఆనందడోలికలలో ఊగు నిత్యసంతోషము పచ్చతోరణముగల జాతే ఇరుళజాతి. ద్వారముగాని ద్వారబంధముకాని ఎరుగని ఇరుళ వెదురుబొంగుల కురుచగుడిసెలో రేపు అన్నమాటే వినబడదు. సుఖమన్నమాటే కనపడదు. ఇంటి కెదురుగానున్న వృక్షాగ్రమందలి తేనెతెట్టె, జంట బాయకుండ, వెన్నంటి తిరుగుచుండు ప్రియురాలి జోడునీడ కండ్లలో మెదలుచున్నంతవరకు ఇరుళహృదయములో దుఃఖముండదు. కొరత యుండదు, క్రోధ ముండదు.

ఈ ప్రాంతములలో విచ్చలవిడిగ సంచరించు పెద్దపులి గాండ్రింపు, అడవిఏనుగుల మోకరింపు, ఎలుగుబంట్ల యిగిలింపు ఇరుళలను ఇంతవరకు భయపెట్టలేదు. మొలత్రాడులో చెక్కుకున్న వాడియైన మడ్డుకత్తి వెదురుబొంగుల విరుగుడుకే కాక శత్రుతల నరుకుడుకు కూడ అతనికి ఉపయోగించుచుండును.

ఆంధ్రభాషాసేవ :

మహామహోపాధ్యాయ, కళాప్రపూర్ణ, శాస్త్రిరత్నాకర,

శ్రీ తాతా సుబ్బారాయశాస్త్రులుగారు

శ్రీ బులుసు వేంకటరమణయ్య

జగద్విఖ్యాత పండితులగు శ్రీ తాతా సుబ్బారాయశాస్త్రులుగారి పేరెఱుఁగని విద్వాంసులు భారతదేశమున నుండరు. శ్రీ శాస్త్రులుగారు సర్వశాస్త్రములందును గొప్ప పండితులగుటయేకాక, లౌకిక విషయములందును అసమాన ప్రతిభను కల్గి యుండిరి. అయినను లౌకిక విషయములతో ఎక్కువ ప్రమేయములేక సర్వదా విద్యాదానమునందే తమ జీవితమును గడపిరి. సంస్కృత పండిత లోకమున శ్రీ శాస్త్రుల వారిదే అగ్రతాంబూలము!

శ్రీ శాస్త్రులుగారు సంస్కృతమున గొప్ప యుద్గ్రంథములను వ్రాసియున్నారు. ఎప్పుడును సంస్కృతమున గల శాస్త్ర గ్రంథములనే పాఠము చెప్పెడివారు. కావున శ్రీ శాస్త్రుల వారు కేవల సంస్కృతముననే గొప్ప విద్వాంసులనియు, ఆంధ్రభాషతో వారికి పరిచయము లేదనియు కొందరి యూహ.

ఇట్టి యూహకు కారణము లేకపోలేదు. శతాబ్దుల తరబడి గమనించినను, తెలుగునాట వెలసిన సంస్కృత పండితులు సంస్కృతమునందే గొప్ప గ్రంథములను వ్రాసి తమ కీర్తి నాచంద్రతారార్కము నిలుపజాలిరి; వారు తెలుగున వ్రాసిన గ్రంథములు దొరకనందున- వారికి తెలుగున పాండిత్యము లేదని చెప్ప వీలు కాకున్నను- అందు, తగిన శ్రద్ధగాని, గౌరవము గాని లేకుండెనని యూహింపవచ్చును. ప్రతాపరుద్రీయకర్త విద్యానాథుడును, రసగంగాధరాద్యనేకకృతికర్త జగన్నాథ పండితరాజును ఉదాహరణములుగా చెప్పనగును. కాని, యొక సంగతి. సంస్కృతమున పాండిత్యము సంపాదించిన పిదప, కొంచెము ప్రయత్నించినచో, తెలుగున పాండిత్యమును గడించుట సుకరము, నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, శ్రీనాథుడు, పెద్దన, భట్టుమూర్తి, తిమ్మన, రామకృష్ణుడు మున్నగు ఆంధ్ర మహాకవులందఱును తొలుత సంస్కృతమున గొప్ప పాండిత్యమును సంపాదించినవారే! ఈ సంగతిని వారి గ్రంథములే చాటుచున్నవి కదా!

పండిత పక్షపాతియు, అభినవాంధ్ర భోజులును, విజయనగర సంస్థాన ప్రభువునగు శ్రీ ఆనంద గజపతి మహారాజులుంగారు ఎల్లపుడును పండితగోష్ఠిలో కాలము గడపెడివారు. కవులన్న ఆయనకీసడింపు. ఒకప్పుడు కొందఱాంధ్ర కవులు వారి దర్శనమునకు వచ్చి గోష్ఠిలోని విద్వాంసులు కవిత్వము నెఱుగరని పలుకగా పండితులకసాధ్య మేమియు లేదని తెలుపుచు ఆస్థానపండితులు రెండురోజుల గడువులో ఆంధ్రచ్ఛందోవ్యాకరణముల నభ్యసించి, మూడవదినమున కవిత్వము చెప్ప బ్రారంభించిరట! శ్రీ కొల్లూరి కామశాస్త్రి, శ్రీ మండ చిట్టి కామశాస్త్రి, శ్రీ పేరి కాశీనాథశాస్త్రి ప్రభృతు లట్టివారే! శ్రీ కాశీనాథశాస్త్రులుగారు (శ్రీ సుబ్బరాయశాస్త్రులుగారి మామగారు) 'పూర్వ శాకుంతల నాటకము'ను తెలుగున రచియించియున్నారు.

పయి విద్వాంసులవలెనే శ్రీ సుబ్బారాయశాస్త్రులుగారును ఆంధ్ర ప్రబంధములను చదువకున్నను, ఆంధ్ర లక్షణముల నభ్యసింపకున్నను సందర్భము వచ్చినపుడు వానిలోని బాగోగులను సయుక్తికముగ వెల్లడించెడివారు. మాఱుమూలల నుండు చమత్కారపద్యము లెన్నియో వారికి కంఠస్థములు. ఎద్దైన కష్టమైన శాస్త్రీయ విషయమును బోధించునపుడు సందర్భమును కల్పించి, ఏదైన పద్యమును చదివి, అందలి చమత్కారములను వెల్లడించి, అంతేవాసుల బుద్ధిని విషయగ్రహణమునకు ఉన్ముఖముగా చేయుటలో శ్రీ శాస్త్రులవారి కీడు మఱెవ్వరును లేరనవలెను.

వ్యావహారికాంధ్రవాదము వెలువడిన తొలి రోజులలో, ఆ వాదమును సమర్థించుచు శ్రీ గిడుగు- రామమూర్తి పంతులుగారికి చేదోడు వాదోడుగా నున్నవారిలో శ్రీ సుబ్బారాయశాస్త్రులుగారు అగ్రగణ్యులు. శ్రీ శాస్త్రులుగారును, శ్రీ గురుజాడ- అప్పారావుగారును, శ్రీ రామమూర్తి పంతులుగారును వ్యావహారికాంధ్రవాదమునకు పునాదులయిన మూర్తిత్రయము. శ్రీ అప్పారావు పంతులుగారు గ్రంథ రచనకు దిగుటచేతను, శ్రీ రామమూర్తి పంతులుగారు పెక్కు సభలలో ఉపన్యాసములు, వాదోపవాదములు నొనర్చుటచేతను వారు వ్యావహారిక వాదమునకు మూలకందము లని పేరు పొందిరి. శ్రీ సుబ్బారాయశాస్త్రులుగారు అట్టివానిలో దిగక తటస్థులయి యుండి, అడిగిన వారికి మాత్రము తమ యాశయములను వెలిబుచ్చుచుండెడివారు. శ్రీ శాస్త్రులుగారు వ్యావహారిక భాషాభిమానులైనను, గ్రాంథికవాదుల మనస్సులను నొప్పింపక ఉభయపక్షములవారి మన్ననలకును పాత్రులగుచుండెడివారు.

శ్రీ శాస్త్రులుగారు తాము వ్రాసిన "ద్వైతాద్వైతములు" (విజయనగరము- ఆంధ్రవిజ్ఞాన సమితి ప్రచురణము) యొక్క ఉపోద్ఘాతములో-

'ఈ పరివర్తనములో గ్రాంథికభాష భాషా పరిసిద్ధిని, దృష్టిలో నుంచక, నేనుపన్యాసములు చెప్పునపుడు వాడుకచేయు వ్యావహారిక భాషలో వ్రాసితిని ఇందు విషయము ప్రధానము; కాని భాష ప్రధానము కాదు. కావున భాషనుగూర్చి విశేషదృష్టిని పెట్టలేదు. గ్రాంథిక భాష చమత్కృతిప్రధానములగు గ్రంథములలో ముఖ్యముగ నాదరింపక తీరనిది. విషయప్రధానమగు గ్రంథములలో నంతగ నాదరింప నక్కర లేదని నా యభిప్రాయము. ఈ నా యభిప్రాయమును గ్రాంథికభాషావాదులు మన్నించెదరు గాక!'

అని వ్రాసియున్నారు. తాము రచించిన 'ధర్మప్రబోధము' నందు కూడ—

'ఈ వ్యాసమును వ్రాయుటలో భాషాసౌష్ఠవము నంతగ గమనించలేదు. తరచుగ వ్యావహారిక భాష యిందు జొరబడి యున్నది. కనుక గ్రాంథికభాషావాదులు, వ్యావహారిక భాషావాదులు నన్ను మన్నించెదరుగాక!'

అని శ్రీ శాస్త్రులుగారు వ్రాసియున్నారు.

పయి గ్రంథములు రెండను గ్రాంథికమునకు మిక్కిలి చేరువగా నున్న శిష్టవ్యావహారభాషలో నున్నందున- శుద్ధవ్యావహారిక భాషావాదులకు పయి గ్రంథములు గ్రాంథికభాషా బద్ధములనియే తోచవచ్చును. కాని అది సరికాదు. శ్రీ రామమూర్తి పంతులుగారును శిష్ట వ్యావహారిక భాషయే గ్రాహ్యమనిరి గాని, యిచ్చవచ్చినట్లు వ్రాయవచ్చునని ఎప్పుడును చెప్పలేదు.

౧౯౩౧-లో ఆంధ్రసాహిత్య పరిషన్మహాసభ విశాఖపట్టణములో సమావేశమైనపుడు శ్రీ సుబ్బారాయశాస్త్రులవారే దాని కధ్యక్షతను వహించిరి. పరిషత్తువారి నిర్బంధమువలన, ఆయన దాని కంగీకరింపక తప్పినది కాదు. అది శ్రీ జయపురం మహారాజావారగు శ్రీ విక్రమదేవవర్మ మహారాజులుంగారి యాహ్వానమున జరిగిన దగుట, ఆంధ్రదేశమునందలి సుప్రసిద్ధ విద్వాంసులందఱును ఆ సభకు విచ్చేసిరి. ఈ యధ్యక్షవరణము శ్రీ శాస్త్రులవారి శిష్యకోటిలోని నావంటివారికి కొంత వింత కలిగించినది. అది తెలిసికొని శ్రీ శాస్త్రులుగారు 'సంస్కృత

(20 వ పేజీ చూడుడు)

మనరాష్ట్రం, మనదేశం:

మాటలకు చేతలకు మధ్యనున్న దూరం

కాందిశీకుల ఆస్తుల విషయంలో పాకిస్థాన్ పొల్లు మాటలు

వ్యక్తులమధ్యగాని, ప్రభుత్వాల మధ్యగాని ఏ ఒడంబడిక పత్రానికైనా, నాలుక గీసికొనే తాటాకును మించిన విలువ ఉండాలంటే, ఆ ఒడంబడికలో పాల్గొన్న ఇరుపక్షాలూ, ఒడంబడిక పాఠాన్ని, త్రికరణశుద్ధిగా పాటించగలిగిన నాడే సాధ్యమవుతుంది. అల్లాంటి త్రికరణశుద్ధికి హృదయపరివర్తనమూ, సహృదయత్వమూ మూలబీజాలుగా ఉంటాయి. అవే చేకూరగల్గితే ఒడంబడిక పాఠంలో సందులు ఎల్లా దొరకుతాయా, ఒకవేళ సందే దొరకకపోతే, బరిమీరి ఉల్లంఘించుదామనే దుర్బుద్ధీ రెండూ ఉండవు. అందుకనే భారతస్వాతంత్ర్య సమరం సాగిస్తున్నాళ్లూ కూడా, మహాత్ముడు, సమాధానాలకు ఏమాత్రం ఆస్పద ముంటుందని తోచినా, సమాధాన పత్రాలలో నిర్వచనాలూ, సూత్రాలూ, వీట్ల వాచ్యార్థంకన్న, ఆ సమాధానానికి వద్దామనుకొన్న దృష్టిలో, ప్రతి పక్షులలో హృదయపరివర్తన మేమాత్రంగలదా అన్న విషయానికే ఎక్కువ ప్రాముఖ్య మిచ్చేవాడు. అల్లాంటి హృదయపరివర్తనం ప్రతి కక్షిలో కలిగిం దన్ననాడు, ఒడంబడికపత్రపాఠానికి, సమ్మతి చూపించి రావటంలో కొన్నికొన్ని సార్లు,స్వపక్షవిమర్శలకు కూడా ఆయన తట్టుకోవలసివచ్చేది. కాని సహృదయత్వంతో చేసికొన్న ఒడంబడిక అయితే, మాటలను పాలించడంలో ఎక్కువ తఫావతులు రావనే మహాత్ముని నమ్మకం. ఒడంబడిక పత్రంలో మాటలు ఎంత ఆకర్షణీయంగా ఉన్నా ఆ హృదయపరివర్తన అక్కడ లేదని అనిపించిననాడు, మహాత్ముడు, సమాధానపడలేకపోయేవాడు. ఆనిజ్బరం గ్రహించే బ్రిటిష్‌వారు, మాట మార్చుకోడం కన్న మనస్సు మార్చుకోటం ముఖ్యమని గ్రహించి, ఆ రీతిగా ప్రవర్తించి, ప్రపంచం మెప్పును పొందగలిగారు.

భారతదేశం, పాకిస్తానులు చీలిపోయినప్పటి నుంచి అనేక సమస్యలు ఇద్దరిమధ్యా ఉద్భవించాయి. సంప్రదింపులు జరిగాయి. ఈ హృదపరివర్తనం ఏనాటికైనా కలుగకపోతుందా అని ఆశతో భారతదేశం, పాకిస్తాన్ ప్రతి విషయంలోనూ కోరే గొంతెమ్మ కోర్కెల కన్నిటికీ కూడా సమ్మతిస్తూ వచ్చింది. ఆవిధంగానే కాందిశీకుల ఆస్తులు, ఉభయదేశాలమధ్య వాణిజ్యవ్యాపారాలు, ఆర్థికసంబంధాలు మొదలైన అనేకవిషయాలపై, ఉభయదేశ ప్రతినిధులు ఎప్పటికప్పుడు సమావేశమౌతూ, పరస్పరం ఒప్పుకోలుమీదే అనేకఒడంబడికలు చేసుకొన్నారు. ఆ ఒడంబడికలలో ప్రతినిధులు ఒప్పుకొన్న వ్రాతలకు పాకిస్తాన్ ప్రభుత్వం చేతలకూ ఎంత విభేద ముంటోందో, కాందిశీకుల ఆస్తులవిషయంలో జనవరిలో ఉభయదేశాలూ వ్రాసుకొన్న ఒడంబడికను పాకిస్తాన్ ఎల్లా ఆచరణలో పెట్తూన్నది చూస్తే తెలుస్తుంది.

ఈ ఒడంబడికను ఆచరణలో పాకిస్తాను అనేకసార్లు భగ్నం చేసింది. ఇల్లా భగ్నంచేసిన విషయాన్ని మభ్యపరచేందుకు, విషప్రచారం సాగించింది.

అసలు కాందిశీకుల ఆస్తిసమస్యను ధర్మయుతంగా పరిష్కారం చేసుకోవాలనే బుద్ధి పాకిస్తాన్‌కు ఏనాడూ ఉన్నట్లు నిదర్శనాలే దొరకకుండా ఉన్నాయి. ఈ భగ్నపరచటానికి సాకులుగా అబద్ధప్రచారం, ఐక్యరాజ్యసమితిలో కాశ్మీర్ సమస్య సందర్భంలోనే సర్ మహమ్మద్ జఫ్రుల్లా సాగించాడు. భారతదేశంలోని కాడియన్‌లో తన యిల్లు సంపూర్ణంగా భస్మమైపోయిం దని ఆనాడే మిథ్యాప్రలాపం సాగించాడు. ఈనాటికీ ఆ యిల్లు చెక్కు చెదరకుండా అక్కడే నిలచిఉంటటం చూస్తున్న వాళ్ళందరూ భారతప్రభుత్వ ప్రచారభ్రమలో కన్నులు మైకం కమ్మినవారేనేమో !

కాందిశీకుల ఆస్తులు విలువకట్టటంలో ఉభయప్రభుత్వాలు సంప్రదించుకొని తేల్చుకోవలసింది పోయి, పాకిస్తాన్‌లోని ఆస్తుల విషయంలో, భారతప్రభుత్వ ప్రమేయమే లేకుండా, పట్టణప్రాంతాలలో ఆస్తుల విలువలను నూటికి ఎనభైవంతులు తగ్గించింది. ఈమిగిలిన 20 వంతులూ, వసూళ్ళు మొదలైన ప్రభుత్వపు ఖర్చులక్రింద హరించిపోతుంది. ఇక కాందిశీకులకు చేరేది శూన్యమే. కాందిశీకుల భూమిశిస్తులలో నూటికి ఎనభై పాళ్ళుప్రకారము వ్యవసాయపు పన్నులు వసూలుచేసి యియ్యటానికి పాకిస్తాన్ ఒడంబడికలో అంగీకరించింది. కాని ఇంతవరకు శిస్తువసూలు లేదు. కాందిశీకులైన భూకామందు భూముని అమ్మటానికీ, అమరకం చేసుకోటానికీకూడా హక్కు లేదు. ఇక అక్కడున్న ఆస్తులపై, ఇక్కడికి వచ్చేసిన ఖామందులకు దమ్మిడీ గిట్టుబాటు లేదు. అక్కడి ధర్మమూ నీతీ అల్లా ఉన్నాయి.

పరిమితప్రాంతాలలో కాందిశీకుల ఆస్తులను మార్చుకోటాలూ, అమ్ముకొని కొంత సొమ్ము చేసుకోటాలూ, సాధ్యం కాగలందుకే, ఉభయ ప్రభుత్వాల మధ్య కాందిశీకుల ఆస్తుల విషయంలో ఒడంబడికపుట్టింది. ఈ విషయంలో చట్టాలుగాని ఆర్డినెన్సులుగాని చేసుకుంటే పరస్పరం అభిప్రాయాలు కలబోసుకొనేందుకు చిత్తుముసాయిదాలను ఒకరొకరికి అందచేసుకోవాలని ఉంది. కాని ఇల్లా చేయటంలో ఆలస్యానికి ఆస్కార ముంటే అనువుగా చూచుకొని అసలు కావలసిన చర్యలు తీసికోటమే నిలిపివేయటం ఒడంబడికఉద్దేశమే కాదు. తనకు హితవైన విషయాలలో అనేకమార్లు పాకిస్థాన్ తన చట్టాలకే విరుద్ధంగా ప్రభుత్వఉత్తర్వులద్వారా చర్యలు తీసుకొంటూ, ఆ ప్రమేయమే భారతప్రభుత్వంతో తీసుకురాకుండా జరుపుకోగల్గింది. ఇప్పుడు వివాదగ్రస్తమైన ఆర్డినెన్సవిషయంలో జూన్ అనాటికే భారతప్రభుత్వం తన చిత్తుప్రతిని పాకిస్తాన్‌కు పంపింది. ఇది అందినట్లు 17 వ తేదీని అంగీకరిస్తూనే, ఇదేదో ఆకాశంలోనుంచి అకస్మాత్తుగా ఊడిపడ్డ పిడుగంటూ, జఫ్రుల్లా ఖాన్ వర్ణించాడు.

గతవారం కరాచీ సమావేశాన్ని బట్టి జనవరి ఒడంబడిక అమలుజరపాలన్న ఉద్దేశమే పాకిస్థానుకున్నట్లు తోచదు. ఒడంబడిక నిర్వహణను జాప్యం చేసేందుకు ఆర్డినెన్సునే పాకిస్థాన్ అడ్డుగా ప్రయోగించుకొంటూంది. కాబట్టి కాందిశీకుల ఆస్తులమారకం, ప్రభుత్వాలమధ్యనే ముఖాముఖి జరిగిపోతే తప్ప, జనవరి ఒడంబడికవల్ల ఫలితం లేదని, పాకిస్తాన్ చర్యలు నిరూపిస్తున్నాయి.

రామపాదసాగరం ప్రాజెక్టు

భారతప్రభుత్వమంత్రి గాడ్గిల్‌గారు రామపాదసాగరం ప్రాజెక్టు ఇప్పట్లో తలపెట్టబోయేది లేదని ఖరాఖండిగా చెప్పేశారు.

తొందరపడి వాగ్దానాలు చేసి తాత్కాలికంగా కీర్తి సంపాదించుకొని, తరువాత మాట చెల్లించుకోలేకపోవటం తమ అభిమతం గాదని, అభిప్రాయం వెలిబుచ్చారు. "ప్రజానుమతం" లోని సవ్యాపసవ్యాలను వివరించారు. కీర్తి విషయం ఎల్లా ఉన్నా, సర్వత్రా ప్రజలలో తమపట్ల, కాంగ్రెస్ ప్రభుత్వం కాబట్టే సానుభూతి ఉందనే విశ్వాసం వెలువరించారు.

రామపాదసాగరం విషయంలో, వాగ్దానాలు చెయ్యటం ఎల్లా ఉన్నా, అది సత్వర సాధ్యం అన్న అభిప్రాయం, నాయకులేమి, ప్రభుత్వమేమి ఒక.రేమిటి అందరూ ప్రజలలో సంపూర్తిగా కల్గించారు. ఎప్పటికప్పుడు తాత్సారం జరగటానికి, తాత్కాలిక కారణాలేవో చెప్పుకొంటూ వచ్చారు. కాబట్టి ప్రజలలో ఈ "కీర్తి" సంపాదించుకొనే విషయంలో, ప్రభుత్వంగాని ప్రజానాయకులుగాని తమ శక్తి లోపం ఏమాత్రమూ చేయలేదు.

ఇప్పుడు ప్రజలలో కల్గించింది-"ఉపకారం చెయ్యమని అడగటానికికూడా మనకు అధికారం లేదే!" అన్న నిరుత్సాహం, నిర్వీర్యతా మాత్రమే.

భారతప్రభుత్వం తలపెట్టిన ప్రాజెక్టులన్నిటికీ మొత్తం 1200 కోట్ల రూపాయలు కావాలని అంచనా వేశారు. 4,5 ఏళ్లల్లో జరుగగలవని అనుకొన్న వానికే తపస్సు ప్రస్తుతంప్రారంభించామన్నారు.

రామపాదసాగరం నిర్మాణం సాధ్యమే అనే లక్షణంగా ఒప్పుకొంటున్నారు.

దాని నిర్మాణానికయ్యే ఖర్చు అంచనా నాటినాటికి పెరుగుతూవచ్చింది. ఆ నిర్మాణంవల్ల దేశసౌభాగ్యం పెరుగుతుం దన్న విశ్వాసం మాత్రం మంత్రిగారికి తమ ప్రస్తుత ఆచరణకు అనుకూలంగా సన్నగించిపోయింది. ఖర్చు అంచనా ఎన్నిరెట్లు పెరుగుతూ ఎచ్చిందో లాభం అంచనా అంతకు పదిరెట్లు తగ్గిపోయి ఉండాలి.

తాత్కాలికంగా ఆహారసమస్యను ఇది తీర్చబోదు. తక్కినవి తీరుస్తున్నవి. తక్కినవి తీర్చగలిగాక, అంటే సమస్య తీరిపోయాక, దీని ఖర్చు అంచనా, ప్రాజెక్టుకు పట్టే కాలవ్యవధీ మరి ఇంతంతగా పెరిగిపోయి, అసలు దీని అవసరమేమన్నీ కాటకాలు వచ్చేదాకా పట్టకపోవచ్చును. అప్పుడు మళ్లీ తాత్కాలికావసరానికి ఇది పనికిరాదు. దీని తాహతులో ఉన్న ప్రాజెక్టులు, అంటే పెద్ద ప్రాజెక్టులు ఇతర స్థలాలలో మూడు మొదలెట్టి ఉండటంచేత ఇప్పుడు ఇది మొదలెట్టే ఖర్చు కూడా భరించటం ప్రభుత్వానికి కష్టమే కావచ్చు కాని వాటన్నిటికన్నకూడా ఒకనాడు ప్రభుత్వంలో ప్రధాని మొదలు సర్వులకూ అతిఆకర్షణీయంగా కనబడ్డ ఈ ప్రాజెక్టు, "మంచిదే గాని ఇప్పుడు లాభంలేదు"అంటూ ప్రతివారూ చప్పరించవలసిన స్థితి రావటం, కేవలం ఆర్థికనీతా, లేక ప్రభుత్వరాజనీతిలో భాగమా అని ఆంధ్రప్రజలు ఆశ్చర్యపోవక తప్పదు. పెన్న, కుముద్వతి, అప్పర్ పెన్న మొదలైన తాత్కాలిక ప్రాజెక్టుల నిప్పుడు మొదలుపెట్టి ప్రజలను ప్రభుత్వము కొంత సంతోషపెట్టాము అనుకొంటే తప్పు లేదు. కాని ఈ దీర్ఘకాలప్రణాళికలలో చేరేవాటిని, మళ్లీ విచారణకమిటీలు, పరిశీలన కమిటీలు వేస్తున్నామని తాత్సారంచేస్తూ గడపకుండా, ప్రారంభానికి నిర్ణీతదినాలు నిశ్చయించి, పుష్కరానికి కాకపోతే మానె,రెండు పుష్కరాలకైనా చేయగల్గుతామని క్రియాఋజుత్వం చూపిస్తే ప్రభుత్వం ఇప్పటికన్నా ఎక్కువగా ప్రజల సానుభూతిని పొందగల్గుతుంది.

మద్రాసు రాష్ట్రంలో పంచాయితీ రాజ్యం

గ్రామస్వరాజ్యంద్వారా మహాత్ముడు లక్షించిన రామరాజ్యస్థాపనకు మద్రాసు స్థానిక స్వపరిపాలనాశాఖామాత్యులు గా॥కల్లూరి చంద్రమౌళిగారు తామా పదవిని స్వీకరించిననాడే సంకల్పించుకొన్నారు. రెండుసంవత్సరాలుగా వారి అభిప్రాయాలు ప్రజ లందరికీ తెలిసే ఉన్నవి. సావధానంగా ప్రతివారూ చర్చించి, సూచనలు చేయగలందుకు తగిన వ్యవధి నిచ్చాకే మొన్న వారు ఈ బిల్లును శాసనసభలలో ప్రవేశపెట్టారు.

శాసనసభ్యుల చర్చలవలన, సభ్యు లందరూ, బిల్లు స్థూలసూత్రాల కన్నిటికీ ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నారనీ, ఇది రానున్నందుకు హర్షిస్తున్నారనీ విదితమయింది.

మంత్రిగారు బిల్లును ప్రతిపాదిస్తూ లోపరహితమని తాము అనటంలేదనీ, సవరణలు చేసుకొనేందుకు సిద్ధముగానే ఉన్నామని వివరించి, చర్చానంతరం బిల్లును సెలక్టుకమిటీకి విచారణకై అర్పించారు.

శాసనసభ్యులలో పెక్కుమంది బిల్లు విషయంలో చెప్పిన స్వల్ప అభ్యంతరాలలో పంచాయితీలు కూడా కొత్తగా పన్నులు గ్రామస్థుల మీద విధించటంమీదగల ఆక్షేపణ ముఖ్యమైంది.

గ్రామస్థులపై ఎప్పటికే కీలపన్నుల ఎద్దడిలో పంచాయితీ పేరిట కొత్తపన్నులు సృష్టించటం గ్రామస్థులు హర్షింపలేని విషయమే. అదీకాక పంచాయితీరాజ్యం రావాలని ఆశించిన వారంతా, నేటి మ్యునిసిపాలిటీ, డిస్ట్రిక్టు బోర్డుల, నమూనాలే ప్రతిగ్రామంలోనూ వెలవాలని ఆశించలేదు. రాష్ట్రప్రభుత్వం విడివిడి గ్రామాలపరంగా చేయవలసిన కార్యక్రమం అంతా, ఆయా గ్రామస్థుల స్వపరిపాలనకు వదలాలనేదీ ఆ కోర్కెలోని అంతరార్థము. అనగా రాష్ట్ర కేంద్రప్రభుత్వాలు వసూలు చేస్తూన్న పన్నులోనే, గ్రామసౌభాగ్యానికి కేటాయించి, పంచాయితీ ప్రభుత్వంచేత గ్రామస్థులకు అనుకూలంగా ఆయా అభివృద్ధిప్రణాళికలను అమలుజరిపించుటయే ఎక్కువ సబబుగావచ్చును.

పంచాయితీలపై అధికారం, డిస్ట్రిక్టుబోర్డు మ్యునిసిపాలిటీలపై అధికారం ఉంచుకొన్న విధానంలో కాకుండా, సరళపద్ధతిలో ప్రభుత్వం తన చేతిలో ఉంచుకోవలసివస్తుంది. అనగా అత్యవసరాలలో తప్ప, రాష్ట్రప్రభుత్వం పంచాయితీలకు సలహాదారుగా వ్యవహరిస్తూ, రాష్ట్రక్షేమావసరాలైన స్వల్పమాత్రపు అధికారాలనే, పంచాయితీ సూత్రగౌరవానికి భంగకరం కానంతమాత్రం స్థితిలోనే తమ అధీనంలో ఉంచుకోవలసి వస్తుంది. కాబట్టి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల పేరిట, గ్రామపార్టీల విభేదాలను రాష్ట్రమంత్రివర్గం తనకు అనుకూలంగా దుర్వినియోగం చేసుకోలేని స్థితిలోనే, ఆ అధికారాలను నిర్ణీతం చేసుకోవలసిఉంటుంది. అల్లా జరిగే పక్షంలో, గ్రామంలో పార్టీలు, పార్టీకక్షలు, పదవులకై ప్రాకులాటలూ ముందు కొంత చెలరేగినా, ప్రయోజనకరంగా పైవాళ్ల ఆశ్రయబలం ఉండే అవకాశం తగ్గిపోవటంవల్ల, గ్రామక్షేమదృష్టే ప్రజలలో ప్రబలి, ప్రజాస్వామ్యసూత్రాలకే చివరికి జయం వాటిల్లే అవకాశం ఉంటుంది. ప్రజాస్వామికరిపబ్లిక్ స్థాపనకు దోహదంగా, ఈబిల్లు తయారయేటట్టు, సెలక్టుకమిటీ చేయవలసివుంది.

అధ్యక్షుని ఎన్నిక ప్రజ లందరివల్లా జరగాలనటంలో కేవలం పార్టీప్రాబల్యంతో అధికారం సంక్రమింపచేసుకొన్న మ్యునిసిపాలిటీలు, జిల్లాబోర్డులు వలెకాక, గ్రామప్రయోజనం మనస్సులో కలవారే, గ్రామస్థుల కందరకూ అభిమానులే అధికారస్థానం ఆక్రమించుకొని న్యాయనిర్వహణ జరిపే ఆస్కారముంటుంది. మొదటిలో పార్టీ కక్షల ప్రభావంవల్ల, పార్టీబలం లేని అధ్యక్షుడు, నిర్వహణాధికారం లేని మెజారిటీ పార్టీలు వచ్చే అవకాశం ఉందిగాని, గ్రామపరిధి కొద్దిది కావటంచేతా, గ్రామక్షేమం విషయాలలో పల్లీయులకు జన్మతః ఇంగితజ్ఞానము అధికంగా ఉండటంచేతా ఈ వ్యత్యస్తాలు కొద్దికాలంలోనే సమసిపోయే అవకాశ ముంది.

అపహృతస్త్రీపునరుద్ధరణలో

కష్టనిష్ఠురాలు

శ్రీమతి మృదులా సారాభాయి

"నా కూతుర్ని ఎందుకు రానివ్వటంలేదు, జగ్జిత్? వాళ్ల వన్నీ అబద్ధాలు. ముస్లిమునని అది అన్నా నమ్మకు. ఏ సాక్ష్యాలూ నమ్మకు. అవన్నీ దొంగసాక్ష్యాలు" అంటుందొక గర్భశోకపు తల్లి.

"నీ కూతురు ఎన్నడో ఇస్లాము పుచ్చుకొని లేచిపోయిందంటున్నారే?" అంటాడు పునరుద్ధరణాధికారి.

"నామాట నమ్మతావా, వాళ్ల అబద్ధాలు నమ్ముతావా?" అంటుంది తల్లి.

ఇండియానుంచి ఒక 25 వయసుగల స్త్రీని ఉద్ధరించి శిబిరానికి తెచ్చారు. ఆమె ఏ ప్రశ్నకూ సమాధానం చెప్పలేదు. అందరూ వెళ్లిపోయి శిబిరాధికారి మాత్రమే ఉన్నప్పుడామె ఏడవ నారంభించి, అదివరకు తాను చెప్పిన మాటలన్నీ మార్చి చెప్పనారంభించింది. ఆమె హిందువు కాదట. అల్లరుల సమయంలో ఆమెనెవరో ఎత్తుకుపోయి అమ్మేశారట. అనేకసార్లు అమ్మబడి ఆమె చివరకు ఒక "విశాలహృదయుడూ, గాంధీ అనుసారకుడూ అయిన కాంగ్రెసువాది" పాల పడింది. ఆమెపై కనికరం కలిగి ఆయన ఆమెను మూడు నెలల క్రితం ఒకరికి పెళ్లిచేశాడు.

"ఆ రాక్షసులు నావారిని చంపి నా మానం తీసివేసి, నామాట ఎవరూ నమ్మకుండా ఉండ గలందులకు 'ఓం'అని పచ్చ పొడిచారు. రక్షించబడటానికి నాకు లభించిన అవకాశాలన్నిటినీ ఈ పచ్చబొట్టుతో పాడుచేశారు. ఏమి తప్పుచేసి నేనీ యమచెర అనుభవిస్తున్నాను?" అని ఆమె అన్నది.

ఈ తరుణంలో ఒక "కాంగ్రెసు పెద్దా," ఒక పురోహితుడూ, ఆమె భర్తా, ఆర్య సమాజ కార్యదర్శి, మరికొందరు గ్రామ పెద్దలూ శిబిరానికి వచ్చారు. "కాంగ్రెసు పెద్ద" నాతో "ఇదేమిటి? హిందూ స్త్రీని పునరుద్ధరించి పాకిస్తాను పంపేస్తారా? ఎట్లా చేస్తారో చూస్తాను. ఆ స్త్రీని నాకిచ్చేయండి. లేకపోతే పండిట్‌జీకి, సర్దార్‌జీకీ చెబుతాను. ఈ మనిషికి ఇద్దరు పిల్లలున్నారు. ఈమె మొగుడు మంచి కాంగ్రెసువాది" అని దబాయించాడు.

ఈయనచేత నెమ్మదిగా మాట్లాడించడమే కష్టమయింది. సాక్ష్యాలూ, రుజువులూ అడిగితే ఆయన మండిపడ్డాడు. కాని నేను అతి కష్టంమీద వారిని దారికి తెచ్చాను. ఆమె వివాహం ఏడేళ్ల క్రితం జరిగినటు ఆర్యసమాజ కార్యదర్శీ, పురోహితుడూ సర్టిఫికేటు చూపారు. పిల్లల పుట్టుకను గురించి దాఖలా చూపారు. ఈ సాక్ష్యంమీదనే నిర్ణయం జరిగితే వారు నెగ్గుతారు. కాని క్రాసుపరీక్షలో వారు పడిపోయినారు. ఆమె చెప్పినదంతా నిజమని తేలింది. వీరు చూపించిన దాఖలాలన్నీ ఆ మొగుడి మొదటిభార్యకు సంబంధించినవి.

కాంగ్రెసు పెద్దకు పెద్ద చిక్కే వచ్చింది. పోటీ కాంగ్రెసువాడుగా నన్ను వత్తిడిచెయ్యడానికి ప్రయత్నించిన ఈ మనిషి ఇప్పుడు తనను బయటపెట్టవద్దని ప్రాధేయపడ్డాడు. తాలూకా కాంగ్రెసులో తన కున్న హోదాను రెండేళ్లపాటు వదులుకుంటానని వాగ్దానం చేశాడు. ఒక నెలపాటు ఈ విషయమై దర్యాప్తులు జరపవలసివచ్చింది.

రోజులు గడిచినకొద్దీ అపహృతస్త్రీ పునరుద్ధరణ కార్యక్రమాన్ని సాగకుండా చేసే కుయుక్తులు ఉభయ అధినివేశాలలోనూ స్త్రీలను అపహరించినవారూ, అపహృతస్త్రీలను దగ్గర ఉంచుకున్నవారూ కూడా నేర్చారు. దీనివల్ల ఈ ప్రయత్నం కష్టతరం కావడమే కాక, తప్పుడు మాటలపై చర్య తీసుకొనే అవకాశాలు కూడా ఏర్పడినవి.

పశ్చిమపంజాబులో అలా జరిగింది. పలుకుబడిగల జమీందారు కొడుకొకడు, తనతండ్రి హిందూ స్త్రీని తస్కరించి తెచ్చి ఆ సాయంకాలమే వివాహమాడనున్నాడని రిపోర్టుచేశాడు. విచారణ జరపటానికిగాని వివాహం ఆపడానికిగాని వ్యవధి లేదు. రిపోర్టిచ్చినవాడితోంట కొందరు పంపబడ్డారు. విచారణ జరిగింది. యథార్థంగా జరిగిన దేమంటే ఆ పిల్ల ఒక అనాథ ముస్లిముబాలిక. జమీందారును పెళ్లాడడం ఇష్టంలేక కొడుకుతో మొరపెట్టుకున్నది. అతనికి తనతండ్రి రెండవవివాహం చేసుకోవడం ఇష్టంలేక ఇలా రిపోర్టిచ్చాడు. ఆఖరు కామె లాహోరులోని ముస్లిముశిబిరానికి పంపబడింది.

గుజరాతులోని కుంజశిబిరంలో ఇండియాకు పోవడానికి భయపడిన హిందూ, సిక్కు స్త్రీలు ఒకటి, రెండు వందలమంది ఉన్నారు. వారిలో ఏడుగురు అనుమానం మీద నిలిపిపెట్టబడిన ముస్లిము స్త్రీలు. విచారణ అనంతరం వారిని వదలివేశారు.

కొన్ని కేసులు క్లిష్టమైనవి. కొందరు స్త్రీలు అనేకమందితో నివసించి అనేకమతాల వారికి పిల్లలను కన్నారు. ఒక సిక్కువాడి స్నేహితులు అతని భార్యను పాకిస్తానునుంచి ఉద్ధరించమన్నారు. ఆమెతల్లి ముస్లిము, తండ్రి సిక్కు. ఆమె సవతి అన్నలూ, అక్కలూ ముస్లిములు. ఆమె సిక్కును పెళ్లాడింది. దేశవిభజన జరగకముందే ఈమెను భర్త వదిలేశాడు. ఆమె తన తల్లి దగ్గరే ఉంది. ఇంతలో ఆమెతల్లి ఒక ముసిమును పెళ్లాడి, పిల్లలను కన్నది. ఇటువంటి కేసులను శాస్త్రీయంగా పరిష్కరించడం సాధ్యంకాదు. ఈ స్త్రీలను పునరుద్ధరించిగాని విచారణ జరపడం సాధ్యంకాదు. ముందుగా విచారణ జరపడానికి ప్రయత్నిస్తే ఒక్కొక్కసారి ఆ స్త్రీలు చాలా కష్టాలపాలవుతారు.

సయాల్‌కోటలో ఇలాగే జరిగింది. ఒక దయామయుడైన ముస్లిము ఒక హిందూయువతి వద్దనుంచి రహస్యంగా ఈ క్రింది లేఖ తెచ్చాడు: "మీరు పంపిన అపహృతస్త్రీ పునరుద్ధారకదళం వారు మా గ్రామం వచ్చి ఒక స్త్రీని ఉద్ధరించారు. వారికి ఎవరో నా సంగతి తెలుపగా, వారు నన్నుకూడా తీసుకొనిపోక అధికారాను మతితో తిరిగి వస్తామని వెళ్లిపోయినారు. నన్నిప్పుడు మీకు అందకుండా ఎక్కడికో చేరవేశారు. మా కష్టాలీవిధంగా ఎందుకు పెంచుతారు? చాతనయితే సరిగా ఉద్ధరించండి. లేదా మమ్మల్ని వదిలేసి ఊరుకోండి."

పునరుద్ధరించబడిన ఒక బాలిక తన కథ చెప్పింది. అయిదుసార్లు పోలీసులు ఆమెకొరకు వచ్చి విచారణలు చేశారు. కాని పోలీసులచేత ప్రశ్నించబడినవారు ఆమె భర్తను హెచ్చరిస్తూ వచ్చారు. అందుచేత ఆమెను అపహరించినవాడు ఆమెను దాయగలిగాడు. పునరుద్ధరణలో మార్పులు జరగగానే ఆమె దొరికిపోయింది.

తనదగ్గరనే ఒక అపహృతస్త్రీని ఉంచుకొన్న ఒక జమీందారు ఒక సంఘసేవకుడిమీద తప్పుగా రిపోర్టు చేశాడు.

ఇవన్నీ కదాచిత్సంఘటనలుకావు నిత్యమూ విచారణ జరిపేవారు ఎదుర్కొనేవే. అనాథ స్త్రీశిశువులపట్ల జరుగుతున్న ఈ అత్యాచారాన్ని చట్టరీత్యా ఎదుర్కొనడం ఎలా? ఈ స్త్రీలకు బంధవిముక్తి ఎలా కలిగించడం? ఇందులో పొరబాట్లు జరగకుండా ఎలా చూడడం? ఇవీ ప్రధానసమస్యలు. ప్రజలు చురుకుగా తోడ్పడితే ఈ పని ఏనాడో పూర్తి అయి ఉండును. కాని వారికి చేయబడిన విన్నపాలు వృథా అయినవి. ఉన్న అధికారాలు దుర్వినియోగపరచకుండానూ, అపహృత స్త్రీల ప్రాణాలకు అపాయం వాటిల్లకుండానూ ఒక మార్గం తొక్కవలసి వచ్చింది.

ఆ మార్గాన్ని ప్రస్తుతం వివరించ వీలుపడదు. అపహృతస్త్రీని ఉద్ధరించిన అనంతరం అతిశీఘ్రంగా అవసరమైన విచారణ జరుపబడుతుంది. ఒకటిన్నర సంవత్సరాల అనుభవం మీదట ఈ క్రింది విషయాలు తెలుసుకున్నాం. వార్తలు పైకి రారాదు. అపహృతస్త్రీని ఉద్ధరించమన్నారని తెలిస్తే ఆమెను అపహరించినవాడు ఆమెను చంపవచ్చు; అమ్మవచ్చు; లేదా ఆమెతో మరెక్కడికో లేచిపోయి ఆమెను కష్టాలుపెట్టవచ్చు. ఇంతకంటె తప్పు రిపోర్టుపై పునరుద్ధరణ సాగించడమే క్షేమం. అపహృత స్త్రీలను వశపరచుకొనడానికి ఒకచోటికి వెళ్లినవారు అట్టి స్త్రీలు చెప్పినదానిని బట్టి ఆ ప్రాంతంలోగల అపహృత స్త్రీలందరినీ వశపరచుకోవాలి. వశపరచుకొన్న స్త్రీలతోసహా ఆ స్థలం శీఘ్రమే వదలి రావాలి. వశపరచుకొన్న స్త్రీనిగురించి ఆర్జీలు వస్తే శిబిరంలో విచారణ జరపాలి. అపహృతస్త్రీని ప్రధానశిబిరానికి తీసుకొనివచ్చేవరకూ ఆమె వద్ద నికరమైన వాఙ్మూలం పుచ్చుకోరాదు. భయంవల్ల అట్టి స్త్రీలు ఒకసారి చెప్పినది మరొకసారి చెప్పరు. ఒకటి రెండు రోజులామె శిబిరంలో ఉన్న తరువాత యథార్థం బయటపడుతుంది. అపహరణ విషయం అనుమానం ఉన్నప్పుడు ఆమె బంధువులమని చెప్పుకొనేవారికి జామీను మీద ఆమెను ఇవ్వవచ్చును. విచారణకు వారామెను తీసుకొని వస్తారు. అపహృత స్త్రీ ఏ జాతిదనే విషయం తగాదా లేక ఆమె మతం మార్పుకొనడం, వివాహం వగైరాలను గురించి తగాదా ఉంటే విచారణ పూర్తి అయేదాకా ఆమె శిబిరంలో ఉండాలి. ఇండియాకు సంబంధించిన ఇటువంటి వ్యక్తులందరు పాకిస్తానీ సంఘసేవకుల అధీనం కింద జలందరు శిబిరంలోనూ, పాకిస్తానుకు సంబంధించినవారు భారత సంఘ సేవకుల అధీనం కింద లాహోరుశిబిరంలోనూ ఉన్నారు. ఇట్లా ఏర్పాటు చేయడం వలన అపహృత స్త్రీలకు ధైర్యం లభిస్తుంది. స్త్రీ స్వయంగా కోరకపోయినా ఆమె బంధువుల మనేవారు కోరితే విచారణ జరుపబడుతుంది. అయితే ఇటువంటి కేసులలో ఆ స్త్రీ యొక్క అభిప్రాయానికి ప్రాముఖ్యం ఇవ్వబడుతుంది ఇటువంటి కేసులు విచారించడానికి ఉభయ అధినివేశాలూ కలిసి ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటుచేశారు. వీరు వారానికొకసారి, ఒకమారు లాహోరులోనూ, మరొకమారు జలందరులోనూ సమావేశమౌతారు. వీరి నిర్ణయాలు సాధారణంగా ఏకగ్రీవంగా ఉంటవి. అభిప్రాయభేదం కలిగినప్పుడు తుదినిర్ణయం ఇండియా పాకిస్తానుల ఉన్నతాధికారులు చేస్తారు. ఏ కేసులోనైనా ఉభయ అధినివేశాల పునరుద్ధరణ మంత్రులవద్ద అప్పీలు చేసుకోవచ్చు. అపహృత స్త్రీల పునరుద్ధరణ కింత బందోబస్తు లేదన్నమాట కేవలము దుష్ప్రచారం.

ఈ విచారణలో ఎటువంటి అసత్యాల నెదుర్కొనవలసి వస్తుందంటే నిజం తెలుసుకొనడానికి చాలా ప్రవీణులు కావాలి. అపహృతస్త్రీ పునరుద్ధరణ నిరోధించి సంఘవిద్రోహకచర్యలు సాగించవలచినవారు దుష్ప్రచారానికి ఏమాత్రం అవకాశం లభించినా పోనివ్వడంలేదు. పైన చెప్పిన విషయాలనుబట్టి అపహృతస్త్రీ పునరుద్ధరణ ఎంత శ్రద్ధగా జరుగుతున్నదీ ప్రజలు గ్రహించవచ్చు.

ఈ సందర్భంలో ఇటీవల జారీ చేయబడిన ఆర్డినెన్సు తీవ్ర విమర్శకు గురి అయింది. ప్రజలు సద్భావంతో సహకరిస్తారనే ఆశతో ఒక సంవత్సరంపాటు ఆర్డినెన్సు లేకుండానే పనిచేశాం. కాని ఇంకా అనేక వేలమంది అపహృత స్త్రీలు ఉభయఅధినివేశాలలోనూ చెర అనుభవిస్తూ ఉన్నారు. వీరికి స్వాతంత్ర్యావశ్యకత ఉన్నది. స్త్రీఅపహరణకు సమ్మతించిన మత సంస్థలను అదుపులోకి తేవడానికి ఆర్డినెన్సులు అవసరం కాలేదా? శత్రువును సాధించడానికి అతని స్త్రీలను అపహరించే దుష్ట ఆచారం నశిస్తేగాని స్వాతంత్ర్యం సార్థకం కాదు.

ముస్లిము స్త్రీలను పాకిస్తాను కివ్వడానికే ఈ ప్రయత్నం జరుగుతున్నదనడం అవివేకం. భారతీయులు దుష్టంగా ప్రయత్నించినప్పుడు, అవతలి వ్యక్తులు ఏజాతివారైనా వారికి న్యాయం చేయడం ప్రభుత్వంవారి విధి. వారీ పని చేయనిచో భారతస్త్రీల గతి చాలా హీనమయ్యేది.

కథానిక:



కీర్తికాముడు

శ్రీ కాళీపట్నపు రామారావు

అసలు వెంకయ్యనాయుడిగారి వంశమే అట్టిది. వారి పితామహ ప్రపితామహుల దగ్గర్నుంచి కూడా వస్తె కొక్కుతూ వచ్చింది. వారి ప్రపితామహుని కాలంలో ఇంటప్రవేశించిన కీర్తికాంత మూడుతరాలవరకూ ఆయింట నిలచిపోయింది.

అయితే నేడాయింట ఆమెఉనికి కొనరాదేమీ అంటే అది శుద్ధతెలివి తక్కువ ప్రశ్న. కనక కాంతులచే ఆకర్షింపబడిన కాంత కలకాలం నిలువలేదనడం తెలివి తక్కువ కాదూ?

వెంకయ్యనాయుడిగారిఆస్తి యేమీ తక్కువది కాదు. నలభై యకరాల ఆసామీ. కాని అంత ఆస్తీ హారతికర్పూరంలా హరించుకపోయింది. ఎందుచేతా అంటే చెప్పలేం.

నాయుడు ఒక దూబరా మనిషీ ఒక అజ్ఞానీ ఒక అప్రయోజకుడూ కాదు. అతను పెట్టిన ఖర్చుల్లో ఒక్కటి కూడా దూబరా అని ఋజువు చెయ్యలేం.

ఆయనకు వినడానికి చెవులు వచ్చిన దగ్గర నుంచీ ఒకే ఒక సుభాషితం కొన్ని లక్షలసార్లు విన్నాడు. కబుర్లలో, కథలలో, కావ్యాలలో పద్యాలలో సర్వపుణ్యగ్రంథాలలో - ఒకేఒక సుభాషితం-వింటూ వచ్చాడు. తను చదువుకోక పోయినా అనేకవందలసార్లు తిమ్మన్న శాస్త్రిలు తన యెదరుగా చదవడం చేత చివరికా 'కారే రాజులు......' అనే పద్యం తనకు కంఠతా వచ్చేసిందికూడా. అందుచేతే నాయుడు ఈ ఆలుబిడ్డలనూ తనువునూ నమ్ముకోకుండా ఒక్క యశాన్నిమాత్రమే నమ్మేడు.

నాయుడు గారింటికి భట్రాజులు వచ్చేవారు. ఆయన కీర్తికాంత సౌందర్యాన్నీ లావణ్యాన్నీ ఒకటో రెండో పద్యాల్లో వర్ణించేవారు; అయిదో పదో జేబులో వేసుక వెళ్లేవారు. గంగిరెద్దులువచ్చేవి. ప్రభువు వారికి దండం పెట్టేవి. ఒకటోరెండోఖరీదైన పంచలు మూపుమీద వేసుకపోయేవి. గారడి వాళ్లు ఈలె వాళ్లూ వచ్చేవారు. నాయుడుగారి పేరు చెప్పి 'ఢోలు' కొట్టేవారు-ఒస్......యిలా నాడూ నేడూ వచ్చిపోయేవారే కాక ఆశ్రితులూ హితులూ పురోహితులూ మొదలై నిత్యుల సంఖ్యకూ లోటు ఉండేది కాదు.

అయితే కొంత మందీ - తమ్మన్నశాస్త్రి అన్నట్టు - 'నాయునియశఃసంపాదన, కన్నుకుట్టడంవల్ల' కాబోలు 'దాన ధర్మాలంటూ అనవసరంగా దూబరా ఖర్చుచేస్తాడు' అని ప్రచారం చేయసాగారు. కొంత మంది నిజమైన శ్రేయోభిలాషుల్లా నాయుని యెదుట బడి మందలించాలని చూశారు కూడా. కాని కర్ణుడూ శిబీమాంధాతా రఘువూ మొదలైన కల్పవృక్షాలు పుట్టిన పుణ్యభూమిలో పుట్టినవాడు నాయుడు. తను ఎంత సామాన్యపు రైతు అయితే యేం - సకలాగమ శాస్త్రాలూ సర్వభూమీసురులూ ఏకగ్రీవంగా ప్రకటించిన మానవలక్ష్యాన్ని ఈ మూర్ఖులు ఎంత ఖండించినా తను నమ్మతాడా? అందుచేతే వాళ్ళమాటలు పెడచెవిని బెట్టి తన కార్యం తాను చేసుకపోసాగాడు.

నాయుడు ఈ విధంగా ఖర్చు విషయంలోనే కాకుండా గణన విషయంలో కూడా యేమీ అశ్రద్ధ చెయ్యలేదు. అతని వ్యవసాయం, వ్యవహారాలు ఆదిగా గల విషయాల్లో లక్ష్మి అనుగ్రహం కోసరం అతను ఇవ్వని దానాలూ చేయని వ్రతాలూ ఒనరించిన జాతరలూ లేవు. ఏ పామరుడైనా ఇట్టి విషయాల గురించి కదుపుతే నాయుడనేవాడు—

"అయ్యా! నే నొక మాటడుగుతాను చెపతా? నువ్వు యవశాయం సేస్తున్నావ్, యేం జేస్తున్నవ్! మొదట గత్తాలకనీ చెరువుమన్నుకనీ బోలెడు డబ్బు యయంజేసి సతుప్సారం సేస్తావ్! చింతగింజల్లాటి యిత్తనాలు భూవిల జల్లేస్తున్నవ్! గాబుతీతకనీ, గొప్పు తవ్వకనీ, చేనుకోతకనీ మల్లా గింజ లింటికొచ్చిన వరకూ బోలెడు మదు పెడతవ్. నీటికనీ కాపుకనీ యెండనక వాననక పగలనక రాతిరనక బోలెడు శ్రతపడతవ్? ఇదంతెందుకూ? పండుద్దనేనా పండక పోతేం జేస్తావ్ ...... ఏం మాటాడవు? అదటున్నీ, నువ్వీ శ్రవదవాదులన్నీ పడకపోతే ముక్యంగా అసలు పండుద్దా...... ఈ యేల మదు పెడతావేవో. రేపు తింటావేవో. ఈ యేల భూమి లేసిన మదుపు తిరి గొస్తదాఅని గాదెల మూతులు కట్టుక్కూకుంటే నీకదే దక్కుడు! మల్లా కొత్త గింజలు రావడమంటుండదు. అంతే...

ఈ 'శుక' వాక్యాలు విని చుట్టూ ఉండే బృందం ఓహో అంటూ తలూపుతుంది. కదిపినవాడు మరి కిక్కురుమనడు. ఆతర్వాత కూడా నాయుడు విబుధవరులవలన విన్నంత...... వరకూ ఇదేవిధంగా మరికొంత తేటపడుస్తారు.

అయితే నాయుడు ఈ విధంగా ఆదాయ వ్యయాల రెండింటా శాస్త్ర ప్రోక్తంగా నడుచుకుంటూ వుంటే అతన్ని దరిద్రం యెలా ఆవహించిందీ అంటే అదే తెలుసుకోవలసింది. నాయుడు యెంత పురాణ శ్రవణ ప్రియుడూ, వీతరాగుడూ అయినా సోమరిపోతుగామాత్రం మారలేదు. నలభైయకారాల భూమీ పాలేర్ల సహాయంతో స్వంతంగానే సాగుచేసేవాడు. అయితే మరెలా అయ్యిందీ అంటే అదే తెలియరాదు.

ఏమైనా, జరగింది యిదీ—

వెంకయ్య నాయుడు నడుంకట్టి జీవితంలో ప్రవేశించే సరికి అప్పటి కప్పుడే రూపాయల పలుకులబడి మోచ్చడం దినుసుపలుకు బడితగ్గడం ఆరంభ మయ్యింది. చాలా మంది అప్పుడే దినుసుకు బదులు రూపాయలు నిలువ చెయ్యడం అరంభించారు. కాని వెంకయ్యనాయుడు తల్లి బ్రతికున్నంతకాలం ఆ యింట్లో కొత్త మార్పులకు చోటు లేక పోవడం వల్లనో, లేక వెంకయ్య నాయుడికే మార్పుమీద ఆసక్తి లేక పోవడం వల్లనో ఆయింట్లో రూపాయలు తగినంత రాజ్యం సంపాదించుకో లేక పోయాయి. పాతిక యకరాల పల్లం పదిహేనెకరాల మెట్టా పరంపరాగతమైన పశుసంపదా కలిగిన ఆయింటిలో రూపాయలు చొరడానికి అవకాశం లేకపోయిందంటే అందులో వింత ఏమీ లేదు. జీవితానికి కావలసిన వన్నీ భూమినుంచి భూజన్యముల నుంచీ గోవునుంచీ పుష్కలంగా లభ్య మాతూ వచ్చేవి. తినగలిగినంత తిని పెట్టగలిగినంత పెట్టి దానం చెయ్యగలిగినంత దానం చేసేవారు. ఇంకా అక్కడికీ మిగిలితే బంగారం రూపం ధరించి గృహలక్ష్మి శరీరా న్నాశ్రయించేది.

ఆ యింట్లో మొట్ట మొదటి సారిగా రూపాయల అవసరం వచ్చిన సందర్భం— రామినాయుడి నీటిబట్టె తగువు. వెంకయ్యనాయుడు సాత్వికుడే కాని, తమ్మన్న శాస్త్రులు ఉపమించినట్టు— దర్మరాజు వంటివాడు. కోపం వస్తే అతణ్ణి పట్టగలిగే వారు లేరంటారు. తనుమగవాడనే నగ్నసత్యాన్ని ఋజువు చేసుకోడానికి సుమారు నలభై యాభై దృఢకాయాలనుండి రక్తధారలు పారించి రెండు వేల రూపాయలవరకూ విరజిమ్మాడు. చివరకు తను మొగవాడని అనిపించుకున్నాడు. కాని అదే ఆ యింటిలో రూపాయలు ప్రశించడానికి గాను మొట్టమొదటిసారి ఏర్పడిన అదను.

అదిలగాయితూ అట్టివే చిన్న చిన్న వ్యవహారాలలో నైతేనేం వరసగా నలుగు రాడ పిల్లల పెళ్లిళ్ళకైతేనేం రూపాయల అవసరాలు పడ్డాయి. రూపాయిలు వచ్చాయికూడా. చివరకు ఈ రూపాయిలే కొత్త వెల్లువ ప్రాత నీటిచుక్కలను కూడా కొట్టుక పోయినట్టు కొట్టుక పోయాయి.

నీటి బట్టె దగ్గర మగతనపు ప్రదర్శనాలు జరిగిన రాత్రినాయుడిగారి మండువాలో ఆ శుతగాత్రాలతోనే నలుగురూ ప్రోగయి అనంతరకర్తవ్యంగురించి సమాలోచనలు ప్రారంభించారు. తెల్లవారు జామునే పట్నంపోయి ఫిర్యాదు చేద్దామనే ప్రాతిపదిక అనుయాయుల్లో అధిక సంఖ్యాకులచే బలపరుపబడింది. కాని ఫిర్యాదు చెయ్యటం మగసిరికి లోపమని నాయుడు కొట్టి పారేశాడు. వాళ్లే ఫిర్యాదు చేస్తే కాచుకోవటానికి అనవసరంగా చాలా డబ్బైపోతుందని హెచ్చరించారు. ఇందులో తను ఫకీరై పోయినా లక్ష్యం లేదన్నాడు నాయుడు. నలుగురూ నాలుగు విధాలా నచ్చచెప్ప ప్రయత్నించి విఫలులై నీ ఖర్మం అంటూ ఊరుకున్నారు. మూడోనాడే ఖర్మం అగపడింది కూడా. నిర్బంధ పత్రాలతో పోలీసులు దిగబడ్డారు.

అయితే ముందురాత్రే యీ వైనం తెలిసి ఉండడంచేత నాయుడు కొంతవరకూ జాగ్రత పడకలిగాడు. పొరుగూరునుంచి ధర్మారావు పట్కాయును కబుర్లుమీద తెప్పించి మంత్రాంగంసాగించాడు. అతని మంత్రాంగం ప్రకారం వెంటనే అయిదు వందల రూపాయలు నిమిషాల మీద పుట్టించవలసి వచ్చింది. ఇంట్లో దినుసు తప్ప రూపాయలు నిలవ చెయ్యటం ఎరుగని వెంకయ్యనాయుడు షాహుకారుకు కబురుపంపి రూపాయలు తెప్పించాడు.

అప్పటికి కార్యం ఒడ్డెక్కింది. తర్వాత సంవత్సరంవరకూ కోర్టులకూ కచేరీలకూ తిరగడంలో అప్పు సద్దుబాటు కాకపోవడం పోగా, ప్లీడర్లకనీ, సాక్షులకనీ రానుపోను రైలు ఖర్చులకనీ, వ్యాజ్యం గెలిపించే నిమిత్తం రామాయణాది పురాణపరనాలకనీ, పిదప శత్రుపరాభవానందప్రదర్శనకై ఏర్పాటు చేసిన వీధి భాగవతంకనీ, మొత్తం రెండువేల వరకూ ఆ అప్పు డెకిరింది. ఆ తంటా లేవో తీరాక వ్యవహారమంతా డిక్కసారే తెగనార్చ వచ్చుంటూ అయినకాడికి అప్పుజేస్తూ వచ్చాడు.

సంవత్సరం ఆఖరుకు అసలు ఫాయిదాలు యిరవై రెండు వంద లయ్యింది.

అప్పుడైనా అప్పు తెగనరుక్కుని ఉంటే కథ ఎలా ఉండేదో—కాని ఇక్కడ కూడా అతని మగసిరి— అతని నిష్కళంక కీర్తి— ఒప్పిందికాదు. వ్యాజ్యం కోసరం ఆడదాని ఒంటి మీద నగలు తీసాడని కాని, తండ్రి తాతలు గడించిన చెక్కలు అమ్ముకున్నాడని కాని లోకులు అనుకోడాన్ని ఆ యశః కాముడు భరించలేదు. అందుచేత రహస్యంగా ఉంటూ వచ్చిన అప్పును రహస్యంగానే ఉంచి పంట మీద ఏటేటా కొంత తీర్మానం చేదామని నిశ్చయించుకున్నాడు.

అయితే గరిశె ధాన్యం ముప్పైలూ నలభైలూ పాడే రూపాయల కరువు రోజుల్లో సంవత్సరానికి ఏ పదిపన్నెండు గరిశలో పండించే రైతు రెండువేల రూపాయలు అప్పు పంటమీద తీర్చడానికి నిశ్చయించాడంటే—అ దెంతవరకూ సాధ్య మనేది సువిదితం.


నాయుడు ఖర్చులు తగ్గించుకోవడానికి ప్రయత్నం చేశాడు కాని అతని కీర్తితార దీనికొక్కడా ఎదురయ్యింది.

ఒకసారి ఒక బ్రాహ్మణ పండితుడు వార్షీకాలు వసూలుకు వచ్చాడు. అతనికి ప్రతియేటా ఒక పంచల చాపు ఇవ్వడం మామూలు. నాయుడా యేడాది ఖరీదు కాస్త తగ్గించి ముతక చాపు ఈయబోయాడు. పండితుడు ఒక్కడా బుతక్క తక్కిన హంగామా విషయంలో కోపం వచ్చిన క్రొత్తల్లుడికన్నా ఏ విధానా తీసి పోలేదు. అన్నాడు.

"నాయుడిగారికి నామీద ఇంత ఆగ్రహం ఏల కలగాలో, నన్నింతలా చెప్పతో ఏల కొట్టాలో తెలియదు. నేను గతపాతిక సంవత్సరాలై 'గొర్లె' వారి బట్ట కట్టి సభల్లోకివెళ్తున్నాను.

(20-వ పేజీ చూడుడు)

అమెరికా స్వాతంత్ర్య



శిలడెల్ఫియాలోని స్వాతంత్ర్యభవనము



స్వతంత్రఅమెరికా ప్రథమ
(అలోన్సోఛాపె


ఈ జులై నాల్గవ తారీఖున అమెరికా (సంయుక్తరాష్ట్రాలు) స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకొంది. ఈ స్వాతంత్ర్య వార్షికోత్సవం నూట డెబ్బదిమూడవది. అమెరికా ప్రజలు తక్కిన పండుగ లన్నిటికంటె కూడా ఎక్కువ ఉత్సాహ సంతోషాలతో ఈ స్వాతంత్ర్య దినోత్సవం, ఈ 173 ఏళ్లనుంచీ ఏటేటా జరుపుకొంటూ వస్తున్నారు.

1776 సంవత్సరం జూలై నాల్గవ తారీఖున, అమెరికా ప్రప్రథమంలో తన స్వాతంత్ర్యస్థితిని స్వయంగా ప్రకటించుకొంది. అప్పటికి గ్రేటుబ్రిటన్ క్రింది వలసలుగా ఉన్న ఉత్తర అమెరికన్ రాష్ట్రాలలో పదమూడురాష్ట్రాల ప్రతినిధులు కాంటినెంటల్ కాంగ్రెస్ అనే ప్రజానంస్థగాసమావేశమయ్యారు: జులై నాల్గవ తారీఖున పెన్సిల్వేనియా రాష్ట్రంలోని ఫిలడెల్ఫియా నగరంలోని "ఇండిపెండెన్సు హాల్" (స్వాతంత్ర్య భవనం) అనే భవనంలో కాంగ్రెస్ వారు సభచేసి, ఈ స్వాతంత్ర్యపత్రం చదివి, తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించి, బ్రిటన్ క్రింది వలసలుగా ఉండటానికి నిరాకరించారు. ఆ స్వాతంత్ర్య పత్రం తయారుచేసినవాడు థామస్ జెఫ్ఫర్సన్. ఆ తరువాత అమెరికా అధ్యక్షస్థానం అలంకరించిన వారిలో ఇతడు మూడవవాడు. మొదటివాడు జార్జి వాషింగ్టన్. రెండవవాడు జాన్ ఆడమ్సు. సంయుక్తరాష్ట్రాలు ఇల్లా స్వాతంత్ర్యం ప్రకటించుకొనేటప్పటికి, బ్రిటన్‌కూ ఈ వలసరాష్ట్రాలకూ ఉండే సంబంధ బాంధవ్యాలు తెగతెంపులైపోయాయి.

ఆనాడు స్వాతంత్ర్య పత్రంపై సంతకం పెట్టినవారిలో తండ్రి కొడుకులైన జాన్ఆడమ్సు, జాన్‌క్విన్సీ ఆడమ్సు ఇద్దరూకూడా అమెరికాఅధ్యక్షస్థానం అలంకరించారు. జాన్‌క్వెన్సీ ఆడమ్సు అధ్యక్షుల వరుసలో ఆరవవాడు.

స్వాతంత్ర్యపత్రం ప్రకటిస్తూ త్రీ
మాటలు ఇవి:

ఈ ప్రకటన మొనర్చిననాటినుండి, ఉత్తరఅమెరికా ప్రజలు, ఏదో దూరస్థ సామ్రాజ్యంలో, కేవలం ఒకభాగంగా ఉన్నవారుకారు...ఒక స్వతంత్ర జాతిగా, తమ అస్తిత్వాన్ని, వ్యక్తీకరించుకొంటూ ఈనాడు తమ జన్మ




ఒక శతాబ్దంక్రింద అమెరికా స్వాతంత్ర్య వార్షికదినాన్న పల్లెటిఉత్సవాలను వర్ణించే తైలవర్ణచిత్రము.
(చిత్రకారుడు ఆల్ఫ్రెడ్ కార్నీలియస్)




ఫిలడెల్ఫియా స్వాతంత్ర్యభవనంమీది,
ఈ జే గంటపై "దేశమంతటా

వార్షికోత్సవాలు



అధ్యక్షుడు జార్జివాషింగ్‌టన్ కుటుంబము
్ చిత్రించిన తైలవర్ణచిత్రం.)



స్వాతంత్ర్యవార్షికోత్సవంలో అమెరికన్ పట్టణవీథులలో ఊరేగింపులు.
ఫిలడెల్ఫియాలో 1876 జూలై 3 న జరిగిన ఊరేగింపు చిత్రం.

ర్పనను నిరూపించుకొంటున్నారు. ఒక నూతనజాతి, ఒక్కదిశం మాత్రం లో ఉద్భవమయింది" అనిఅన్నాడు.

ప్రభుత్వభవనాలు, ప్రజాగృహాలు, అన్నీకూడా ఈ స్వాతంత్ర్యదినోత్సవం నాడు తమ జాతీయజండా నెగుర వేస్తాయి. సైనికవిన్యాసాలు, ప్రదర్శనాలు, ఉత్సవాలు, బాణాసంచా కాల్పులు, ఆటలు, పాటలు, విందులతో ప్రజలు అమితోత్సాహవంతులై ఈ ఉత్సవదినం జరుపుకొంటారు.

స్వాతంత్ర్యదినంనాడు ప్రజలంతా మళ్లీ ఒకసారి తమ స్వాతంత్ర్యపత్రం లోని, వ్యక్తిస్వాతంత్ర్య ప్రజాస్వామ్య సూత్రాలను పునఃపరన మొనర్చుకొని, తదనుగుణ్యంగా, ప్రజాజీవితమూ, ప్రభుత్వజీవితమూకూడా గడుపుకోటానికి, కృతనిశ్చయులౌతూ తమ ఆశయాలను, ఆదర్శాలను, ప్రమాణరీత్యా పునశ్చరణ మొనర్చుకొంటారు.

"ఈ క్రింది 'సత్యాలు' స్వతఃసిద్ధాలనీ, స్వయంవ్యక్తాలనీ మేము భావిస్తున్నాము.

"జన్మచే మానవులందరూ సమానులు. సృష్టికర్త వారికి జన్మసిద్ధంగానేకొన్ని అవిభేద్యములైన హక్కుల నిచ్చే యున్నాడు: జీవించగలందుకు హక్కు, స్వతంత్రులుగా ఉండేందుకు హక్కు, సుఖజీవనానికి పాటుపడే హక్కు. ఈ హక్కులను భద్రపరచి పాలించగలిగేందుకే, మానవులలో ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. పాలిత వ్యక్తుల సమ్మతిపైననే తమ ధర్మం నిర్వర్తించగలిగేందుకు ఈ ప్రభుత్వాలు, న్యాయబద్ధమైన అధికారాలను పొందగలుగుతాయి."

అమెరికన్ "స్వాతంత్ర్యపత్రం"లోని ముఖ్యసూత్రాలివే. ప్రభుత్వ నిర్వహణకివే జీవసూత్రాలుగా ఉద్దేశింపబడ్డాయి. శాంతిధర్మాలతో యావత్ప్రపంచం విలసిల్లగలదని ఆశించేందుకు దేశభక్తి, ప్రజాస్వామ్య సూత్రాలపై గౌరవము, స్వాతంత్ర్య ప్రియత్వము, అమెరికన్ ప్రజలలో నిత్యనూతనంగా నిలవగలిగేందుకు ఈ పత్రమే ప్రోద్బలకంగా నిలుస్తుంది.



స్వాతంత్ర్యరావ మొనర్చిన "జే గంటను" బడిపిల్లలు సందర్శిస్తున్నారు.
ప్రజలందరకూ స్వాతంత్ర్యము ప్రకటిస్తుంది" అని వ్రాసివుంది.



జూలై 4 1776 న స్వాతంత్ర్య ప్రకటనను, ఫిలడెల్ఫియా స్వాతంత్ర్యభవనంమీది ఈ "జేగంట" దేశమంతటా మారుమ్రోగించింది.



సోనారాణి

శ్రీమతి పి. వేదవతి

పూర్వము ఒక పాదుషా ఉండేవాడు. ఆయన చాలా మంచివాడు. మహాత్ములను, పతివ్రతలను, మిక్కిలి తెలివిగలవారిని, పండితులను, సత్కరించి సంతోషిస్తూ వుండేవాడు. ఒక రోజు ఆయన, నిండు సభలో వుండగా తన సభికుల నిట్లా ప్రశ్నించాడు. "అనసూయాదేవి, సీతాదేవి వంటి గొప్ప మహిమగల పతివ్రతలు మన కిప్పుడు కనుపడుతారా? మీ లో చాలా మంది చాలా దేశాలు చూచి యుండవచ్చు. మీ బంధువులలోగాని, స్నేహితులలోగాని, ఎవరి భార్యమైనా పతివ్రత యని కూడిగా, నమ్మకముగా చెప్పగలరా? లేక మన మట్టి వారి నిప్పుడు కనుగొనలేమని నిరాశ చెంద వలసినదేనా? నా కట్టివారిని చూడ వలె నని చాలా ఆశగా వున్నది" అని అడిగెను.

అంత పెద్ద సభలోను చాల సేపటివర కెవ్వరును సమాధాన మీయలేరి. తమకు గట్టి నమ్మక మున్నను, తీరా పాదుషా యేమైన పరీక్షచేసిన, దానికి తట్టుకొనలేమేమో యని భయపడి యూరకుండిరి. కొంత సేపటి కొక సర్దార్ లేచి, పాదుషాకు నమస్కరించి యిట్లనెను:

"మహారాజా! నా భార్య పతివ్రతి యనియు, నిష్కల్మష చిత్త యనియు, ధైర్యశాలినియనియు, నా కీ రోజువరకు తెలుసు; గట్టి నమ్మకము గలదు. మహిమనుగురించి నాకు తెలియదు. కాని మాకు సంతానము లేనందున భగవత్సందర్శనము చేసిన కలుగునని, దేశ సంచారము చేయుచున్నాను. మిమ్మల చూడ కొంత సంతసము కలిగినది."

పాదుషా:— ఆమె ఎట్టి కష్టము నైనా ఎదుర్కొనగలదా?

సర్దార్:—అనియే నా నమ్మిక.

ఇంతలో అతని తోటి సర్దారు నకిది యంతయు కంటగింపయ్యెను. ఇతను మహమ్మదీయుడు. హిందూవనితలు, వారి పాతివ్రత్య మనిన యితనికి వెక్కిరింత. తెలివిగలవాడు. ఇతని పేరు సులేమాన్. ఇతను లేచి "మహారాజా, మీ రామెపాతివ్రత్యము నెట్లు నమ్మెదరు? సభికులందరు నమ్మవలదా మీ రీతనిని ఇతని భార్యను సత్కరింపగానే మేము నమ్మము. సభలో చెప్పిన ఇతను కష్టపడు నని ఇంతవరకు ఊరకుంటిని. నే నామె నెరుగుదు" ననెను.

సర్దార్:— నీ వామె నెరిగి యుండిన, ఆమెనుగురించి చెప్పుము.

సులేమాన్:— మహారాజా, ఇట్లు తర్కించుట గాదు. నా కారు నెలలు గడువిచ్చిన, నే నామె నెరుగుదు నని ఋజువు చేయగలను.



పాదుషా:— ఇందులకు నీవే మందువు?

సరదార్:— ఇత నట్లు ఋజువు చేయకలిగిన యెడల నేను నా తలనిచ్చుటకు నిశ్చయించుకున్నాను.

ఆ రోజున సులేమాన్‌కి గడు వివ్వబడెను. ఆ హిందూ సరదారు బంధించబడెను. సభ ముగిసెను.

సులేమాన్ యింటికి వెళ్లి ఆలోచించ మొదలిడెను. తను గెలిచెనా, రెండుఫలితములు: హిందువుల నోడించుట; పాదుషాచే సత్కారము. కాని ఉపాయము? అతడు నిజముగా సోనారాణి నెరుగడు. తన స్నేహితులు ప్రజలు చెప్పకొనగా వినియున్నాడు. ఆమె సౌందర్యవతి. విద్యావతి. నాట్యము, గానము, గుఱ్ఱపుస్వారి అన్నియును తెలుసును. దైవభక్తి గలది. ఆమె నవమానించుట, అంత సులభము గాదు. తానే వెళ్లి నీ భర్త స్నేహితుణ్ణి అని చెప్పిన గౌరవించి పంపివేయును. అతని కాపూట భోజనము రుచించలేదు. నిద్దుర పట్టలేదు. తెల్లవారుజామున ఒక ఉపాయము తట్టెను. అతడు ఒక నిశ్చయమునకు వచ్చెను.

సోనారాణి యింటికి, ఆమెభర్త మేనత్త వచ్చెను. తనభర్తకు మేనత్త లున్నారని ఆమె వినలేదు. కాని ఈమెను గౌరవించుచునే యుండెను. నా మేనల్లుని పసితనమున చూచితిని. మేము దూరమైనాము. ఇన్నాళ్లకి ఉన్నపూరు తెలిసి చూడవచ్చితిని. ఊళ్లో లేడు. ఎప్పుడు వచ్చును నని అడిగె. త్వరలోనే రావచ్చునని సోనారాణి చెప్పెను. చూడనిది వెళ్లవలె నని లేదు. ఏ మందు వనెను. రాకరాక వచ్చిన తన మేనత్తను తను చూడకుండా పంపివేసె నని భర్త వచ్చి విచారించు నేమో యని వుండమని సోనారాణి సలహా యిచ్చెను. ఆమేనత్త క్రమముగా ఆ వూరిగుర్తులు, ఆయింటి గుర్తులు, సేవకుల పేర్లు జ్ఞాపకము పెట్టుకొనుచుండెను. రెండు, మూడుసార్లు నిర్బంధించి సోనారాణికి తలంటి పోసెను. ఇది బావుంది అది బావుం దని మిష పెట్టి పడకగది పదే పదే పరీక్షగా చూచెను.

నాలుగు నెలలు గడచెను. భర్తవద్దనుండి జాబు లేదు. ఎక్కడున్నదీ తెలియదు. సోనారాణికి అనుమానము కలగ జొచ్చెను.

ఒక రోజున ఆ మేనత్త తనతో భోజనము చేయుమని బలవంతము చేసెను. సోనారాణి అలవాటు ప్రకారము భోజనమునకు ముందు, ఒక రత్నాల పిడిగల కత్తి, ఒక పట్టు రుమాలు, ఒక ఉంగరము తెచ్చి నమస్కరించి, భోజనము చేసెను. అవి తీసి దాచెను. ఎందు కట్లు చేయుచున్నావని ఆ మేనత్త అడిగెను. ఊరికి వెళ్లే ముందు గుర్తుగా ఇవి ఇచ్చి వెళ్లెను అనెను. మరల కొన్నిరోజులు గడచెను.

తను ఇంటికి వెళ్లవలెననియు, మేనల్లునికి గుర్తుగా ఉంగరము రుమాలు యివ్వమని అనేక విధముల అడిగి బల్వంతంచేసి తీసికొని, తన పేరు, తన వూరిపేరు చెప్పి రమ్మనిచెప్పి వెళ్లిపోయెను.

ఆరునెలలు నిండవచ్చెను. ఒకరోజున సులేమాన్ సభలో హాజరయ్యెను. తాను పంపిన మనిషినుండి అన్నీ తెలుసుకుని వ్రాసివేసి, ఉంగరము రుమాలు తెచ్చి చూపెను. ఆమెను వర్ణించెను. పాట వర్ణించెను. ఇల్లంతయు ఎరిగినట్లుగా చెప్పెను. తా నామెతో ఆరు నెలలుంటి నని, ప్రేమచిహ్నముగా ఆ రుమాలు ఉంగరము యిచ్చెననీ చూపెను.

పాదుషా దీని కేమి వా బిత్తు వనిజ హిందూ సర్దారు నడిగెను. ఏదో మోసము జరిగియుండునని సర్దార్ ఊహించలేకపోయెను. పాదుషాతో పాటు తానును అంతా నమ్మెను. నమ్మకుండు టెట్లు?

తా నంతగా నమ్మిన భార్య ఇట్లు చేసిన దని తలచి, అతడు మనస్ఫూర్తిగా తెనచావు కొప్పకొనెను. చనిపోవు ముందు ఒకసారి భార్యను చూసి వత్తు నని పాదుషాఅనుజ్ఞ తీసికొని, తనకు మారుగా ఒక స్నేహితుని తన స్థానములో వుంచి, ఒక మంచిగుఱ్ఱము తీసుకుని పోయెను. అతనివెంట పాదుషా సేవకులలో ఒకడు పోయెను.

సర్దార్ ఇల్లు చేరుతూనే మండిపడుతూ గుఱ్ఱమునుండి దూకి, గుఱ్ఱము నదలించు కొరడా తీసికొని ఇంటిలోకి

బొమ్మల కథ 5



పోయెను. ఏదో కుట్టుకొనుచూ పరధ్యానముగానున్న సోనాదేవిని అట్లే కొరడాతో కొట్టి, నిందించి, వెలుపలికి వచ్చి గుఱ్ఱము నెక్కి వెళ్లిపోయెను. వెంట వచ్చిన సేవకుడు యీ కొద్దిసేపు వాకిటిలోనే యుండి మరల అతనిని అనుసరించెను.

ఇంటిలోని దాసి ఈ గందరగోళ మంతయు చూచి నివ్వెరపోయెను. తమ యజమానురాలికి ఉపచారములు చేసి సేద దీర్చెను. సోనాదేవి జరిగిన దానిని గూర్చి విచారించుచుండెను.

స్వామిభక్తిగల సేవకుడు, తిమ్మెవ్వరిని పల్కరింపక, సరాసరి ఇంటిలోనికి పోయిన సర్దార్‌ని చూచి, ఏదో జరిగెనని తలచి, ఆ వచ్చిన వానిని అడిగెను. అతడు క్లుప్తముగ జరిగినది చెప్పెను.

సేవకుడు లోనికి వచ్చి "అమ్మా, మీరు విచారించుచూ కూర్చునే వేళ గాదు. యజమానుడు తల యిచ్చుటకు ఒప్పుకొన్నాడట. మిమ్ము మోసము చేసి ఉంగరము, రుమాలు తీసికెళ్లి నామె ఎవరికో మహమ్మదీయున కిచ్చిన దట. అతడవి స్వయముగా మీ వతని కిచ్చితివని చెప్పెనట. మనము దోసలో మాటలాడుకొనవచ్చు మన సంగతి. మొట్టమొదట, యజమాని ప్రాణములు కాపాడవలెను. తరువాత మీ నిర్దోషిత్వము ఋజువుచేసికొనవచ్చును."

సోనారాణి ధైర్యముతో, తగిన సామాను, అలంకారములు, ధనము తీసికొనెను. ఇల్లు తాళమువేసి నమ్మకమైన సేవకుల నింటికి కావలి యుంచెను. దాసిని ఆ సేవకుని తీసికొని అరేబియా గుఱ్ఱముల మీద బయలుదేరి తన భర్తకంటె ముందు పాదుషా ఉన్న ఊరు చేరెను. త్రోవ పొడుగునా వారు మ్ముగ్గురూ ఆలోచించి జరిగినదానిని తెలిసికొని, చేయవలసినదానిని గురించి నిశ్చయించిరి.

రాజధాని చేరుటతోనే సేవకుడు డాలస్యము చేయక దర్బారునకు వెళ్లి మంచి ముత్యములను పాదుషాకు కానుకగా యిచ్చెను. ఒక నర్తకి, తన నాట్యమును, పాదుషా సభలో ప్రదర్శింపగోరుచున్నదనియు, ఆమెయే యీ కానుక పంపెననియు చెప్పెను. పాదుషా ఒప్పుకొనెను. మరునాడు వేయి పనులన్నియు ఆపి అన్నిపైదీలనుగూడ ఆనాట్యముచూడ రప్పింప ఆమె ప్రార్థన అని చెప్పెను.

సోనారాణి ఆ నాడు మరునాడు బాగుగా విశ్రాంతి తీసికొనెను. ఈ లోగా అలసిన గుఱ్ఱము నెక్కి డెక్కడాపుతూ ఆమె భర్త వచ్చెను. అతని స్నేహితుని వదలిరి. మరు నాట్యము చూచుటకు సభ అంతయు క్రిక్కిరిసి యుండెను. సులేమాన్, సోనారాణి భర్తకూడా ఆ సభయందుండిరి. సులేమాన్ సంతోషముగా యుండెను.

నర్తకి వచ్చెను. వాద్యగాళ్లు వచ్చిరి. ఆమె తన వీణమీద చక్కని గీతములు పాడెను. ఆమెభర్త ఆ కంఠము వినికూడ తల ఎత్తలేదు. అతనికి లోకమే లేదు. తరువాత సోనారాణి పాడుతూ నాట్యము చేసెను. విచారింపక చేసిన పనికి ఫలితము బాధాకరమే నని దాని తాత్పర్యము. మరల కొంతసేపు భక్తిరసము చూపెను. చివరకు పాదుషాచే మెప్పుపొందెను. మీ రేదైన వరము కోరుకొనుడనెను. ఆమె సులేమాన్‌ని చూపి అతనిని తన స్వాధీనము చేయుమనెను. పాదుషా అట్లే చేయుచును. కాని కారణము తెలుపుమనెను. అతడు తనతో ఆరు నెలలుండెననియు, ఎట్టి ధనమూ మూయక పోగా, తనవి నగలు, కొంత ధనమూ ఎత్తుకు వచ్చెనని, చెప్పకయే కొద్ది రోజుల క్రితమే వారిపోయెనని చెప్పెను. తన నగలు తన ధనము తనకిప్పించమనెను. 'చెప్పక వచ్చినందుకుగాను అతడు తనకు దాస్యము చేయవలెన'నెను.

సులేమాన్ కిది యంతయు అగమ్యగోచరముగా ఉండెను. అతడు వాదు పాతో తన కామె ఎవరో తెలియదనెను. ఆమె పేరు ఊరు గూడ తెలియదనెను. తన జన్మలో ఆమెను చూడలేదనెను. తానేమియు ఎత్తుకు రాలేదనెను. ఆమె చెప్పినదంతయు అసత్యమనెను. సభయంతయు నిశ్శబ్దముగా నుండెను.

అప్పుడు సోనారాణి తన మేలిముసుగు తీసి, పోయి తన భర్త దగ్గర నుంచొనెను. "నిండు సభలో పెద్దలయెదుట పాదుషా ఎదుట నన్నెరుగ నంటివి. నేను సరదారు భార్యను. నీవు కుట్రచేసి ఒక స్త్రీచే ఉంగరము రుమాలు తెప్పించి, నేనే స్వయంగా నీకిచ్చితి నని అసత్యమాడితివి. నీ తప్పును నీవే బయలు పెట్టుకొంటివి. నేను నిర్దోషిని" అని సోనారాణి పల్కెను.

అందరూ సులేమాన్‌వంక అసహ్యముతో చూచిరి. పాదుషా యేమందువనెను. సులేమాన్ తన తప్పు ఒప్పుకొనెను. అతనికి శిక్ష పడెడిదే. సోనారాణి ఔదార్యముచే పాదుషా అతనిని వదలెను.

అప్పుడు పాదుషా, చక్కనైనా రంగతోపాటు తానుకూడ ఆమెకు నమస్కరించెను. ఆ రోజు వారికి విందు చేసెను. విలువగల వస్త్రములు నగలు ఆమె కిచ్చి గౌరవించెను. సోనారాణి భర్తకూడ తను విచారించక ఆమెను కొట్టినందుకు క్షమాపణ అడిగెను.

ధైర్యమే లక్ష్మి. సోనారాణి తన భర్తతో యింటికి వెళ్లెను. మనము ధైర్యముతోనున్న ఏ పని యైనను సాధింపగలము.

శాలివాహనుడు

శ్రీ నందివాడ పుతలీ

అనగా అనగా సుశీల అనే అమ్మాయి ఒక చిన్నపల్లెలో ఉండేది. ఆ అమ్మాయికి పాపం చిన్నప్పుడే తల్లితండ్రులు పోయారు. ఇద్దరన్నయ్యలు తప్ప ఎవరూ లేరా అమ్మాయికి. వాళ్లు చెల్లెలిని ప్రాణంకంటె ఎక్కువగా చూసుకునేవారు. సుశీలకి దైవభక్తి ఎక్కువ. సుబ్రహ్మణ్యేశ్వరుడంటే సుశీలకి చాలా నమ్మకం.

ఆ రోజు నాగులచవితి. నదిలో స్నానంచేసి నీళ్లు తెచ్చుకుందామని బిందె పుచ్చుకుని నదికె బయల్దేరింది. నదిలో స్నానం చేస్తూ నాగేంద్రుని స్తవంచేస్తూ పాటలు పాడడం మొదలెట్టింది. ఆకాశవిహారం చేస్తున్న నాగేంద్రుడీ పాటలు విని నదిదగ్గర కొచ్చాడు. సుశీల భక్తి కెంతో మెచ్చుకున్నాడు.

'అమ్మాయీ, నీ భక్తికెంతో సంతోషించాను. నిన్ను నాగలోకానికి తీసికెళ్తాను. వస్తావా?' అని నాగేంద్రుడడిగాడు.

'వద్దు-వద్దు. నేను రాను. మా అన్నలతో చెప్పలేదు. నే నేమయిపోయానో అని కంగారు పడుతా'రంది సుశీల.

'ఏం ఖంగారు పడకు. పరవాలేదు, రా'అన్నాడు నాగేంద్రుడు.

'మా అన్నయ్యలని విడిచి నేను రాలేను. మా అన్నయ్యలు లేకుండా నే నుండలేను. నేను రా'నంది సుశీల.

'నీకు భయమా? విడిచిపెట్టిరా లేవ్వా, మళ్లీ వచ్చేద్దువుగాని లే. రా. నాగలోకం చూశావంటే నువ్వే రానంటా'వని వేళాకోళం జేశాడు.

సుశీల సిగ్గుపడింది. ఇంక కాదంటే బాగుండ దనుకుంది. కాని అన్నలేమంటారో? నాగలోకం చూడాలనిపించింది సుశీలకి.

మళ్లీ దిగపెట్టేటట్టయితే వస్తానంది. సరేనని నాగరాజు నాగలోకం తీసికొనిపోయాడు.

ఇంకా చెల్లెలు రాలేదేమని సుశీల అన్నలు నదిదగ్గర కొచ్చారు. అక్కడ బిందె ఉంది. నదిలో కొట్టుకు పోయిందనుకుని ఏడ్చారు.

సుశీల నాగలోకానికి వెళ్లింది. అక్కడ నాగుపాముల మణులు దీపాల్లాగ వెలుతురుతో మెరిసిపోతున్నాయి.

సుశీల కక్కడ సరదాగానే ఉంది. నాగరాజుని పెళ్లాడింది. నాగకన్యల నృత్యమెంతో నచ్చింది సుశీలకి. అక్కడ వింతలన్నీ చూడ్డం పూర్తయాక సుశీల కింటివేపు దృష్టి మళ్లింది. అన్నయ్యలింటికి వెళ్లాక చెప్పకుండా పెళ్లాడినందుకు కేకలేస్తారేమో నని భయపడింది. అన్నలకోసం బెంగెట్టుకుని అన్నం తినడం మానేసి చిక్కి శల్యం అయిపోయింది. నాగేంద్రుడు సుశీలని పంపకుండా ఉంచడానికెన్నో ప్రయత్నాలు చేశాడు. కాని సుశీల రోజూ ఏడుస్తూంటె జాలేసి పంపేద్దా మనుకున్నాడు.

మర్త్యలోకం వెళ్లిపోతావా? అని అడిగాడు. సుశీలకి పట్టలేని సంతోషం వచ్చింది.

'వెళ్లిపోతాను. నన్ను నదిదగ్గర వదిలిపెట్టండి. చాలు'అంది. నాగరాజు నదిదగ్గర వదిలిపెట్టాడు. సుశీలకి అన్న లేమంటారో అని భయంగా ఉంది. పెళ్లి అడక్కుండా చేసుకున్నందుకు పొమ్మంటారేమో ఎలాగా అని ఆలో



చిస్తోంది. సుశీల గర్భవతి. నాగేంద్రుడు సుశీలమనసులో సంగతి గ్రహించాడు.

'భయపడకు. నిన్నెవ్వరూ ఏమీ అడగరు. ఈ రహస్యం ఎవరికీ చెప్పకు. ఈ కలశం తీసికో. ఒక్క చుక్క జల్లుతే దేనికైనా సరే ప్రాణం వస్తుం' దని అమృతకలశ మిచ్చాడు. సుశీల నమస్కరించింది. ఆశీర్వదించి అంతర్హితుడయాడు నాగరాజు.

ఇదివర కుండే ఇంటి దగ్గర కొచ్చింది. అక్కడ ఎవరో ఉంటున్నారు. సుశీల కేం చెయ్యాలో తెలియక ఏడుస్తూ కూర్చుంది. ఆ తోవని వెళ్తున్న ఒక కుమ్మరి సుశీలని చూసి 'ఎందుకేడుస్తున్నా రమ్మగారు?' అని అడిగాడు.

నేను నీళ్లు తెచ్చుకోడానికి నదికి వెళ్లాను. వచ్చేసరికి మాఅన్నయ్యలు లేరు. ఏంజరిగిందో తెలియదని చెప్పింది.

నాకు పిల్లలు లేరు. మా యింటికి రమ్మని తీసికెళ్లాడు కుమ్మరి. కొంత కాలం అయాక సుశీలకు అందమైన చక్కటి చుక్క పుట్టాడు. ఆపిల్లాడికి శాలివాహను డని పేరు పెట్టారు.

శాలివాహనుడు పెద్దవా డయాడు. తాతలాగ కుండలు చెయ్యడం నేర్చుకున్నాడు.

రాజుగారు యజ్ఞం చేస్తూన్నందుకు కుండలు తెమ్మన్నారు కుమ్మరిని. కుమ్మరి శాలివాహనుడిని పిలిచి—

'ఒరేయ్' కాళ్లు పీకుతున్నాయిరా. నువ్వు కుండలు పట్టుకెళ్లి రాజుగారి కిచ్చిర'మ్మని పంపాడు.

కుండలు తేవడ మాలస్యమైనందుకు కారణ మేమిటో కనుక్కోరమ్మని రాజుగారు సైనికుల్ని పంపారు. వాళ్లకి శాలివాహను డెదురయాడు. అందరూ కలసి రాజుగారి దగ్గర కెళ్లారు. సామంతరాజులు 'యజ్ఞంకదా, కుండలు తీసికొని రావాలని తెలియదా' అని అని కేకలేశారు. శాలివాహనుడు చేతులు కట్టుకుని మాట్లాడకుండా నిల్చున్నాడు. రాజుగారు శాలివాహనుడికేసి చూశారు. ముఖవర్చస్సు చూస్తే మహారాజుల బిడ్డడిలా ఉన్నాడు. రాజుగారు అబ్బాయి నీ పే రేమి టన్నారు. శాలివాహను డని జవాబు చెప్పాడు.

నిన్ను చూస్తే చాలా గొప్పింటి బిడ్డడిలాగ కనిపిస్తున్నావు. పరరాజులు దండెత్తి వస్తున్నారు. వాళ్లసైన్యం మనకంటె చాల ఎక్కువ. రక్షించమని యజ్ఞం చేస్తున్నాంకదా. కుండలు ఆలస్యంగా తెస్తే ఎలా గనుకున్నావ్ అని అడిగారు.

ఏం భయం లే దన్నాడు శాలివాహనుడు. కుమ్మరి కుర్ర డేమిటి, ఈ కబుర్లేమి టని ఆశ్చర్యపోయారు.

నువ్వు కుమ్మరిమనమడివి గావు. మీనాన్నెవరు? అమ్మెవరూ? నిజం చెప్పని కాజుగా రడిగారు.

శాలివాహనుడి కేం చెప్పాలో తెలియలేదు. నాకు తెలియదు. రేపు చెప్తా నని రాజుగారి శల వడిగి వెళ్లిపోయాడు. ఇంటికి వచ్చి సభలో వృత్తాంతమంతా చెప్పి అమ్మా మానాన్నెవరు చెప్పన్నాడు. చెప్ప కూడదు నాయనా అంది సుశీల. పరవా లేదు చెప్పన్నాడు.

చెప్తే చచ్చిపోతా. చెప్పనామరి? అంది.

రాజుగారితో చెప్తా నన్నానమ్మా. ఆడిన మాట తప్పతే ఎలా గన్నాడు.

నాయనా, తండ్రికి తగ్గిన కొడుకువి. చెప్తావి నని అమృతకలశ మిచ్చి తన చరిత్రంతా చెప్పింది. చెప్పీచెప్పగానే సుశీల నుంచున్న చోట మంట వచ్చి చచ్చిపోయింది. శాలివాహనుడు తల్లి మరణానికి విచారించాడు. జరపవలసిన విధులన్నీ జరిపి రాజుగారింటికి వెళ్లి తన జన్మరహస్యం చెప్పాడు. రాజుగారు సంతోషించి శాలివాహనుడిని సేనాధిపతి చేశాడు. శాలివాహనుడింటికి వెళ్లి మట్టితో కాల్బలము, రథ, గజ, తురగ పదాతులని చేసి అమృతం చల్లాడు. ఆశ్చర్యం అన్నిటికీ ప్రాణం వచ్చి గొప్పసైన్యం తయారయింది. రాజుగారు యుద్ధంలో గెలిచారు. మనమందరం శాలివాహనుడు చేసిన మట్టిబొమ్మల సంతతివారమట తెలుసా?


★——కుశాగ్రబుద్ధి——★

కే. పి. బాబు

అంతులేని మహాసముద్రమువలెనున్న ఎడారిమధ్య ఓ వర్తకుల గుంపు విడిది దిగినది. వారు తమతమ గుడారములను అక్కడ వేసుకొని తమ ఒంటెలను మేతకు, విడిచి తాము తమ కాలకృత్యములను తీర్చుకొని సమకట్టారు. ఆ రోజున కక్కడ విడిసి మరుచటిరోజున ప్రయాణమునకు సిద్ధపడగా వారికి వారి ఒంటెలలో నొక ఒంటె లోటుగా కన్పించెను. దాని తోవారు ఆ చుట్టుప్రక్కలవెదకి అది కన్పించక



పోగా విచారముతో నొక చోట కూర్చుండి ఆలోచించుకొన సాగారు. కానీ, వారికి గత్యంతరము ఏమీ తోచలేదు. అట్లు వారుండగా ఆదారిన ఒక మతబోధకుడు పోవుచూ వారిని, వారి విచారమును చూచి వారివద్దకు వచ్చి..."మీ రిట్లుండుటకు కారణం? ఏదో ఒక వస్తువును పోగొట్టుకొన్నట్లున్నారే?" అని అడిగాడు. వారు ఔనని తల లూచారు. "మీరు ఒక ఒంటెను పోగొట్టుకొన్నారుకదూ!" అని ఆయన తిరిగి ప్రశ్నించాడు వారిని. పోయిన ఉత్సాహాన్ని తిరిగి తెచ్చుకొని— "ఆఁ! అవునండీ—"అని జవా బిచ్చారు వారు; ఆయన దానినెక్కడన్నా చూచారేమోనని. "దానికికుడి కన్నుగ్రుడ్డి; ఎడమకాలు కుంటికదూ?" అని ఆయన చిరునవ్వుతో తిరిగి అడిగాడు. "ఆఁ! ఆఁ!" అన్నారు వర్తకులుసంతోషంతో —"అది తన ముందుపండ్లలో రెండు పండ్లను పోగొట్టుకొన్నది కదూ!?" అని మరల ఆయన వారిని ప్రశ్నించాడు. "ఆఁ! అదేమాది" అంటూ సంతోషంలో మునిగిపోయారు వర్తకులు. "అది ఒకవైపు గోధుమను, రెండవవైపు తేనెను మోస్తుంది కదూ?" అని చిరునవ్వుతో అడిగాడు బోధకుడు. "అవునండీ. అదే నండీ మాది. ఐతే అ దెక్క డున్నది? చెప్పండి మీకు పుణ్యముంటుంది." అని వర్తకులు ఆయన్ను బ్రతిమలాడసాగారు. "నిజానికి ఆ ఒంటెసంగతి నాకు తెలియదు సుమా!" అని వారందరకూ ఆశ్చర్యం కల్గేటట్లుగా ఆయన పల్కాడు. "ఆఁ" అంటూ వారందరూ ఆశ్చర్యపడ్డారు. పైగా క్రోధంతో ఆయన్ను అనుమానించి— "ఆఁ! వీ డెంత ధైర్యంగా మనల్ని బుకాయిస్తున్నాడు. ఊఁ! సరేకానీ"మని అందరు ఆయన్ను నిజం చెప్పమని నయాన్న, భయాన్న, బోధించి చెప్పారు. కానీ, ఆయన "సరేమిరా" నాకు తెలియ దన్నాడు. వారికి అది అన్యాయంగా తోచి ఆయన్ను బంధించి తమ న్యాయాధికారైన— "ఖాదీ" వద్దకు (యీయన మహమ్మదీయులకు న్యాయాధిపతి.) తీసుకపోయారు...... "ఖాదీ" కేసునంతా విన్నాడు. తల తిరిగింది ఆయనకు. అటు ప్రముఖులైన వర్తకులు; ఇటు మహాత్ముడైన మతబోధకుడు. అటు వారికి అన్యాయం జరుగకూడదు; ఇటుఈయనకు అన్యాయం జరుగకూడదు. ఎట్లాగు? ఆయన బోధకుని వద్దకు వెళ్లి మెల్లగా "అయ్యా! మీరు పల్కిన మాటలు చూస్తే మీరు ఒంటెను చూసిన ట్లున్నాయి. కానీ, మీరు "బాబో, నేను ఒంటె నెరుగ" నంటున్నారు. మరి మీరు నిజంగా ఒంటెను చూడనట్లైతే మీ రా గుర్తులెట్లు చెప్పగల్గారు?" అని ప్రశ్నించాడు ఆఖరుసారిగా. బోధకుడు చిరునవ్వుతో చెప్పసాగాడు: "ఓహో! ఇదా! మీ అనుమానం? ఐతే సరిగ్గా వినండి. నేను ఒక ఒంటె పాదగుర్తులను దారిలో చూచాను. అందువలన వారిఒంటె పోయిం దనుకొన్నాను."(సాధారణంగా ఒకఒంటె యెడారిలో పోదు. ఎప్పుడూ గుంపులు గుంపులుగనే పోతుంటారు వర్తకులు.) "ఐతే—మరి దాని కుడి కన్ను గ్రుడ్డి, ఎడమకాలు కుంటి అని ఎట్లు చెప్పారు?" అని ఖాదీ తిరిగి ప్రశ్నించాడు. "ఆఁ! అదీ వినండి. చెప్తాను. ఆ ఒంటె దారిలో ప్రతీ చోటనూ ఎడమవైపు "రెల్లు"నే తింటూపోయింది. అందువలన దాని కుడి కన్ను గ్రుడ్డి అనుకొన్నాను. తర్వాత; దాని ఎడమ కాలు పాదం గుర్తు ఒకటి సరిగా ఇసుకలో అనలేదు. దానివలన ఆ కాలు కుంటి అనుకొన్నాను" అని చెప్పాడు బోధకుడు. "సరి. సరి. మరైతే—దానికి రెండు పండ్లు లేవని మీ కెట్లు తెలుసు?" అని ఖాదీ అడిగాడు. అదా? ఆ ఒంటె తిన్న ప్రతీ ఆకునకు పడ్డ పండ్ల గుర్తులలో మధ్యన రెండు పండ్లు ఖాళీగా నున్నట్లు గుర్తుపడినది. దానివలన ఆ ఒంటెకు రెండు పండ్లు లేవని తెలుసుకొన్నాను." ఆ చిరునవ్వు నవ్వాడు బోధకుడు. "సరే, మరి అది బరువు మోస్తున్నదనీ; ఒక్కవైపున గోధుమ, మరొక్క వైపు తేనె ఉన్నదని ఎట్లు గ్రహించారు?' అని ఆశ్చర్యంతో ఖాదీ అన్నాడు "దారిలో ఒంటె పాదములు ఇసుకలో బాగుగా దిగబడుటచే అది బరువు మోస్తున్నదనీ, ఆ ఒంటె పాద గుర్తుల ప్రక్కన నొకవైపు చీమలు బారు ప్రాకుతుండుట వలన అది ఒక వైపు గోధుమనూ; రెండవ వైపున తేనెటీగలు ముసురు కొంట్యూ ఎగురుతుండటంవలన రెండవ వైపున తేనెను మోస్తున్నదనీ నేను గ్రహించాను సరేనా?!" అని పల్కాడు బోధకుడు. "అమ్మయ్య! నిజం చెప్పారండీ మీ దేమీ తప్పులేదు. క్షమించి మీ దారిన వెళ్లిపొండి. వదలి వేస్తున్నాను. అని ఖాదీ సంతృప్తితో ఆయన్ను నిర్దోషిగా వదిలేశాడు. అది విన్న వర్తకులు బోధకుని వద్దకు వచ్చి— "మహాత్మా? తెలియక మిమ్ముల నను మానించి అవమానించాము. క్షమించండి. అంతగా గ్రహించిన మీరు ఆ ఒంటె ఎక్కడ నున్నదో చెప్పలేరా?" అని ప్రార్థించారు. బోధకుడు జాలినొంది "అది షుమారు రెండు క్రోసుల దూరంలో ఉత్తర దిక్కున మీకు దొరుకగలదు. పోయి వెతుకండి—" అని ఆశీర్వదించి వెడలిపోయేడు. వర్తకులు త్వరితముగా ఉత్తర దిక్కునకు సరిగ్గా ఆ రెండు క్రోసుల దూరం పోగా ఒక చోట ఆ ఒంటె హాయిగా మేస్తూఉండడం చూచి సంతోషంతో "బోధకుని"అభి నందించుకొని దానిని తోలుకు వచ్చారు.



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

3౪

అన్నమాచార్యుల రచన : (ఆతని చరిత్ర పీఠికలో నుదాహృతము. పు. ౨౨.)

శంకరాభరణం - అట్టతాళం. (మూలమందే తాళము నిర్దిష్టము)

[పల్లవి]

(౧) , స స ధ పా మ గ గ మ ప ధా ప ధ ప మ గ మా | , ప ప ధా, ని సా , , , , ,
పా డ గం టి మ య్యా మి మ్ము పు రు షో త్త మా

(౨) , స స సే ని ధా పా , మ గ మ ప ధా ప ధ ప మ గ స రి గ మ | ప మ ప ప ధా, ని సే రి సా సే ని ధ ప మ గ
పా డ గం టి మ య్యా మి మ్ము పు రు షో త్త మా

(3) మ రి స స సా రి సే సే ధ సే రి పా గ మ ప ధ ని సే సే ని ధ ప మ గ స రి | గ మ ప ప ధా ని సే సే గే రీ సే ని ధ ప గ మ ప గ
పా డ గం టి మ య్యా మి మ్ము పు రు షో త్త మా
మ రి (పాడగంటి) . . . . . సా , , , , సే
మా మ

(౧) సే ని సే రీ రీ రీ స ని రి సే ధ నీ సా , సే
ము నె డ య క వ య్యా మ

(౨) సే ని సే గే మే రీ సా సే ని పా ధ ని సా ప సే
ము నె డ య క వ య్యా, మ

(3) సే ని ని సే రీ గే మే వ గే రీ సే ని రీ ని సే ధ ని ప ధ ని సా మ ప ధ ని | సా గే రీ , సే ని ధా పా , మ పా సా , ని పా , మ గ మ ప గ
ము నె డ య క వ య్యా లో నే టి రా య డా
మ రి (పాడగంటి)

[చరణం]

(౧) , గ మ పా ప మ గా , మ ధ ప మ ప మ గ మా | , గ మ ధా , సే ని ధ పా , , , ,
కో రి మ మ్ము నే లి న ట్టి కు ల దై వ మా

(౨) , గ మ ప ధ ధ మ గా మ ప ధ ప ప మ ప ధ ప ప మ గ | మా గ మ ప ధ ని సా ధ సే ని పా , పా మా
కో రి మ మ్ము నే లి న ట్టి కు ల దై వ మా చా ల

, గ మ ప ధ మ ప మ గ గ రీ గ మ ప గ మ రీ సా | ని స మ మ గ గా మ ప మ ధ ప మ పా , , , ,
నే రి చి పె ద్ద లి చ్చి న ని ధా న మా

, సే సే సా , ని సా , రీ , రీ రీ రీ | సే సే ని సా , రీ గా రీ గా , గా మే వ గా మా
గా ర విం చి ద ప్పి దీ ర్చు కా ల మే ఘ మా మా కు

రీ ని సే గా మే గే రీ గే రీ సా సే రీ సే ని ధ ప మ గ రి గ మ ప ధ ని | సే రీ సా , రీ సే ని ధా పా , మ
చే రు వ చి త్త ము లో ని శ్రీ ని వా
గా మా ధ ప గా మ ప గా మా | రి
సు డా (పాడగంటి)

ఇట్లే క్రింది చరణములు :

(౨) భావింప గైవసమైన - పారిజాతమా ! మమ్ము
చేవదేర గాచినట్టి - చింతామణీ !
కామించి కోర్కులిచ్చే - కామధేనువా ! మమ్ము
తావై రక్షించేటి - ధరణీధరా ! (పాడగంటి)

(3) చెడనీక బ్రతికించే - సిద్ధమంత్రమా ! రోగా
లడచి రక్షించే ది - వ్యౌషధమా !
బడి బాయక తిరిగే - ప్రాణబంధుడా ! మమ్ము
గడియించినట్టి శ్రీ వెం - కటనాథుడా ! (పాడగంటి)

లఘుటీక : ఎడయకవయ్యా=విడిచిపోవలదయ్యా ; నేరిచి=జ్ఞానము సంపాదించి ; నిధానము=నిధి ; కాలమేఘమా=నీలమేఘమువంటి వాడా ; కైవసము=చేతి కబ్బినది ; చేవదేర=సారము వెల్లడియగునట్లు ; తావై=శరణమై ; బడి బాయక=వెంబడిలక ; గడియించినట్టి=సంపాదించిన - సృజించిన.

'కోరిక లిచ్చే' అనే ముద్రితపాఠము ఛందోనుసారముగా 'కోర్కు' లని మార్పు చేయవలసితిని.

చింతలూరి ఆయుర్వేదాశ్రమ స్థాపకులు, కీ॥ శే॥ వైద్యరాజ ద్విభాష్యం వెంకటేశ్వర్లుగారు

వీరు ప్రాగ్గోదావరీ మండలమున నాలమూరు నకు సమీపముననున్న చింతలూరు గ్రామమున జన్మించిరి. వీరు సామాన్యకుటుంబమునకు జెందినవారు. చిన్నతనమునుండి మాతృభాషయందు, సంస్కృతభాషయందు, వీరికి గల శ్రద్ధాభక్తులు మెండు. అనతి కాలములో నే యవి నేర్చుకొని వైద్యగ్రంథముల గరతలామలకముగ బఠించిరి. తమ యూరున బెద్ద బడులు లేకుండుటంజేసి వీ రాంగ్లభాష నంతగా నేర్వజాలకపోయిరి. తుదకు వీరికి వైద్యవృత్తియే ప్రధాన మయినది. అందందు గృషి జేయుచు రోగుల కుదారబుద్ధితో జికిత్స జేయ మొదలిడిరి. క్రమముగా వీరిపేరు నలుమూలలకు బ్రాకినది. బంగారు, వెండిపతకములు, సింహతలాటపు మురుగులు మొదలగు బహూకృతు లనేకము బొందిరి. నాటినుండి వీరు వైద్యమూర్ధన్యులయిరి. వైద్యరాజ బిరుదాంకితు లయిరి.

పిమ్మట గొంతపెట్టుబడిపై బెద్దాపురము, కాకినాడ, రాజమహేంద్రవరములలో బ్రాంచిలు పెట్టిరి. అనంతరము నేటేట గొన్ని కొన్ని ముఖ్యపట్టణములలో బ్రాంచిలు తెఱచుచునే వచ్చిరి. ఇప్పుడు ఆంధ్రరాష్ట్రములోని ముఖ్యపట్టణములలో వీరివి నలుబది బ్రాంచిలకు పైన నున్నవి. ఈ బ్రాంచిలవలన వీరికి వచ్చు నికరాదాయము, యావద్వ్యయములు పోను, లక్షరూప్యములపైగ నుండును. ధన మపారముగా సంపాదించిరి. పంటభూములు హెచ్చుగా సంపాదించిరి.

ధనము సంపాదించినతోడనే ఇష్టదైవమగు ధన్వంతరికి దేవాలయప్రతిష్ఠాపన దమ గ్రామమునందు గావించిరి. అన్నదానములు, కవిసన్మానములు చేసిరి. నిత్య ధూపదీపనైవేద్యములు జరుగునట్టుల దేవాలయమునకు నేడాదికి దగిన యాదాయము వచ్చులాగున భూమి నిచ్చిరి. ప్రతియేట ధన్వంతరి జయంత్యుత్సవములు గావించు నేర్పాటు జేసిరి.

సంస్కృతము మృతభాష యనువారికి గొడ్డలిపెట్టుగా, వీరు వింజరమున నొక సంస్కృతవేదపాఠశాలను స్థాపించిరి. ఈ యధ్యయనశాలకుగూడ కొంత నికరాదాయము నేటేటా వచ్చులాగున గొంత భూమిని ప్రత్యేకించి వ్రాసియిచ్చిరి.

కవులయందు వీరికి గల యాదరణ మిక్కిలి ప్రశంసింపదగినది. మున్నూటపదియార్లనొసగి ద్విభాషి సోమనాథశాస్త్రి యను కవివరుని 'కుముద్వతీపరిణయము' అను నామాంతరము గల ప్రబంధరాజమునకు గృతిభర్తయైరి. వ్యాకరణాచార్య, యోలేటి సూర్యనారాయణ శాస్త్రి విరచిత ధన్వంతరిచరిత్ర నాబడు గ్రంథమునకు గృతిభర్తయై గ్రంథకర్తను వేయి నూటపదియార్లొసంగి యాదరించిరి. ఇంక ననేకయుద్గ్రంథములకు గృతిభర్తయైరి.

శ్రీ వెంకటేశ్వర్లుగారు 1949 జూన్ 15 వ తేదీని, దమ 67 వ యేట స్వర్గధామ మలంకరించిరి. వీరి కీర్తి చిరస్థాయిగా నాంధ్రదేశమంతటనూ చింతలూరి ఆయుర్వేద వైద్యాలయములు వర్ధిల్లగలవు.

అ. లక్ష్మీపతి.

ఆంధ్రరాష్ట్రసాధనకు యువకులు కదలాలి

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య

'జారిన దేశగౌరవము
చక్కనదిద్ది మహేంద్రమండలీ
భారము శ్లాఘనీయముగ
చాలనచేసి సమానరాష్ట్రముల్
కూరిమి నాసజేయ తెను
గుం బుడమిన్ గయిసేయరయ్య దీ
క్షారతి నాంధ్రపుత్రులు జ
గజ్జనధర్మమె దృష్టి నిల్పుచున్.'

నా ఆశయం విశాలాంధ్ర నిర్మాణమే. మన ఆంధ్రోద్యమం 35 సంవత్సరాలనుండి సాగుతున్నా రాష్ట్రం సాధించలేకపోయినాం. తెలంగాణా కాంగ్రెస్ సంఘంవారు మనతో కలియుట కువ్విళ్లూరుతూ తీర్మానించారు. అచటి కోటిమంది ఆంధ్రులు ఎపుడు కలిసిపోతామాయని యెదురుచూస్తున్నారు. అయితే ఆంధ్ర రాష్ట్రం ప్రత్యేకంగా లేనపుడు దేనిలో కలియడం? వివిధభాషలతోనున్న మద్రాసు రాజధానిలో చేరే బదులు వివిధ భాషలతో నున్న హైదరాబాదు సంస్థానంలోనే వుండమన చ్చుగా. అందువల్ల ఆంధ్రరాష్ట్ర నిర్మాణం అత్యవసరం.

రాయలసీమాభివృద్ధికి ఎన్నాళ్లనుండో ఆందోళన చేస్తూవచ్చాం. వివిధభాషా ప్రాంతమగు మద్రాసురాజధానిలో ఇన్నాళ్లనుండి పొందిన లాభం లేదని తేలిపోయింది. ఆంధ్రరాష్ట్రం లేనిది రాయలసీమాభివృద్ధి లేదనేదీ, రాయలసీమవాసులు కలిసి ఆందోళన చేయంది రాష్ట్రం సాధించడం అసంభవమనేది అనుభవమే. అందరం కలిసి రాష్ట్రం సాధించి అభివృద్ధి ప్రణాళికలు అమలుచేయవలసివుంది.

కరువు కాటకాల కాలవాలమై 1948 కరువులో 30,000 మంది ప్రాణాలు బలిపెట్టిన విశాఖదుస్థితి తొలగించుకోవడం ఆంధ్రరాష్ట్రంలోనే అనేది అనుభవమేగా. ఒరిస్సాలోనున్న గంజాం కోరాపుట్టి ఆంధ్రప్రాంతాల సమస్య ఉన్నవి. వారు ఆంధ్రప్రాంతంలోకి రావలెనని 15 సంవత్సరాలుగా పలుపాట్లు పడుతున్నాం. ప్రజాబలంతోబాటు ప్రభుత్వబలంకూడా అవసరమని తేలిపోతున్నది.

అట్లే బస్తరు, చాందా, మైసూరు, తమిళ, కర్నాటక ప్రాంతాలల్లో మిగిలిపోయిన ఆంధ్ర ప్రాంతాల విషయం ఎప్పటికప్పుడు ఆందోళన రూపంలోనే మిగిలిపోతున్నవి. ఆంధ్రరాష్ట్రం నామరూపాలు లేనన్నాళ్లు ఈ సమస్యని పరిష్కరించుకోలేమనేదీ అనుభవంలో చూస్తునే వున్నాము, ఈ చిక్కులనన్నింటిని పరిష్కరించుకొని విశాలాంధ్ర సాధించుటకు కలలు కనడం కాకుండా కార్యసాధనలో కూడా ముందడుగు వేయవలసివుం దనేది ఈ 35 సంవత్సరాల అనుభవంలో బోధపడుతున్నది.

ఎవరైతే ఇన్నాళ్లనుండి రాష్ట్రసాధనకు నాయకత్వం వహించారో, అట్లే ఈ నాడు కూడా నాయకత్వం వహించవలెనో అట్టి రాజకీయ పార్టీలు, వ్యక్తులు, సంస్థలు తర్జనభర్జనలతో ఆంధ్రరాష్ట్ర నిర్మాణసమస్యను ఎప్పటికప్పుడు ఏదో కారణంతో మూలకు నెట్టివేస్తున్నారు.

నేటి కేంద్రప్రభుత్వ దృక్పథంలో పటేల్ నెహ్రూలకు ఆంధ్రరాష్ట్రం నిర్మాణము యెడ ఉన్న అభిప్రాయం అందరకు తెలిసిందే. నాయకత్రయ నివేదికను ప్రకటించి గమ్మని ఊరకున్నారు, డాక్టరు పట్టాభి ఆంధ్ర రాష్ట్రాన్ని ఈ అదనులో వదలుకుంటే అసలు పోతుందనే అమిత ఆదుర్దాతో పరస్పర విరుద్ధ ప్రకటనలతో ఆంధ్రులలో వున్న తికమకలను మరింత హెచ్చుచేశారు.

వివాదాలలో మగ్నంకాకుండా ఆవేశాలకు లోను గాకుండా ఉన్న పరిస్థితులను వాస్తవిక దృక్పథంతో అవగతంచేసుకొని ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించడంకొరకు కృషిచేయవలసివుంది. రాజ్యాంగపరిషత్తు, కేంద్రప్రభుత్వాల ధోరణి గమనిస్తే రాష్ట్రాల జాబితాలో ఆంధ్ర రాష్ట్రాన్ని చేరుస్తారని ఆశించలేము. షెడ్యూలులో ఆంధ్రరాష్ట్రం చేరకపోతే నూతన రాజ్యాంగం అమలుకు వచ్చేలోగా మనం రాష్ట్రాన్ని సాధించాలె. లేకపోతే నూతన రాజ్యాంగాన్ని అనుసరించి సవరింపబడే మరొక రాజ్యాంగంలో మన్నా రాష్ట్రం రావాలిసి ఉంటుంది. అంటే అంతవరకు - అదీ యెప్పుడు జరుగుతుందో, ఆంధ్ర జీవితాన్ని నేడున్న ఉమ్మడి చెన్నరాజధానిలోనే ఎప్పటికప్పుడు తగాదాలతో ఆంధ్రాభివృద్ధి అంటూ లేకుండానే వుండిపోవలసి వుంటుంది. విశాలాంధ్ర రాష్ట్రనిర్మాణం కాదుకదా - కనీసం కొన్ని జిల్లాలతో యేర్పడే ఆంధ్రరాష్ట్రం తలంపుకూడా కనుచూపుమేరలో లేకుండా పోతుంది. ఢిల్లీలో బాధ్యత కలిగిన వ్యక్తి చెప్పినట్లు శాశ్వతంగానే ఎగిరిపోతుందనే తలంచాలెనేమో?

ఈపరిస్థితుల నన్నింటిని అవగతం చేసుకుంటే ఆంధ్రరాష్ట్రాన్ని శాశ్వతంగా త్రోసివేసేబదులు విశాలాంధ్రనిర్మాణానికి ప్రాతిపదికగా, వివాద ప్రాంతాల విషయం వదిలివేసి తగాదాలేని 11 జిల్లాలతో రాష్ట్రనిర్మాణం సాధించడం కార్యసాధకుని ధర్మం. ఎవరేమి అభిప్రాయపడినా నాయకత్రయ నివేదికను కాదనగల స్థితి ఆంధ్రోద్యమానికుందని విశ్వసింపజాలను. అయితే అంగీకరించడం, లేకపోతే ఆంధ్రరాష్ట్రం వాయిదా వేయడం తప్పితే నేటి ఆంధ్రులు ఈ అదను వదలితే జరిగేది యేమీ లేదని చెప్పక తప్పదు. ఆంధ్రులందరు ఆలోచించుకోవాలె. సమయస్ఫూర్తి చూపి, ఆంధ్రరాష్ట్రం సాధించడమా; ఆవేశంతో ఆంధ్రరాష్ట్రం వెనక్కు నెట్టి వేయడమా? ఆంధ్రులలో అంగీకారం కపోతే అసలు కెసరు పెట్టదలంచిన కేంద్రప్రభుత్వం అవకాశం యిచ్చినవార మవుతాం. అంతే!

నివేదిక వచ్చి రెండు నెలలు కావస్తున్నా, పైపెచ్చు రాజ్యాంగం తయారుచేయడం ముగింపుకువచ్చినా నాయకులంతా తమకు పట్టనట్లున్నారు. సమస్య మూలకు పోతున్నది. అసలు పరిస్థితులు ప్రజలకు తెలియపరచి, రాష్ట్రాన్ని సాధించే యత్నం జరగడంలేదు. మనకేం పట్టిం దనే తత్వంలో పడిపోతున్నారు.

ఇది చాలా ప్రమాదమైన పరిస్థితి. పెద్దలు దూరంగావుంటే యువకులైనా ముందుకు వచ్చి ఆంధ్రాభివృద్ధికి ప్రాతిపదికగా రాష్ట్రాన్ని సాధించడం ఈనాడు అత్యవసరం. రాష్ట్రం వస్తే ఆంధ్రజీవితంలో ఎంత మనోవిశ్వాసం వస్తుందో యోచించండి!

యువకులమైనా కదిలి వాస్తవికపరిస్థితులను అవగతంచేసికొని, యావదాంధ్రదేశంలో రాష్ట్రసాధనకు తీవ్రప్రచారం చేసి, వివాదగ్రస్త ప్రాంతాలను వదలివేసి వెంటనే రాష్ట్రనిర్మాణం జరగేటట్లు ప్రజాభిప్రాయాన్ని సమీకరించడం అత్యవసరం. అందుకు యువకులంతా కదలాలి. అపుడుగాని పెద్దలు నిర్ణయానికి రారని తోస్తున్నది. అప్పుడూ రాకపోతే ప్రజలే నిర్ణయిస్తారు. ఈ విషయంలో ఈ అభిప్రాయంతో యేకీభవించే మిత్రులు అందరూ కలిసి ఒకసారి సంప్రదించుకొని యావదాంధ్రప్రజాభిమత సమీకరణకార్యసాధనకు గడంగాలి.

ఆంధ్రరాష్ట్రసాధనవాంఛయే ఈ విన్నపానికి దారి తీసింది. ఈ నాడీ అదను జారవిడిస్తే రాజకీయాలు అర్థంచేసికొనగలిగిన మనకు ఆంధ్రరాష్ట్రనిర్మాణం అద్యతనభవిష్యత్తులో కాన్పించడం లేదు. ముక్కోటి ఆంధ్రులచే ముక్తకంఠంగా ఆంధ్రరాష్ట్రవాంఛను ప్రకటించి, సాధించి, విశాలాంధ్ర నిర్మాణం చేయూలె. యువకులు ముందుకు రావాలె. సంవత్సరాల తరబడి యెదురుచూచి రాష్ట్రం సాధించలేకపోతిమనే వ్యథ పొంది, ఇపుడన్నా లభిస్తుందేమో నని ఆశించి ఈ రెండు నెలలు చూచి అదను చెయిజారిపోతున్నదే అనే దిగులుతో ఆంధ్రయువకులపైవున్న ఆశవల్ల ఈ విన్నపం చేశాను. వ్యక్తికక్షలకు సంబంధం లేకుండా అందరం కలిసి ఆంధ్రరాష్ట్రాన్ని సాధించుదాం. వ్యక్తిద్వేషా లుంటే అటుపై సాధించుకొననీయండి. ఈ అదనున యువకులు కూడా ముందుకు రాకపోతే ఆంధ్రభవిష్యత్తు అంధకారమయం అంటే క్షమించండి.

"కృష్ణాతరంగపంక్తిన్ ద్రొక్కి తృళ్లింత
నాంధ్రనౌకలు నాట్యమాడునాడు
ఇంటింట దేశిసాహిత్యదీపములతో
నాంధ్రతేజస్సు రాపాడునాడు
సుకుమార శిల్పవస్తు ప్రపంచమునందు
నాంధ్రనైపుణి పంతమాడునాడు
సమరసేనా వ్యూహ జయపతాకల క్రింద
నాంధ్రపౌరుషము చెండాడునాడు.
చూచి, సంతోషమున తల లూచి, గర్వ
మూచి, ఆంధ్ర పుత్రీపుత్రు లందగలరు,
శాంతి; నందాక లేదు విశ్రాంతి మనకు,
కంకణవిసర్జనమున కిది కాల మగునె."

―――

సాహిత్యమీమాంస:

హరవిలాసము శ్రీనాథుడు

శ్రీ జ్యోశ్యుల సూర్యనారాయణమూర్తి

మాఘభారవివచోమకరంద నిష్యందముననినట్లె యితరసంస్కృతసుకవి శేఖరులను గూడ జక్కగ శ్రీనాథుడు డవగత మొనర్చుకొని యభినందించినాడు. అట్టివారల నత్యంతాదరపాత్రుడు కాళిదాసాక డని హరవిలాసము శ్రీనాథుని కాళిదాసపక్షపాతము నభివ్యక్తము చేయుచున్నది.

హర్షనైషధకావ్య మాంధ్రభాషకు దెచ్చుట శ్రీనాథుని ప్రత్యేకకృతి. యథార్థముగ నీతని కృతులన్నియు దెల్గుసేతవే. ఐనను అవి స్వతంత్రములే. అట్టి పోకడ కవిత్రయమునొద్ద నేర్చినదైనను ప్రత్యేకతావిభాసితము. ఇక హరవిలాస మొక స్వతంత్ర కృతి యయ్యును గౌరీకళ్యాణము బూర్తిగ గాళిదాసుని కుమారసంభవరచన కనువాదము. పైన కిరాతార్జునుల గాథ భారవికిని భారతచంపువునకును సన్నిహితమేమో? (అది నేను ఆ గ్రంథములు దగ్గఱనుంచుకొని పరిశీలింపలేదు.)

ప్రస్తుతము, శ్రీనాథుడు కాళిదాసు ననువదించిన తావుల, యందము డెందములకు విందు గొల్పెడిని గాన నది ప్రసంగసంగతము.

అసమశరుడు తనమ్రోల దగ్ధము కాగా, ధరణీధరకన్యతన రూపును నిందించినదట ఇక్కడ కాళిదాసు "ప్రియేషు సౌభాగ్య ఫలా హి చారుతా" అని కొంచెము క్లిష్టరీతిని భావమును సమాసగత మొనర్చినాడు. ఇది సంస్కృతమున కందము. ఇది అవగత మొనర్చుకొని తనలో జీర్ణింపజేసుకొన్న మీదట శ్రీనాథుడు తెలుగుతన ముట్టిపడునట్లు దానినే యిట్లనెను. "పతులు మెచ్చని చెలువు నిష్ఫలము గాదెల అని—

బాహులతలోపధాయినీ, స్థండిలశాయినీ వంటి మాటల నీతడు "బాహువల్లి తలాడగా బవ్వళించె, శైలపాషాణపట్టికా స్థండిలమున" అని కూర్చెను. ఒకొక్కచో నీతని పథ్యము జదువునప్పుడు పూర్తిగ గాళిదాసే ఆమాటలలో ప్రత్యక్ష మగుచుండును. అట్టి రచనుబట్టి ఆ కవితిలకునిరచనములోని యందమున కానందించి యాతనిపై గౌరవము వ్యక్త మొనర్చుట కొడట్లొనర్చె ననిపించును. శబ్దసౌందర్యము, ఆర్థ్వని లాలిత్యము కాళిదాసు ప్రదర్శించినంత యితరులలికసాధ్యము. అందుచే నట్టి లలితరచనల కనువాద మారీతి నుంచుటయే సుందరము. అది శ్రీనాథుడు గుర్తించెను గాని కొంత కొఱత యున్నది. ఆ రెండును బరికింతము.

"అజినాషాఢధరుండు ప్రౌఢతరభాషాతిప్రగల్భుండు"-ఇత్యాదిగా చదువునప్పటికి అథాజినాషాఢధరః ప్రగల్భవాక్ జ్వలన్నివ బ్రహ్మమయేన తేజసా" అనునది గుర్తునకు వచ్చుట కాలస్యము కాదో.

మగువా నీ పెంచినదు లత "చిగురున ముకుళంబునుల్లసిల్లెనె చెపుమా ?
పగడపు గెమ్మోవిపయి.
న్నగవుదయించిన విధంబునం బ్రస్ఫుటమై"

ఈ మాదిరి పద్యములుమాత్ర మనువాదములయ్యును స్వతంత్రములా? అనిపించును.

కాళిదాసు-"యతః సతాంసన్నతగాత్రి సంగతం మనీషిభి స్సాప్తపదీన ముచ్యతే"అన్నాడు. సాప్తపదీన మన్నదానికైన నర్థము చెప్పికొనవచ్చును. ఏడడుగులు గలిసి వేసినచో నా సంబంధము సత్పురుషులకు స్నేహకారి యగు ననుట సామాన్య విజ్ఞానము. పెండ్లిలోను సప్తపది యుండుట ఈ యూహకు సహకారి. ఇక "సప్తభిః పదై రుచ్చార్యమాణైః జాతం" అని భావించిరయే, ఆ మాట లాడినచో నది సత్సంగసంధాయి యగు ననుకొనుట కలదు. ఇది మల్లినాథుని యభిమతముగ గన్పట్టుచున్నది. కాళిదాసును మఱియొకచోట "సంబంధ మాభాషణ పూర్వ మాహుః" అని వదలిపెట్టిన సంగతి గాంచిన నీ రెండవభావము సమంజస మనిపించుచున్నది. ఇట్టిచోట శ్రీనాథుని వచనము చూడుడు: "సంబంధంబు సాప్తపదీనంబు గావున నింత తడవు..."అని చర్చకు వదలినాడు. దగిన తగవు వచ్చు విషయములు మన కెందుకని శ్రీనాథుడు డందమునే ఆవిష్కరించును.

ఇట్టిచోట నొకదాని సామంజస్యము పరికింప దగ్గది. జటిలుడు పార్వతితపస్సునకు కారణమడుగుచు నిట్లనెను. విద్యతే : మమాపి పూర్వాశ్రమ సంచితంతపః; తదర్థ భాగేన లభస్వ కాంక్షితం వరమ్ తమిచ్ఛామిచ సాధు వేదితు". ఇట్టి కాళిదాసుని వాక్యములలో గ్రహించిన కొలది యర్థస్ఫూర్తిభావప్రాగల్భ్యము దోచుచునే యుండును కాని సామాన్యని పఠనమున కడ్డమురానిసారళ్యము ప్రస్ఫుటము. దీని యర్థము పరికించి శ్రీనాథుని సంగతి చూతము.

నీ తప స్సెందులకో తెలియ దనుచు నీ కోరిక యేమో తెల్పుమనుచు నొకవేళ పతిని కోరుచున్నావా? అది యసంభవము అని చెప్పిన మీద నామె కోర్కె తెలియకయే జటిలుడు పోనీ నాకును పూర్వాశ్రమమున నార్జించిన (బ్రహ్మచర్యాశ్రమ) తప స్సున్నది. అది సగమ్ము యిచ్చెదను. దానితో నీ కాంక్షితము నందుము ఆ వరుని తెలిసికొనగోరుచున్నాను. అని తాత్పర్యము. "వరం త మిచ్ఛామిచ సాధు వేదితుం" అన్నప్పుడు భర్తను కోరినచో వాని నన్నియు, లేక కోరిక యేదో దాని ననియు దెల్లము గూఢముగూడ నైనవి.

అసలే బ్రహ్మచారి గదా! ఇంక పూర్వాశ్రమ మేమిటి? అని కొంద రిక్కడ శంకింతురు. పూర్వాశ్రమః - ప్రథమాశ్రమః అను మల్లినాథవివరణమును బరికించి పరిశీలించిన ఈ బ్రహ్మచర్యాశ్రమములో (మొదటిదైన బ్రహ్మచర్యమున) సంపాదించిన తపస్సు నిచ్చెద; నీ కాంక్షితమును పొందుముగాని నీ లావణ్యమునకు తపస్సు తగ దనునంతవఱకే యిక్కడ జటిలుని యాశయ మనుటకు కాళిదాసు సాక్ష్యము.

శ్రీనాథుడు "అంతి నిలువక యక్కపటవటుండు" అని ప్రారంభించి - ఇట్లు వ్రాసెను :

"ఏనును బ్రహ్మచారి దర
శేఖణ' నీవును కన్య వింతకా
లానకు నీకు పెండ్లియె ఫ
లంబగు నేని విచార మేల స
మ్మానముతోడ నన్ను ముని
మాన్య వివాహముగమ్ము లెమ్ము కా
దేని తపంబులోని సగ
మిచ్చెద మాను తపోభిమానమున్."

అని. ఈ పద్య మేమైన నంద మిచ్చెనా? లే దనక తప్పదు. శివు డని యామె యెఱుగదు. ఆమె యెవరినిగూర్చి తపస్సు చేయుచున్నదో అసలు భర్త కావలెనో కాదో ఆమెచేత చెప్పించినమీదట నీ కపటవటువు ఇట్లనిన బాగుండునేమో? అదీకాదు. తన గొప్పతన మేమి? పట్టి

(20 వ పేజీ చూడుడు)

సౌందర్యానుభూతి: చిత్తరువులో ప్రకృతిశోభ

శ్రీ పిలకా లక్ష్మీనరసింహశాస్త్రి

సౌందర్యానుభూతికి చిత్రకళయందలి ప్రకృతిశోభకు సన్నిహితసంబంధము ఉన్నది. కళాతపస్వి మానససరోవరములో విహరించే రాజహంస. హంస పాలు నీరు వేరు చేయగలిగినట్లు కళాశిలి ప్రకృతినుండి కళాఖండములు ఏరుకుంటాడు. అందులో ఎంతో నేర్పు ఉంది అతనికి. ప్రకృతిశోభ నెరుగక సౌందర్యానుభూతి సంపూర్ణముకాదు.

అసలు బ్రతుకులో అనుభూతి ఉండాలి. అది గాఢముగా ఉండాలి. పెరిగి విరిగే సుఖదుఃఖములు కావాలి. వీటి పరస్పరసమ్మేళనములో ఆవిర్భవించే అనుభూతి నిశితంగా ఉంటుంది. బ్రతుకులో అందాలు దిద్దుతుంది. తరువాత సౌందర్యపదము చాలా క్లిష్టమయినది. దీనిని గురించి అందరికి అంతో ఇంతో అనుభవము ఉంటుందికాని సౌందర్య నిర్వచనము కష్టము. అందులోను కళాశిలి పొందే అనుభూతిని ఫలానా అని నిరూపించటము కష్టతరము. ఎందుచేత నంటే శిల్పిలో ఈ సౌందర్యానుభూతి సహస్రముఖాలుగా ఉంటుంది. దానికి హద్దులు గీయలేము. అయినా చిత్రకారుడు తనలోని సౌందర్యానుభూతిని చిత్రములోకి తెచ్చి ఒక సమగ్రస్వరూపము ఇస్తూనే ఉంటాడు. అనుభూతిని అందరు సమానముగా పొందుతారా? పొందిన అనుభవమును అందరు ఇతరులకు చెప్పగలరా? అనిపిస్తుంది. దీనిని అందరు సమానముగా గ్రహించలేరు. ఇది మానవునిలోని మనోహృదయముల సంస్కృతికి, రసజ్ఞతకు అనురూపమయిన ఆకృతి కలిగిఉంటుంది. సంస్కారి అయినకాని సౌందర్యానుభూతి కలుగదు. కలిగిన అనుభవాన్ని కళాశిలి కాని చెప్పలేడు. ఈ దివ్యానుభవమునకు రూపురేఖలు తీర్చటమే శిల్ప, చిత్రకళలు. ఇతరలలితకళలలో కూడా సౌందర్యానుభూతి సమృద్ధంగా ఉంది. ఏకళలో నయినా సంస్కారహీనులకు ప్రవేశము లేదు. సంస్కారులయిన సహృదయులకే సౌందర్యానుభూతి - చిత్తరువులోని ప్రకృతిశోభ తెలుస్తాయి.

తరువాత అందరు సౌందర్యవంతులు కాకపోవచ్చును. అయినా అందచందాలనుగురించి తెలుసుకు నితమలో సౌందర్యానుభూతిని పెంపొందించుకోవటానికి ఎంతైనా అవకాశం ఉంది. ఆ విధంగా శిల్పచిత్రకళలు సుబోధకము లౌతాయి. చిత్రములలోని ప్రకృతి సౌందర్యమును అవగాహన చేసుకుందుకు ద్రష్టప్రకృతిశోభ తిలకిస్తూ ఉండాలి. ప్రకృతిలో అందాలు తనలో ఇముడ్చుకోవాలి. సౌందర్యమంటే ఏమిటో నిత్యము పరిశీలన చేయాలి. సౌందర్యము రెండు విధాలుగా కనబడుతుంది. ఒకటి బాహిరము; రెండవది ఆంతరము. మనము నిత్యము చర్మచక్షువులతో చూచే బాహ్యసౌందర్యానికి వృద్ధిక్షయములు ఉన్నాయి. శుక్లపక్షములో పెరిగే చంద్రకళవలె, యౌవనసౌందర్యము దినదిన ప్రవర్ధమానము అవుతుంది. మళ్లా కృష్ణపక్షములో క్షీణించే చంద్రకళవలె యౌవనము మళ్లాక సౌందర్యము మళ్లిపోతుంది. నిత్యపరిశీలనలో భౌతికసౌందర్యము శాశ్వతము కాదని విశదమవుతుంది. అయినా ఏదో ఒక పెద్ద వెలుగు లోపల నిండిఉండాలికదా! దాని ప్రతిబింబము ఏమో అనిపిస్తుంది బాహ్యసౌందర్యము. సౌందర్యజిజ్ఞాసలో, అన్వేషణలో అంత దృష్టి కలుగుతుంది. అంతర్దృష్టిలో అపూర్వమయిన లోవెలుగులు మెరమెరలాడుతాయి. అదే ఆత్మసౌందర్యము. సౌందర్యానుభూతికి ఈ ఆత్మసౌందర్యమే మూలకందము. శరీరసౌందర్యము వెన్నెలవంటిది. ఆత్మ పరిపూర్ణసుధాకరబింబమువంటిది. జాబిల్లికి స్వయంప్రకాశము లేదంటారు. కాని ఆత్మకు ఉంది. మనోనేత్రముతో కళోపాసకుడు ఆత్మసౌందర్యమును రెప్పవేయక తిలకిస్తూ ఉంటాడు. బహిరంతర సౌందర్యముల సమన్వయమును అంతర్ద్రష్టఅయిన కళాశిలి కనుగొంటాడు. ఏ శాశ్వత ఆనందముకోసము శిల్పి అన్వేషిస్తూ ఉంటాడో ఆ అన్వేషణే కళాతపస్సు. మహర్షులు కళోపాసకులు సత్యము, సౌందర్యము, ఆనందము ఈ మూటిని అన్వేషిస్తారు. కళోపాసకులకంటె కూడ మహర్షులు గొప్ప సౌందర్యోపాసకులు అన్నా అతిశయోక్తి కాదు. ఉదాహరణగా ఆదికవిఅయిన వాల్మీకి మహర్షిని రామాయణ మహాకావ్యమును తీసుకోవచ్చును.

బొమ్మలలో కనబడే అందము వేరు. రోజూ కళ్ళతో చూచే బాహ్యసౌందర్యము వేరు. ప్రకృతిలో చూచినదల్లా యథాతథంగా చిత్రించటము చిత్రకారుని పని కాదు. శిల్పంలో కూడా అంతే. ప్రకృతిశోభను కళాశిలి తనలో ఇముడ్చుకొని, చిత్తరువులోనికి - భగీరథుడు గంగను పృధివికి తీసుకువచ్చినట్లు తీసుకువస్తాడు. తనలోనే రూపకల్పనచేసుకుంటాడు. ప్రాణప్రతిష్ఠచేస్తాడు. క్రమంగా అందచందాలు దిద్దుకుంటాడు. ఇది యోగము. ఒక తపస్సు, తనలోని వినూతనసృష్టిని ప్రకృతి అందాలతో పోల్చి చిత్రించుకుంటాడు. తద్వారా గొప్ప సౌందర్యసృష్టి చిత్రములలో, శిల్పములలో, మహాకావ్యములలో అవతరిస్తుంది. ఈవిధంగా సౌందర్యానుభూతి, ప్రకృతిశోభ శిల్పచిత్రకళలలో హత్తుకుంటాయి. వాల్మీకి మహర్షి "రామం రాజీవలోచనం" అని "సోమవత్ ప్రియదర్శనః" అని ప్రకృతిసౌందర్యముద్వారా అద్భుతరూపకల్పన చేశాడు. ప్రకృతి శోభ రూపకల్పనలో అంతగా చొచ్చుకుపోయింది. శిల్పులు, చిత్రకారులు ముద్రలు, అంగవిన్యాసములు సృష్టించి గొప్ప సౌందర్యసృష్టి చేశారు. ఈ అద్భుతసౌందర్యములు ప్రకృతిలో లేవు. ఈ అందాలతో లలితకళాధిదేవత శిల్పచిత్ర కళలలో లాస్యము చేసింది. కనకనే కళాతపస్సులో ఆనందతన్మయత్వము ఉంది. హృదయాంతర్గతమయిన ఒక రమ్యభావము రూపంలో, రేఖలలో, వర్ణసమ్మేళనములో పరమేశ్వరుని సాన్నిధ్యమును పొందుతుంది.

మనము మామూలుగా కళ్లతో చూచే అందచందాలే బొమ్మల్లో ఉంటాయనుకోవటంవల్ల చూపరులకు వాటిలోని సౌందర్యము తెలియటంలేదు. బొమ్మల్లోని అందము ఎక్కడా ప్రకృతిలో ఉండదు. కాని ప్రకృతి అందాల సహాయంతో క్రొత్త సౌందర్యమో-సందేశమో కళాశాలి సృష్టించుతాడు. అది తనలోనించి వచ్చిన గొప్ప సృష్టి. అది ప్రకృతికన్న మిన్న. ప్రకృతిలో మనము కళ్లతో చూచే సొగసులన్నీ పరిమితమయినవి. మనోనేత్రముతో చూచే అందము అతిలోక మయినది. విస్ఫారిత మనోనేత్రముతో చిత్రములు - శిల్పములు చూడాలి. కళాశిలి సౌందర్యానుభూతి, ప్రకృతిశోభ అప్పుడు అర్థమవుతాయి ఇతరులకు.

పూర్వచిత్రకళలో అజంతా చిత్రకారులు ప్రకృతిశోభను ఎంతో ప్రౌఢంగా చిత్రించారు. పూచిన బాలరసాలములు - కిసలయములు - పద్మములు - లతలు - రకరకముల పక్షులు అన్నీ నేత్రపర్వ మొనరిస్తాయి. అన్నింటిలోను ప్రకృతిశోభ కలకలలాడుతూ ఉంటుంది. ప్రకృతిశోభ శిల్ప - చిత్రకళలలో వచ్చినంత విస్తృతముగా ఏ లలితకళలోను రాలేదు. సృష్టికంటె అద్భుతమయిన కళాసృష్టిలో ప్రకృతిశోభ పరవళ్లు త్రొక్కింది.

ఇంకా సౌందర్యానుభూతి మన పూర్వుల దృష్టిలో ఎంత సంపన్నమయిందో కొన్ని దేవతా శిల్పములను, చిత్రములను పరిశీలించితే తెలుస్తుంది. శ్రీమూర్తి అయిన విఘ్నేశ్వరుడు పరమసౌందర్యమూర్తి. "గణేశ స్వయం విష్ణుః" అని ఋషిప్రోక్తము. ఈ ఏనుమోము వేల్పు సదా బాలమూర్తి అనీ, కళ్యాణమూర్తి అనీ, ప్రణవస్వరూపుడనీ, అభివర్ణించారు. "శతయోజనవిస్తీర్ణ స్సాగరో మకరాలయః, విక్రమ శ్లాఘనీయేన క్రమతా గోష్పదీకృతః" అని సీతాదేవిచేత కొనియాడబడిన ఆంజనేయ స్వామి, సాక్షాత్తు సచ్చిదానందస్వరూపుడైన దక్షిణామూర్తి మొదలయిన వేల్పులందరు సౌందర్యనిష్ణాతులు. చతుర్భుజములు, చంద్రకళావతంసము, మహేశ్వరుని సౌందర్యము ద్విగుణీకృతము చేశాయి. పాపతొడవులు, త్రినేత్రము - గజచర్మవసనము - డమరుకము - ఇవన్నీ దివ్యభావముల కు సంజ్ఞలు. ఇంత గొప్పసౌందర్యము ఏమహర్షుల తపస్సంపదలో - అనుభూతి పరంపరలలో జన్మించినదో కదా! ఇవన్నీ పరిశీలిస్తే భారతీయులకు సౌందర్యోపాసనలో ఎంత తాదాత్మ్యము - ఆవేశము - ఆనందానుభవము ఉన్నాయో ద్యోతకమవుతుంది. వారి తపస్సే సౌందర్యోపాసన అన్నా సత్యదూరము కాదు. పైనిచెప్పిన వేల్పుల సృష్టి ఒక అద్భుతసౌందర్యసంపద. ఇది భారతీయులది! ఈ సౌందర్యవిశేషములు ప్రకృతిలో లేవు. ఏనుగుతలకాయి - గుర్రపుతలకాయి - నాలుగుచేతులు, మూడుతిలలు, పక్షులకుమల్లే రెక్కలు - ఇదేమి సౌందర్యము, ఇదేం సృష్టి అని ఆంగ్లమానస పుత్రులయిన కొందరు భారతీయులు నేటికీ విస్తుపోతూనే ఉన్నారు. వీరు చిత్రకారుడంటే ఛాయాచిత్రగ్రహణయంత్రమనుకుంటారుగావును. వీరికి భారతీయ చిత్రకళా సంపద, కాలం మారి, చదువులు మారితే తెలుస్తుంది. ఏమో! మొన్న మొన్నటివరకు పాశ్చాత్యులకు మన వేల్పుల రూపసౌందర్యములు, శిల్ప, చిత్రకళలలో బోధపడలేదు. ఇంగ్లండు, అమెరికాదేశములలో ఈ అపరూప శిల్పచిత్రసంపదను పురాతనవస్తుప్రదర్శన భవనములలో చిత్రమయిన వస్తువులుగా దాచిఉంచారు. గొప్ప కళాసంపద అని ఆ దేశీయులు ఎరుగరు. ప్రసిద్ధ కళావిమర్శకులైన ఎరిక్ గిల్ - హావెల్ - ఆనందకుమారస్వామి మొదలయినవారలు అనేక సంవత్సరములు ఆ అనంతకళారహస్యాలను వినిమయము చేసుకున్నారు. తరువాత వారి రచనల ద్వారా లోకానికి తెలిసింది. ఇటీవల పాశ్చాత్యులలో గొప్పశిల్పులు - చిత్రకారులు మన శిల్ప చిత్రకళలను ఎంతో కొనియాడుతున్నారు. కాని మనదేశీయులలో అనేకులకు ఇంకా కనువిప్పు అవలేదు. ఎంత అనుభవించినా సౌందర్యపిపాస తీరదు. దానిని వేయి కళ్లతో వెతికి అనంతకోటి హస్తాలతో శిల్పించి - చిత్రించి కళాశిలి తనివోందడు. కళాచరిత్రలో ఎన్ని స్వర్ణయుగాలు గడచినా చిత్రకారులలో సౌందర్యతృష్ణ తీరదు. నిత్యనూతనముగా ఉంటుంది.

సాధారణముగా ప్రకృతి చిత్రములలో ఎక్కువగా ఉంటుంది ప్రకృతిశోభ. ముఖచిత్రములలో కూడ అరుదుగా ప్రకృతిని చిత్రించటము కద్దు. ఆంధ్రచిత్రకారులలో మాకంటె పెద్దవారు - మాకు గౌరవనీయులుఅయిన స్వర్గీయ దామెర్ల రామారావుగారు, శ్రీ వి. వి. భగీరథిగారు - ఇద్దరు. ప్రకృతిచిత్రణలో అద్వితీయులు - భగీరథిగారి బొమ్మలలో సంధ్యారాగము - ప్రదోషకాలము - చలి - మంచుతెరలు - గులకరాళ్లు చిత్రంలో అతి నేర్పుగా చిత్రించుతారు. రామారావుగారు - పాపికొండలు - వాటిపై తేలిపోయే బొల్లిమబ్బులు - గోదావరిలో కొండల ప్రతిబింబములు - కొండలోయలు - లోయల్లో గుబురుగా పెరిగిన గున్నమావిళ్లు ఆప్యాయంగా చిత్రించారు. ఇంకా భారతీయ చిత్రకారులలో వీరేశ్వరసేన్ వంటివారలు అచ్చంగా ప్రకృతి చిత్రకారులు.

ఇక పౌరాణిక - మత - సాంఘిక - జానపద చిత్రములలో ప్రకృతిశోభ ఉపాంగముగా ఉంటుంది. ఈ చిత్రములలో ప్రధానభావము మరుగుపడిపోకుండా తగుమాత్రముగా ఉంటుంది. ప్రకృతిలో అనంతవర్ణములు ఉంటాయి. పూలరవికలు, చిగురుచేరలు తొడిగి నవవసంతము ఏటేటా ప్రకృతిశోభకు క్రొత్త మెరుగులు దిద్దుతుంది. ఏఋతువునకు సదృశమయినవర్ణములు ఆఋతువు ప్రకృతి శోభలో ఉంటాయి. ఒకవిధంగా ప్రకృతి మహాసముద్రమువంటిది. కంటికినచ్చినదల్లా చిత్రములోకి రాదు. కళాశిలికళ్లలోంచి ప్రయాణముచేసిన సొగసులు హృదయసీమలోకి చేరుకుంటాయి. అక్కడ అనుభూతిపరంపరలతో కలిసి ఎంత దూరమో ప్రయాణముచేస్తాయి. ఈయాత్రలో చూచిన సొగసులు - తలచిన ఊహలు - అనేక మార్పులు పొందుతాయి. కొన్ని సమసిపోతాయి. కొన్ని క్రొత్త అందాలు మలచుకుంటాయి. క్రొత్తరూపులు తాల్చుతాయి. ఈ విధంగా కన్నవి - వికన్నవి - లోపలికివెళ్లి పైకి దివ్య శిల్పములుగా - చిత్రములుగా - వస్తాయి. బొమ్మలలో ప్రకృతిశోభ అతిగా తీసుకోవటము కాని - అసలు తీసుకోక పోవటముగాని చిత్రమునకు లోపమే అవుతుంది. నవ్య భారతచిత్రకళా రీతులలో రూపములో కంటె వర్ణికా గాంభీర్యములో ప్రకృతిశోభ ఎక్కువగా కానవస్తుంది. అజంతా - మొగలు - రాజపుత్ర - పరిష్యను చిత్రములలో ప్రకృతిశోభ ఉచ్చదశనందినది. చైనా - జపాను, దేశముల చిత్రకారులు ప్రకృతి ఉపాసకులు. ఈ దేశముల ప్రకృతి చిత్రముల ప్రభావము ప్రాక్ప్రతీచీ దేశాల చిత్రకారులలో అనేకులపై పనిచేసింది. ప్రకృతిశోభిరర్ణములలో ఎక్కువగా ఉంటుంది. భారతీయుల చిత్రములు చల్లని ఛాయలతో నిండి ఉంటాయి. నిశి - వెన్నెల ఉదయ సంధ్యలు - వన విహారములు - అన్నింటిలోను ప్రకృతి శోభ మనస్సును గిలిగింతలు పెడుతుంది. అది పట్టణములలోకన్న జనపదములందు - అరణ్యములు - పర్వతములు, నదీనదములు - విపిల గగనము మొదలగు వాటిలో ప్రకృతిశోభ అత్యంతరమణీయముగా ఉంటుంది. ఈ అనంత వర్ణములు అనుభవములు చిత్రంలో సుస్థిరంగా నిలిచిపోతాయి.

కీర్తికాముడు

(11-వ పేజీ తరువాయి)

ఈసాడు యీ ముతక పంచలు కట్టుకొని "యెవ్వ్చా రీ ముతకచాపు బాబూ?" అని అంటే తమ పేరు చెప్పి తమ దాతృత్వానికి లేని మచ్చ తేవడం నాచేత కాదు..."

ధోరణి యిలా వెళ్లేసరికి నాయుడుగారి నోట్లో పచ్చి వెలక్కాయ పడింది. వచ్చినట్టూ షాలీడు దగ్గరకి పంపి మరొక క్రొత్త పంచల చాపు యిచ్చుకున్నాడు.

ఈ విధంగా ఆ పండితుడే కాదు— తదితర వాద్యకపు జట్టూ, ఆడపడుచులూ అక్కమ్మలూ, అత్తమలూ, పాలేర్లూ, చాకళ్లూ మంగళ్లూ— ఎవరికి తగ్గిస్తే వారికే కోపం వచ్చేది. హఠం వేసుక్కూర్చుని తమకు రావలసింది వచ్చిందాకా సత్యాగ్రహం చేసి వెండుకు పోయేవారు. తమ ఆర్థిక పరిస్థితుల్లో వచ్చిన మార్పు వాళ్లకు చెప్పకొని ఇప్పటి కిలా పుచ్చుకోండని చెప్పడం నాయుడిగారికి చాత నయ్యేది కాదు.

చెప్పవచ్చేది—చివరి కేవిధం వానూ అతని ఖర్చు తగ్గించటానికి సాధ్య మవలేదు. యేటా మిగిలే కాస్త ఆదాయం వడ్డీక్రింద జమ కడుతూ; ఏం చెయ్యడానికీ తోచక పోవడం వల్లనో, లేక 'నలభై యెకరాల చెక్కా, నూరు తులాల తొక్కా' ఉన్నాయనే ధైర్యంవల్లనో అప్పు మాత్రం అలానే వుంచేశాడు. కాని మూడేళ్లలో పెద్ద కూతురు పెళ్లికోసరం మరొకసారి తీసుకున్న వెయ్యి రూపాయిలూ, వరుసగా రెండేళ్లు పంట నష్టం ఫలితంగా అసలుతో కలసిన వడ్డీ—తడిసి మోపెడై మొత్తం దగ్గర దగ్గర నాలుగు వేలనే సరికి క్రమంగా అతన్ని భయం ఆవహించ సాగింది. అయినా ఆ కీర్తికాముకుడు యెలానో ధైర్యం చిక్కబట్టి తాత తండ్రులు గడించి వదిలిని ఆస్తిని అఖండంగా రక్షించుకుంటూ మరొక మూడేళ్లు గడప గలిగాడు. అయితే పద్దు మొత్తం ఏడేళ్లలో రెండుసార్లు త్రిప్పి వ్రాయబడింది. పైగా రెండవ కూతురు పెళ్లికి మరొక ఎనిమిది వందలు అప్పుకూడా అయింది.

ఏమైతే యేం-చివరకు ఎనిమిదవ యేటి ప్రారంభంలో మాత్రం నాయుడుగారు కీర్తి కాంత యెడబాయక తప్పిందికాదు.

నాయుడికి అప్పు పెడుతూ వచ్చిన షాహుకారు క్రమంగా అభివృద్ధి చెంది, మాములు సంపాదించ గలిగే తాహతు కలిగాక, ఒక శుభ ముహూర్తాన ధర్మారావు పట్నాయక్కు యింటికి ఒక బుట్టెడు మామిడి పళ్లూ ఒక డజను కొబ్బరి కాయలూ పట్టించుకొనివెళ్లాడు. మంత్రాంగం సుముఖంగా జరిగిపోయింది

మూడవనాడు ధర్మారావు పట్నాయక్కు నాయుడిగారితో రహస్య సంప్రదింపులు జరిగించడం, వారం రోజులనాడు పోస్టుమేన్ నాయుడి గారికి రిజస్టరునోటీసు బట్వాడా చెయ్యడం కూడా జరిగాయి.

చివరకు వ్యవహారం వీథినపడింది. పెద్దలంతా కలుగజేసుకొన్నారు. నాయుడు మెడలు విరిచి భూమి అమ్మకంకు ఒప్పించారు. కాని కొనేదా లేడీ?

ధర్మారావు పట్నాయక్కు తదితర పెద్దలూ చాలా బలవంతం పెట్టడంచేతా, కాదు, కూడదని బెదిరించడం చేతా షాహుకారు చివరకు తనే భూములు కొనడానికి అంగీకరించాడు. అయితే ధర నిర్ణయంలో మాత్రం యింతమందీ అతని పట్టుదలకు అంగీకరించక తప్పింది కాదు.

చివరకు వ్యవహారం ఫైసల యేసరికి పాతికెకరాల పల్లంలో పదిహే నెకరాలూ, పదిహే నెకరాల మెట్టలో పది యెకరాలూ మిగిలింది.

యేమైనా యీ చిలుంతో యీ చీడ వదులుతుందని సంతోషించాడు. కాని నలభై యెకరాల ఆదాయంకు అలవాటు పడ్డ ఖర్చు యిరవై అయిదు యకరాల ఆదాయంలో సర్దుకోవటం నేర్చుకోవడానికి చాలా సంవత్సరాలు తీసుకుంటుందని నాయుడికి తెలియదు. ఆది తెలిసే సరికి అయితే నేం, తక్కిన యిద్దరు కూతుళ్ల పెళ్లిళ్లు చెయ్యటంవల్ల నైతే నేం మరొక అయిదు యెకరాల పల్లం. అంతే మెట్టా హరించుక పోయాయి. పైగా యే నోళ్లచేపొగడ బడుతుండే వాడో ఆ నోళ్లచేతే తెగడబడుతున్నాడు.

తన ఆర్థికపరిస్థితిని గుర్తించడానికి నాయుడు యెంత నిరాకరిస్తూ వచ్చినా చివరకు తప్పింది కాదు. కీర్తి రక్షణా, సముపార్జనా వెనకటిలా కాకపోతే అదే పోయెను, కనీసం ఏమాత్రం కూడా సాధ్యం కావటంలేదు.

అయితే అంతమాత్రాన నాయుడుగారు చేతులు ముడుచుక కూర్చున్నారని చెప్పడం కాదు. అతను చేయవలసిన ప్రయత్నం చేస్తూనే ఉండేవారు. ఆ స్వల్పాదాయంలోనే ఏటా సుమారు వందరూపాయలకు తక్కువకాకుండా భగవత్కైంకర్యంకోసరం వినియోగిస్తుండేవారు. యే అజ్ఞాతకారణానికో అలిగిపోయిన గృహలక్ష్మి మళ్లా ఒకనాడు తప్పకుండా పశ్చాత్తాపపడుతుందని నాయుడిగారి నమ్మకం.

ఇప్పుడు నాయుడిగారింట్ల, వెనుకటంతగా జీవహింస లేదు. అయినా వచ్చిపోయే చుట్టాలను సత్కరించే సందర్భంలోమాత్రం తప్పదు. వెనుకటిలా శేరు బియ్యం పావలాడబ్బులూ స్వయంపాకాలు లేవు అయినా శ్రీ కూర్మం యాత్ర సందర్భంలో మాత్రం ఆ వారంరోజులూ ఏడెనిమిది పుట్ల ధాన్యం ఖెలవు తుంటాయి. ఇలాటివి ఇంకా చాలా ఉన్నాయి

అయితే యివి కీర్తిపోషణకే మాత్రం చాలవు. పై ఊర్లలో రచ్చరాతి సమా దేశాల్లోనాయుడు విషయం వస్తే అనేవాగు.

"యింకేం యెంకయ్య నాయుడు లేరా! ఇప్పుడంతాఅయిపోయింది. సూరయ్య నాయుడు (తండ్రి) హయాంలో నైతే నేం ఇతడు తలెత్తే సరికి తేం యెలా ఉండేది! అడగనోడిదే పాపం! 'అమ్మ తిండికి నూకల్లేవు!' - పట్టుక పోయి మానెడు; 'బాబూ ఒంటికి బట్ట లేదు,—తీసుకపోయి గుడ్డలు; 'నాయుడుగారూ, ఇల్లు కట్టుకుంటాను'-'కొట్టుకపో ఆ రెట్టు'-అలాఉండేది' ఇప్పుడా యీవీ లేదు, ఆ సిరీలేదు ఇతడికి డబ్బు మీద కాపేనం పుట్టిందీ, నోటతో లే దన కుండా చేత్తో లే దనడం ఆరంభించాడు. పట్టుకుంది. పెద్దమ్మవారు. అదెలగాయితూ వరసపెట్టి కొట్టింది . రావినాయుడు తగువు, ముసిలమ్మసావు-కూతుళ్ల పెళ్ళిళ్ళు. ఇప్పుడంతా ఆర్పుక కూకున్నాడు ఏదోవుంది - పదో పదేనో యెకరాలు. అది యీ పంటకరువు రోజుల్లో తిండికే చాల్దు మరే బొద్ది ఒకరికి పెడితేనే లక్షీవినిలుస్తుది. లేకపోతే నే కేం అచ్చుండేటి?

ప్రజలీ విధంగా అనుకునే టప్పుడు వెంకయ్య నాయుడి కథపూర్తిగా తెలిసి ఉన్న వాళ్ళకు మాత్రం "అయ్యో నిర్భాగ్యజాతకుడా!" అని జాలివేస్తుంది. కాని నిజానికి వెంకయ్యనాయుణ్ణి కనికరించ నక్కరలేదు అసలు వెంకయ్య నాయుడే అంటాడు—

"... ... మీరు కనికరించి జాలిపడి నన్నుద్ధరించ గలరా? ఆ పరాత్పరుడు దయచూడాల - ఉద్ధరించాల. ఇంతకీ నా కిప్పుడే టయ్యింది. తిండానికి తిండి- కట్టడానికి గుడ్డా ఉండాని కిల్లూ లేకపోలేదు గదరా! అయి కూడా లేక అడుకులు బట్టిన మహానుభావు లెంతమంది లేరు! ఆళ్లకన్న మనం ఊడబొడిచినాంరా! అసలియన్నీ మన్తో వస్తాయిరా! మన్తోవొచ్చేది మాట—ఫలానానాడు ఫలానలాటోడు - అనే మాట. పౌరుషం యీయీ (యీవీ) లేని బ్రతుకు ఎంతుంటే ఎంత తింటేం?"

ఏదియేమైనా నాయుడు కీర్తికాముడు. కీర్తికాములు అమరజీవులు. అమరజీవులకు మానవ జీవితావసరాలైన ఆహారం బట్టా ఆస్తియిటువంటి వాటి యందు గురిగాని లక్ష్యంగాని ఉండదు. కాని కళ్ళు తెరిచి చూచేవారికి ఒక్క విషయం మాత్రం బాధిస్తూ ఉంటుంది. ఈ కీర్తికాముడు తమ బిడ్డలను వారి పితామహప్రపితామహుల కష్టార్జితమైన సంపదలనుండి వంచిస్తునందుకు ఆ దేవుడు వీరి కాముకత్వాన్ని ఏవిధంగా విచారిస్తాడా అని.

హరవిలాసము:

(18-పేజి తరువాయి)

పురుషుడు దొరకనంతమాత్రాన తపస్సు చేయునా? పురుషమాత్రునికొఱకు శ్రమించుదానికి జెప్పిన ట్లిది తొందరపాటు గాని సమంజసము కాదు. "మమాపి పూర్వాశ్రమసంచితం తపః" అనుదానినుండి 'ఏనును బ్రహ్మచారి'యని విపులీకరించి నన్నయ ననుకరించబోయి (కొంతిలంపు) యిట్లనుట కాళిదాసురచనలోని యందము పాడుచేయుటయేగాని సాధించినది కానరాదు. ఉద్భటు డిక్కడ తన గ్రంథమున విష్ణుమూర్తిని వరింపు మని సలహా నిచ్చెను. అది యింకను మేలు.

శ్రీనాథుడు : అనువాదము

"కంపేన మూర్ధ్నః శతపత్రయోనిం'
వాచా హరిం, వృత్రహణం స్మితేన."
(కుమారసంభవము)

"గారవించెను విధి శిరః కంపమునను
నాదరించె ప్రియోక్తుల నబ్జనాభు
మించు మందస్మితమున మన్నించె శక్రు
హరుడు గరుణించె సురల గటాక్షదృష్టి."
(భీమఖండము)

ఇదియు సందర్భానుసారముగ నన్యానువాదము. హరవిలాసములలోని యనువాదము చిత్రమైనది. ఒక గ్రంథము నున్నదున్నట్లనువదించినదిగాదు హరవిలాసము. కాని యొక భాగము యథామూలముగ నైనది. మరల కల్పన. తాను స్వతంత్రముగ బోవుచు సందర్భము ననుసరించి యందమైన మాటలు సంస్కృతమునుండి తెచ్చి పొదుగుచు నందగించుట యీతని కవితకు లక్షణము. అట్టిరీతినే పెండ్లిసమయమున పరమేశ్వరు సౌనర్చు ఆదరమును వర్ణించు పై శ్లోకమును భీమఖండములో దక్షారామమునకు జేరిన శంకరుడు సోపిన యాదరముగ సమన్వయించి అనువదించెను.

ఇట్లే దేవదారువనమునకు గౌరికి జెప్పక శివుడు పోయె నని హరవిలాసమున వివాహానంతర వృత్తాంతమును జెప్పుచు కుమారసంభవప్రథమ సర్గగతహిమవద్వర్ణన ననువదించెను అది యిది.

"మహిమండలమునకు మానదండము మేను
పూర్వాపరాబ్ధులు పొరుగుటిండ్లు."

ఇక్కడ పొరుగుటిండ్లు స్వతంత్రము. తెలుగుతనము తోడిదైన యీ మాట మిగిలిన పాదమున కంతకు స్వాతంత్ర్యము నర్పించి భాసించుచున్నది.

దుర్వాసు డింద్రుని శపించి యదృశ్యుడైన మీదట—

"యతిపతి శాపాతురములు
శతముఖున కసహ్యహృదయశల్యము లయ్యెన్
మతిదలప పూజ్యపూజా
వ్యతిక్రమము సర్వకార్యహరముగు గాదే?"

ఇదియే సందర్భశుద్ధి! ఎట్లనిన - అసలు కాళిదాసే ఒక భావమును సందర్భానుసారముగ ఉక్తివైచిత్రి జూపి మరలమరల బ్రకటించును. అది తెలిసిన యీ తడాతని కనుకర్తగదా! వసిష్ఠుడు దిలీపునకుకి సంతానము కలుగకుండుటకు గారణము దెల్పుచు కామధేనువును పూజింపవైతివని యిట్లనెను: "ప్రతిబధ్నాతి హి శ్రేయః పూజ్యపూజావ్యతిక్రమః" అని. ఇదియే దుష్యంతుడు మాతలితో తిరిగి వచ్చునపుడు కాశ్యపాశ్రమమునకు పోవలె ననుచు తేన"హ్యనతిక్రమణీయాని శ్రేయాంసి; తత్ప్రదక్షిణీకృత్య భగవన్తం గన్తుమిచ్ఛామి" అన్నాడు. దానికి సందర్భశుద్ధి మన శ్రీనాథుని కిక్కడ కలిగి అర్థాంతరన్యాసకర్తమైన చోట నతికినది. ఇట్లీతని యనువాద ధోరణి బహుముఖమై యందగించబడియున్నది.

శ్రీ తాతా సుబ్బారాయ శాస్త్రిలుగారు

(8-వ పేజీ తరువాయి)

పండితుడు ఆంధ్రసాహిత్య పరిషత్తు సభకు అధ్యక్షు డగుట మీకు వింతగా ఉన్నది కాబోలును! ఈవైపు నన్ను తెలుగుపండితునిగా మనవారంగీకరించరు; కాని మద్రాసునుండి తిరునల్వేలి వఱకును గల ఆంధ్రులందఱును నన్ను తెలుగు పండితునిగానే గ్రహింతురు. పరిషత్తు మద్రాసులో నున్నపుడు- సాధారణముగా మహాసభలు దక్షిణముననే జరుగుచుండినవి. చాల సభలకు నేను హాజరగుటయు, పరిషత్తువారి కార్యకలాపమునుగూర్చి ఉపన్యాసము లిచ్చుటయు జరుగుచుండినది' అని తెలిపిరి. శ్రీ శాస్త్రులవారి అధ్యక్షోపన్యాసము ఆంధ్రభాషా వాఙ్మయముల లోటుపాటులను వెల్లడించి, పరిశోధకులకు ఒక ఉత్తేజమును గలిగించినది. శ్రీ శాస్త్రులవారి యుపన్యాసము చిత్తుప్రతికి నేనును, శ్రీ జమ్ముల మడక మాధవరామశర్మగారును సాఫు ప్రతిని తయారు చేయవలసి వచ్చినది. అప్పు డాయన

'మీరు వ్రాతలో అర్ధబిందువులను గాని, శకటరేఫములనుగాని ఉపయోగించవద్దు; నేను శిష్టవ్యావహారికభాషావాది నను సంగతిని మరువవద్దు' అని హెచ్చరించిరి. కాని ఉపన్యాసపు అచ్చు ప్రతి చేతిలోనికి రాగానే, మా శ్రమ వృథా యైనదని యనుకొంటిని. అఱసున్నలు ఒండిజాలు ఉండవలసిన చోట్ల నియతముగా పాటింపబడినవి. దానికి నే నాశ్చర్యపడి పరిషత్కార్యదర్శులు శ్రీ కిలాంబి రాఘవాచార్యులుగారిని 'అయ్యా! మీకు పంపిన ఉప

కులాసాకబుర్లు :

'అపాయపు ఉపాయం'

శ్రీ జి. యస్. సూరి

ఆహారపు కొరత తీర్చటానికి అష్టకష్టాలు పడుతున్నారు మన కేంద్ర ప్రభుత్వంవారు. ఎన్ని తంటాలు పడినా నూటికి పదో వంతు లోటు తగులుతూనే ఉన్నది. అదనపు ధాన్యాలను పండించే దేశాలకు యాయవారం బయలుదేరి, రెట్టింపు విలువకు ధనాసరి సరుకును కొనుగోలు చేసి, ఓడలమీద దిగుమతి చేయించి, ముక్కిపోయేదాకా గిడ్డంగులలో ఉంచి, నోరు ఒక్కంటికి ఇన్ని ఔన్సుల చొప్పున పందేరం చేస్తున్నారు. ఇందువల్ల బొక్కసంలోని ఖజానా అడుగు తగలటం చూచి 1951 వ సంవత్సరం దరిమిలా ఆహారపు దిగుమతులు ఆపివేస్తున్నామని చాటించారు.

ఈ లోటును పూర్తిచేయటానికి ఎవరికి తోచిన సలహాలను వాళ్లు అడగకుండానే అందచేశారు. మహానదులకు డాములు నిర్మించమన్నారు. కాలువలు తవ్వించమన్నారు. చెరువులకు పూడిక తీయించమన్నారు. మోట బావులను కట్టించమన్నారు. వానలు కురిపించమన్నారు. ఎరువులను తయారు చేయమన్నారు. ఆహారానికి పనికిరాని పైర్లను తగ్గించమన్నారు. చిలకడి దుంపలను వండుకు తినమన్నారు. కజ్జి పెండలం పిండిచేసి అట్లు పోసుకోమన్నారు. తొక్కలు పారవేయకుండా అరటిపండ్లను ఆరగించమన్నారు. సంతానాన్ని నిరోధించమన్నారు.

స్వాతంత్ర్యం వచ్చినామనవాళ్లకు పాశ్చాత్య వ్యామోహం ఇంకా వదలలేదు. పైన ఉదాహరించిన వాటికంటె మంచి ఉపాయమేదైనా చెపుతాడేమోనని ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థకు మాజీ డైరెక్టర్ జనరలుగా ఉన్న సర్ జాన్ బాయడ్ ఆర్ దొరవారిని ఇంగ్లాండు దేశంనుంచి ఆహ్వానించారు. జీతభత్యాలను జాగ్రత్తగా ఏర్పాటు చేసుకుని ఆ అనుభవజ్ఞుడు ఏడువేల మైళ్లు ప్రయాణం చేసి మన దేశంలో వాలాడు. సంగతి సందర్భాలను తెల్లవారికి సహజమైన సూక్ష్మదృష్టితో పరిశీలించాడు. అప్పటికి అడంగులు చేసిన సలహాలను పరీక్షించి భేష్ అని ఆమోదించాడు. అంతకంటె తాను చెప్పగలిగింది ఏదీ లేదన్నాడు. కాని ఇంత దూరంనుంచి అంత వ్యయప్రయాసలమీద రప్పించినందుకు ప్రత్యేకమైన సలహా ఒకటి ఇస్తేనేగాని బాగుండదని ఒక అమూల్యమైన ఉపాయం చెప్పాడు. ఉపవాసమే ఆ ఉపాయం. భారత దేశంలోని యావన్మందీ వారానికి ఒక రోజున తప్పనిసరిగా ఉపవాసం చేస్తే ఈ కొద్దిపాటిలోటు ఇట్టే మాయమై పోతుంది అన్నాడు. లోటు పూడడమేగాక మిగులుగూడా ఉంటుందన్నాడు.

అంతవాడు ఇచ్చిన సలహాను మన ప్రభుత్వ నిర్వాహకులు ఊరికె త్రోసివేయటం ఎన్నటికీ జరగదు. ఈపాటికి అప్పుడే "నిర్బంధ ఉపవాస చట్టాన్ని" మగ్గానికి ఎక్కించి ఉంటారు. భారతయూనియనులోని ప్రతివ్యక్తీ వారానికి ఒకరోజున నిరశనవ్రతం ఆచరించవలసిన దనిన్నీ, ప్రాంతీయపరిస్థితులనుబట్టి ఏ రాష్ట్రంలోనివారు ఏవారంనాడు పస్తు పడుకోవాలో ప్రభుత్వం నిర్ణయిస్తుం దనిన్నీ, సదరువారంనాడు ఏవిధమైన ఆహారాలనూ భుజించకపోవడమేగాక మూర్కొనడం కూడా పనికిరాదనీ, ఆ నియమిత వారంనాడు ఏదైనా పండగవచ్చినట్లయితే ఆ నియమితవారంనాడు ఏదైనా పండగ వచ్చినట్లయితే ఆ మరుసటిదినం ఉపవాసదినంగా పరిగణించాలనీ, అందుకు భిన్నంగా ప్రవర్తించినట్లయితే జుల్మానా వల్లగాని, ఖైదువల్లగాని లేక రెండింటి వల్లనూగాని శిక్షింపబడుతారనీ కొత్త బిల్లు పార్లమెంటులో ప్రవేశ పెట్టవచ్చు. ఈ చట్టం పదునాలుగేళ్లు వెళ్లని పాపలకూ, పచ్చి బాలింతలకూ, రోగిష్టిమారి వాళ్లకూ వర్తించ దని బహుశా నిర్ణయించవచ్చు. ఆహారం అంటే ఏమిటో ఒక సెక్షను నిర్వచనం చేయవచ్చు. చట్టానికి తోకగా తగిలించే షెడ్యూలులో ఏవి ఆహారాలు కావో, ఏవి ఆహారపదార్థాలో జాబితా ఒకటి ఉండి తీరుతుంది. సిగరెట్లు వగైరా పీల్చుబండారాలు ఆహారాలు కావని ప్రొఫెసర్ కె. టి. షాగారు ఒక సవరణ ప్రతిపాదిస్తారు. కాఫీనిగూడ జాబితాలోనుంచి తొలగించి తీరాలని దాక్షిణాత్యులు ప్రతిపాదిస్తారు. మొదటి సవరణకు నెహ్రూ పండితుడి మద్దత్ వల్లా, రెండవ సవరణకు గోపాలస్వామి అయ్యంగారి ఖుమ్మక్కి వల్ల పార్లమెంటు ఆమోదించి తీరుతుంది.

ఈ ఉపవాసశాసనం అమలులోకి రాగానే డాక్టర్ల పంట పండితీరుతుంది. ప్రతివాడూ తాను దీర్ఘరోగినని సర్టిఫికేట్ సంపాదించటానికి కిందా మీదా పడుతాడు. ప్రస్తుతం సంతానంమీద మోజులేని అనేకమంది స్త్రీలు బాలింతలు కావటానికి మందులు సేవించి ఆంజనేయస్వామికి ప్రదక్షిణలు చేస్తారు. మైనారిటీ నిల్లినా పద్నాలుగు ఏళ్లు నిండ లేదని తప్పుడు జనాభా లెక్కను కుజ్జకారు తయారుచేస్తారు.

ఇప్పుడు దొంగసారాయిని పట్టుకోటానికి ఇల్లిల్లూ తిరిగి, తూలుతూ నడిచే ప్రతివాడిమూతిని వాసన చూస్తున్న ప్రొహిబిషన్ ఉద్యోగులను ఈ వ్యవహారంలో గూడ ఉపయోగించటం జరుగుతుంది. తిరగ మాతె చప్పుడు ఎక్కడ వినబడుతుందా అని ప్రతి కిటికీ దగ్గరా వీళ్లు నక్కి ఉంటారు. ఉల్లిపాయ లఘుమఘుమ ఎక్కడ కొడుతున్నదా అని ప్రతిగోడ ప్రక్కనా ముక్కులు ఉబ్బించి నిక్కి పొంచు ఉంటారు. ఎవడైనా త్రేవుమని తేపితే దొరికిందిరా పిట్ట అని రాజాకు నడవమంటారు. ఏ కొబ్బరిచెట్టు దగ్గరనో, ఏ అరటితోటదగ్గరనో, ఏ మామిడి తోపుదగ్గరనో ఆనాడు ఎవడైనా తారట్లాడితే పదిరోజుల కఠినశిక్షకో, పదిరూపాయల జుల్మానాకో గురి కావలసినదే.

న్యాయస్థానాలకు చేతినిండాపని ఉంటుంది. లాయర్లకు తీరికే ఉండదు. "ఏమయ్యా సాక్ష్యం అంతా ఇన్నావే, ఏమి చెప్పుకుంటావు?" అని మేజస్ట్రేటుగారు ముద్దాయిని అడుగుతారు. "నేను నేరం చెయ్యలేదండి. క్రిందటి రోజున వండుకున్న తాలూకు బొబ్బట్లను పారవెయ్య ఎంటముదు కని తిన్నానండి" అంటాడు ముద్దాయి. "అయితే పోలీసులు పట్టుకున్న ఈ పెరుగన్నం సంగ తేమిటి?" "అదాండీ? అది పిల్లికోసం ఉంచామండి." ఆ తరువాత ప్లీడరుగారు ప్రారంభిస్తాడు. ఫలానా శెక్షన్ ప్రకారం క్రిందటి దినం వండిన పదార్థం మర్నాటికి ఆహారం కాదని వాదిస్తాడు. పీటమిన్లు పోయి విషతుల్యమేనని శాస్త్రజ్ఞుడి చేత సాక్ష్యం ఇప్పిస్తాడు. కోర్టుకు పట్టుకొచ్చిన బొబ్బట్ల ముక్కలను, దధ్యోజనాన్ని కోర్టువారు స్వయంగా తిని చూస్తారు. వీటిని ఆహారం అనవచ్చునో అనగూడదో సందేహంగా ఉన్నది కాబట్టి ఈ కేసును హైకోర్టుకు రిఫర్ చేశాను పొమ్మంటాడు. ఆ పైన ముద్దాయి ఖర్మం.

మా యింటి ప్రక్కన ఒక శ్రోత్రియ వ్యాపారి పంతులు ఉండేవాడు. ప్రతి ఏకాదశి నాడూ యథావిధిగా ఉపవాసం చేసేవాడు. మంచి నీటిని కూడా ముట్టేవాడు కాడు. రాత్రి అంతా నిద్రపట్టక తెల్లవారకమునుపే చెట్టుమీద కాకులపైన రాళ్లు రువ్వి కావు కావు మనిపించేవాడు. వెంటనే ముసలమ్మలు మడి గట్టుకునే వాళ్లు. సూర్యోదయం అయేసరికి సుష్టుగా భోజనం అయేది. ఏకాదశినాటి బకాయి ద్వాదశినాడు పూర్తి అయేది. జమాఖర్చులు సరిపోయేవి. ఉపవాసాలు సాధారణంగా ఇట్లాగే తయారవుతవి.

ఈ మాత్రపు ఉపాయం చెప్పటానికి సప్త సముద్రాలూ దాటి తెల్లదొరగారు రానక్కర లేదు. దమ్మిడీ ఖర్చు కాకుండా మా లనున్న ముసలమ్మ చెప్పివేసేది.

న్యాసపు ప్రతి యిక్లేఉన్నదా?' అని ప్రశ్నింపగా, వారు 'ప్రతి ఎవరిచేతిలో పడినదో జ్ఞప్తి యున్నదా?' అని నవ్వుచు పలికిరి.

అన్ని శాస్త్రములలోను గొప్ప పాండిత్యము కల్గి, అఖండప్రతిభగల శ్రీ శాస్త్రులుగారు పాఠప్రవచనముననే ఎక్కువకాలము గడపుట కిష్టపడెడివారు. గ్రంథరచనయెడ వారి కెక్కువ ఉత్సాహము లేకపోయినది. అయినను తమ అభిమాన శాస్త్రమగు వ్యాకరణమునందు 'శేఖర గురుప్రసాదము, చిత్రప్రభాలఘుటీక' అను రెండు గ్రంథములనుమాత్రము సంస్కృతమున వ్రాసిరి. వానిని ఆంధ్రవిశ్వకళాపరిషత్తువారు ప్రకటించిరి. అయినను, అంతటితో తృప్తిపడక శ్రీ శాస్త్రులుగారు తెలుగులో 'ద్వైతాద్వైతములు' అను వేదాంతగ్రంథమును, 'ధర్మప్రబోధము' అను ధర్మశాస్త్రగ్రంథమును వ్రాసి ఆంధ్రలోకమునకు మహోపకార మొనర్చిరి. ఈ రెండు గ్రంథములును శిష్ట వ్యావహారిక భాషలోనే రచింపబడినవను సంగతిని మనము మరువరాదు.

నాకబలి

(5-వ పేజీ తరువాయి)

ఫుల్ —మోస్టు ఎగ్జోటిక్ ! అబ్బ వర్ణించ లేము రేపు మళ్ళీ వచ్చిచూడాలి. బాగుంగికదూ !"

బాగుం దని తల ఊపాడు.

హాలు బైటకి వచ్చారు.

"నగ్వా ! ఏక్‌సవారి ఖాళీ" అంటూ ఒక ఎక్కావాడు అరుస్తున్నాడు.

"మాలాడ్జికది దగ్గిర—నేను వెళ్ళివస్తా"అంటూ వెంకట్రావ్ ఎక్కా ఎక్కి వెళ్లిపోయాడు.

మరొక ఎక్కా హనుమాన్ ఘాట్ దగ్గర పేట దాకానే వెళ్తుంది. ఒక కాళీ ఉందని ఎక్కా వాడు అరుస్తున్నాడు. చాలా దూరాన్న తప్ప కాళీ ఎక్కాలు కనబడటం లేదు. ఎక్కా ఎక్కాడు.

"అక్కడినుంచి వేరే ఎక్కా చేసుకు వెళ్ళవచ్చును" అనుకొన్నాడు. అంతేకాని అవ్యక్తంగాఉన్న కోరికకు వ్యక్తంగా మనస్సులోనైనా రూపం ఇచ్చుకోటానికి నిరాకరించుకొన్నాడు.

ఎక్కా దిగగానే రెండో ఎక్కాకోసం చూసే దృష్టి కలుగలేదు.

హైరోడ్డువెంటనే కొంతదూరం నడిచాడు. తనకు తెలియకుండానే కాళ్ళు సందు మలుపు తిరిగాయి.

అసంభవమైన అనుకూలపరిస్థితులన్నీ తప్పక సంభవ మౌతాయన్న నమ్మకాన్ని వాంఛలు అవ్యక్తంగా వంటబెట్టుకొని తమ గమనానికి ప్రాద్బలం ఇస్తూంటాయి.

ఇంటి క్రిందతలుపు జేర్లవేసే ఉంది. క్రింద ఏమీ సవ్వడలేదు.

ఇంటిముందు అటూ ఇటూ రెండుమూడు మాట్లు తారాడాడు. పైన ఒక కిటికీ రెక్కలో నుంచి కొద్ది వెలుగు వస్తూంది.

గుమ్మంమె ట్లెక్కి తలుపుదగ్గిర నిలబడ్డాడు.

మేడమెట్ల గదిలోనుంచే ఆమెకంఠం వినబడుతూంది.

"నాకింకేమీ అక్కరలేదు—చెంబులో కాసిని నీళ్ళు పోసి, మీ రింక భోజనం చెయ్య వచ్చు."

తన భర్తతో మాట్లాడుతూంది.

తనతో మాట్లాడుతున్నప్పటి మార్దవం లేదు కంఠంలో.

చెంబులో నీళ్ళు పోసి, తలుపు వేసికొంటు భర్త లోపలికి పోయిన చప్పుడు అయింది.

ధైర్యంచేసి లోపలికి అడు గేసి మెట్లెక్కి మధ్యగా నిల్చుని ఆమెకు కనబడ్డాడు.

ఆమె ఆశ్చర్యభయాలతో క్షణమాత్రం స్తబ్దగా నోరు తెరుచుకొని కూలబడింది. ఇంతలో నోటిమీద వేలు వేసి జాగ్రత్త తెలుపుతూ, గదిలోకి పోయే తలుపు దగ్గిరకు చేరవేసి, క్రింది పదమని సంజ్ఞ చేస్తూ, మెల్లిగా మెట్లు సగం దిగివచ్చింది.

సంతోషంలోనే చిరుకోపం ప్రకటిస్తూంది. "ఆవేళనుంచీ రాలేదేం?" గారాబం కురిపిస్తూంది.

వింటున్న మాటలవల్ల, పరిస్థితి తెలిసినా, ఒక అడుగు దగ్గిరకు వేశాడు.

"దూరం, దూరం" అని మెల్లిగా అంటూ చిరునవ్వుతో వెనక్కు తగ్గింది.

జారత్వానికి నిష ఏమి టని చిరాకు వేసింది. దగ్గిరకు పోబోయాడు. ఆమె వారించింది. దీనంగానూ జాలిగానూ చూసి, "ఎల్లుండి రాత్రి ఈవేళకి రా! ఆయన క్యాంపుకు వెళ్తారు."

"ఆయన" ప్రసక్తి వచ్చినప్పుడెల్లా మనస్సులో గొంగళిపురుగు ప్రాకుతూంది...

పైమెట్లమీద ఆమె, క్రిందమెట్టమీద తనూ ఒకళ్ళనొకళ్ళు చూపులతో ఆస్వాదించుకొంటూ అల్లాగే నిల్చున్నారు.

మళ్ళీ లోపలినుంచి పురుషకంఠం.

"ఇంకేమైనా కావాలా? కూర సరిగ్గా కుదిరిందా?"

"ఏమీ అక్కర్లే—కూర బాగానే ఉంది." అని అటు కేక వేసి—జాలిగా రహస్యకంఠంతో "ఎల్లుడి తప్పకుండా రా" అని ఆత్రంతో సాగనంపుతూంది.

వీధి చివరికి పడి ఒక్కడే విడిగా ఎక్కా ఎక్కాడు.

"అసి" ప్రవేశించబోయేముందు ఒక లాంతరు స్తంభందగ్గిర విలాసంగా స్తంభాన్నానుకొని ఒకముసుగు కనబడింది.

ఎక్కా దగ్గిరకు రాగానే, ముసుగు సన్నగా తొలగిస్తూ చిరునవ్వుతో ఆహ్వానిస్తున్న ఒక స్త్రీ మందహాసం, ఒక కటాక్షవీక్షణం.

దేహం నెత్తురెత్తిస్తోంది. ఎక్కా కదిలిపోతోంది. ఎండిపోయిన అసినది గర్భంలో ఇసుక తెరలు దాటుతోంది.

"ఠైరో !" అని బండి ఆపించాడు.

"క్యాబాజ్జీ ! యూనివర్సిటీకి పోరా !"

"అక్కర్లేదు ఇక్కడే లాడ్జికి వెళ్తాన్" అని చెప్పుకొన్నాడు. డబ్బు పూర్తిగా ఇయ్యటంతో బండిమనిషి మాట్లాడలేదు. "అచ్ఛా ! సలాం బాబు" అని బండి మళ్ళించుకొని వెనక్కు వెళ్తున్నాడు బండివాడు. బండి పదిగజాలు సాగేదాకే ఆగాడు.

వెనుకకు అసిలోనుంచి నడిచాడు. ఆ చీకటి కూడా తెలియటంలేదు.


లాంతరు స్తంభానికి ఇరవైగజాల దూరం దాకా వచ్చి ఆగాడు. ఆ ఎక్కాలోనే, ఇందాకటి ఆ స్త్రీ, ఒక పురుషుడూ ఎక్కుతున్నారు ఛల్ మని బండి ముందుకు సాగిపోతోంది.

నోరంతా వెలిబూడిద మింగిన ట్లయింది. అంత రాత్మ ఏదో, కొరడా ఛెళ్ళుమనిపించి వికటంగా నవ్వుతూ ఈసడించిన ట్లయింది.

వీధులు తిరిగే నీచకామినికోసంకూడా ఒడబడ తలచిన నీరసత్వానికి కుమిలిపోయాడు.

కాళ్లీడ్చుకొంటూ మైలున్నరా నడిచి గదికి చేరుకొన్నాడు.

లేఖలు



గ్రామవైద్యుల శిక్షణ కేంద్రములు వాటి వివరములు

అయ్యా,

"చోప్రాకమిటీ" శిఫార్సులబట్టి ప్రకృతము గ్రామవైద్యుల శిక్షణకేంద్రములు, మదరాసు, గుంటూరు, తంజావూరు, ఆంధ్రజిల్లాలలో పెద్దాపురమందు జూలైమాసమునుండి ప్రారంభింపబడును. ఈ నాలుగు కేంద్రములలో శిక్షణపొందు వారిని ఎన్నుకొనుటలో ఒక్కొక్క కేంద్రమునకు సుమారు 125 మంది వైద్యవిద్యార్థులకు అవకాశ మొసగబడినట్లు తెలియుచున్నది. ఈ ప్రత్యేక శిక్షణ, 6 మాసములకాలము జరుపబడును. తదుపరి అన్ని కేంద్రములకు ఒకేవిధమగు పరీక్ష జరుపబడును.

ఈ శిక్షణకు వలయు పాఠ్యనియమావళి చోప్రాకమిటీ రిపోర్టులో శిఫార్సు గావింపబడినది. ఈశిక్షణపొందగోరు వైద్యులు వారి స్వంత ఖర్చులతో, అనగా 6 మాసములకు రు 30/- తక్కువలేకుండ విద్యాశోధనకుగాను యివ్వవలయును. అయితే న్యాయముగ, 'చోప్రాకమిటీ' మతానుసారము శిక్షణ పొందువారికి మాసమునకు రూ. 30 లు విద్యార్థివేతన మొసంగవలసియున్నది. కాని, మద్రాసుప్రభుత్వమువారు చోప్రాకమిటీ శిఫార్సులనుల్లంఘించుట చూడగా, యీ శిక్షణాశిబిరములు విద్యార్థులకు ఆకర్షకముగ నుండజాలవని సంశయముగ నున్నది.

ఆరుమాసముల తరువాత, ప్రభుత్వమువారు జరుపు పరీక్షలలో, కృతార్థులైన వైద్యులకు సర్టిఫికేట్లుమాత్ర మివ్వబడును. డిగ్రీలుగాని, డిప్లొమాలుగాని యొసంగరు. ఇంతవరకు ప్రభుత్వమువారు గ్యారంటీగా ఉద్యోగములు యిచ్చుట వీలుకాదని తెలిపియున్నారు. అయితే ప్రభుత్వమువారు నెలకొల్పబోవు గ్రామపునర్నిర్మాణ స్కీములోవి గ్రామవైద్యశాలలకు ఈ శిక్షణాశిబిరములలో ఉత్తీర్ణులైనవారికే వైద్య ఉద్యోగముల నిచ్చి ఆయా గ్రామపారిశుద్ధ్య, వైద్య ఆరోగ్య సంబంధములగు పనులన్నియు యీ వైద్యుల అధీనముక్రింద జరుపనున్నట్లు తెలియుచున్నది. వీరి జీతభత్యముల విషయములో నెలకు రు. 80-5-0-150-0-0 ల స్కేలు యిచ్చుటకు చోప్రాకమిటీవారు శిఫార్సు జేసియున్నారు. ఈ శిఫార్సును గురించి, మన మద్రాసు ప్రభుత్వమువారెంతవరకు అమలులో పెట్టెదరో చూడవలసియున్నది.

మాజీప్రధాని శ్రీ ప్రకాశంపంతులుగారి గ్రామపునర్నిర్మాణస్కీము అమలు జరుపుటకు ముందుగా గ్రామవైద్యశాలలో పనిజేయు నిమిత్తంగా రాజధానిలోకొన్ని జిల్లాలలోని, జిల్లా కలెక్టర్లద్వారా, ప్రభుత్వమునకు, ఆయుర్వేద, యూనాని, సిద్ధవైద్యుల రిజిస్ట్రేషన్ దరఖాస్తులు సుమారు 4 వేలకు పైగా వచ్చినట్లును, అందులోనుండి పై నాలుగు శిక్షణాశిబిరములకు 500 మంది దరఖాస్తుదారుల నెన్నుకొన్నట్లునూ తెలియుచున్నది. కేవలము రిజిష్టరైన వైద్యులను మాత్రమే తీసుకొనవలెనన్న నియమములున్నను, రిజిష్టరుకాని వైద్యులనుగూడ యెన్నుకొన్నచో, అయ్యది క్రమపద్ధతి కాజాలదు. కాని, ఎవ్వరైన యెన్నుకొనబడిన, అట్టివారు కేవలము ప్రముఖవైద్యులన్న కారణమైనను చూపెట్టవలయును. ఇంకా, ఏ జిల్లాల శిక్షణకేంద్రములకు, ఆ జిల్లాల దరఖాస్తుదారులనే, ఎన్నుకొనవలయును గాని ఒక జిల్లావైద్యులను మరొక జిల్లా కేంద్రమునకు ఎన్నుకొనుట మంచిదికాగపోగా, శిక్షణ పొందు వైద్యుల ఖర్చులు మితిమీతిపోగల వనుటలో నతిశయోక్తి యేమాత్రము లేదు.

ఈ శిక్షణకేంద్రములలో యల్. ఐ. యం. బిరుదులకు తక్కువ యోగ్యతలుగలవారు, ఉపాధ్యాయవర్గములో నుండగూడదు. అనగా, అనాటమీ, ఫిజియాలజీ, కెమిష్ట్రీ, మిడ్వైఫరీ మొదలగు ఇంగ్లీషు.సబ్జక్టులు విద్యార్థులకు పాఠ్యనియమావళి ననుసరించి బోధించుటకు సమర్థులగువారుగ నుండవలయును ఎల్. ఐ. యం. ములకంటె మిన్నగబోధించు మరొక డిప్లొమాలు, డిగ్రీలుగల వారైనను అర్హులే. అట్టివారు ప్రైవేటు ఆయుర్వేద కళాశాలల వారైనను ఫరవాలేదు. కాని, ఉపాధ్యాయులకు గౌరవవేతనముగా మాసమునకు ర. 25 మాత్రమే యివ్వబూనినట్లు తెలియుచున్నది. రు 25/-ల గౌరవవేతనమునకు, ఎంతటి ప్రసిద్ధవైద్య ఉపాధ్యాయులు లభించగలరో, బోధపడుటలేదు. ఆరు మాసముల శిక్షణ పాఠ్యనియమావళి ప్రకారము చక్కగ బోధింపవలయునన్న, ఉపాధ్యాయుల గౌరవవేతనము, మాసమునకు, కనీసము రు. 50/ ఉండవలయును.

ఈ నాల్గు కేంద్రములు మాత్రమే గాక, కేంద్రప్రభుత్వ సామ్రాజమాన్యమున గుంటూరు, బెజవాడ మున్నగు ప్రదేశములలో, మరికొన్ని కేంద్రములను ఒక్కొక్క కేంద్రములో సుమారు 50 మందికి తక్కువ గాకుండుటకు ఏర్పాట్లు చేయబడుచున్నట్లు తెలియవచ్చుచున్నది

ఈ అన్ని కేంద్రములలోనూ మంచి యోగ్యతలు గల ప్రశస్తఆయుర్వేదవైద్యులకే అవకాశ మొసంగి "చోప్రాకమిటీ" శిఫార్సులను వన్నెకు దెచ్చెదరని ఆశించుచున్నాను.

నారాయణం కేశవాచార్యులు,
టంగుటూరు.

వ్యాయామోపాధ్యాయుల జీతాలు

ఆర్యా!

ఆలస్యమైనా మా స్థితి గతులను ప్రభుత్వము ముందు పెట్టాలని నా కోరిక. దీనివల్ల ఫలితమున్నా లేకపోయినా, ప్రభుత్వము ప్రజలు మావిషయాలు తెలుసుకుంటే చాలు. అడుగనిదే అమ్మ అయినా అన్నము పెట్టదుగదా!

4947వ సం.॥లో ప్రకటించిన కొన్ని మచ్చుతునకలు యిచ్చుట పొందుపఱచు చున్నాను. 47సం ఫిబ్రవరిలో ప్రకటించిన స్కేల్సులో వ్యాయామోపాధ్యాయులకు అనగా గ్రేడు (I) వారికి 50-36-5-2-95 యిచ్చారు. తరువాత ఉపాధ్యాయ లోకము అసంతృప్తి చెంది అలజడి చేయగా జూలై నెలలో మరల జీతాలు మార్చారు. అప్పుడు ఈ పైజెప్పిన జీతము 50, 2-70-2½-95గా మారింది. అంటే మా కర్మము కాలి రూ 3, యింక్రిమెంటుకు మారుగా రెండైంది. రీరివిజనులో మాకు పెంచింది యిది. ఇంత జరిగినా మా సోదరోపాధ్యాయులు కదల లేదు. ముందెప్పుడో కొంపనుత్తవ్వి నెత్తిన పెడతారనెడి యుద్దేశ్యముతోనే సుమా!

అటు తరువాత తెలుగు, హిందీ పండితుల జీతాలు పుష్కలముగా పెంచబడినవి. హైయ్యరు ఫారములకు బోధించు పండితులకు యల్. టి. జీతాలు చేసారు. నిన్న మొన్ననే హిందీవారికి కూడా. కాని ఆ మంత్రము వ్యాయామోపాధ్యాయులకు వర్తించలేదు. వీరుకూడా పండితులు, యల్. టీ. లవలెను హైయ్యరు ఫారములకే బోధిస్తారు. కాని జీతము మాత్రము ఆ గొడ్డు తోక మాదిరే. ఇక స్కూలులో ఎక్స్ట్రా పని అంటారా? అంతామాదే. రికార్డుపని అంటారా? ఆ చిత్రగుప్తునకు కూడా యుండదేమో అంతపని. ఇతర ఉపాధ్యాయులకు క్రాఫ్టు అలవెన్సు 5రూ. యిస్తూ యున్నారు. అది మాకుసున్నా. కనక మా స్థితి దున్నబోతే ఎద్దులలోనూ, తినబోతే దూడలలో లాగుంది.

ఇక గవర్నమెంటులో నున్న వ్యాయామోపాధ్యాయుల స్థితి చూద్దాము. ఒకప్పుడు ఒక్క సభ్యుడు అసెంబ్లీసభ, విద్యాశాఖ మంత్రిగార్ని గవర్నమెంటులో పనిచేసే ఉపాధ్యాయులకు, యితర సంస్థలలో పనిచేసే ఉపాధ్యాయులకు స్కేల్సు తేడా యెందుకంటే అని ప్రశ్నిస్తే మాజీ మంత్రిగారు ఈవిధముగా జవాబిచ్చారు. "గవర్నమెంటులో పనిచేసేవార్కి డివిజనుమీద అనగా ఆరు జిల్లాలలో బదిలీలు ఉంటవి కాబట్టి తేడా ఉండవలసినదే" అన్నారు. కాని తీరా మార్గముగదా ఆ తేడా వ్యాయామోపాధ్యాయులకు లేదు. చివరకి యింక్రిమెంట్లలో సైనా తేడాలేదు. గవర్నమెంటులో పనిచేసినా, యితర సంస్థలలో పనిచేసినా ఒకటే జీతము, ఒకటే యింక్రిమెంటు. గవర్నమెంటులో యుంటే ప్రతి ఉపాధ్యాయునకు సంవత్సరమునకు మూడు రూ. యింక్రిమెంటు అయితే మాకు రెండు మాత్రమే.

గవర్నమెంటు సర్వీసులో గుమాస్తాగాని, (విద్యాశాఖ) సెకండరీ గ్రేడు టీచరుగా గాని, చేతిపనిని బోధించు ఉపాధ్యాయుడుగా గాని యుండి తగిన విద్యా యోగ్యతలున్నచో వారిని డిప్యూటీ యిన్స్పెక్టర్లుగా వేయవచ్చు. కాని అట్టి నాకకాశము మాకుమాత్రము లేదు. అయ్యా! ఈ విధముగానుంది మా స్థితి. ఇప్పటికైనా ప్రభుత్వమువారు మా స్థితి ఆలోచించి ఈక్రింది స్కేల్సుయిచ్చు యేర్పాటు చేయించ గోరుచున్నాము.

గ్రేడు(I)	హైయ్యరు	75-5-145.
గ్రేడు(II)	లోయర్	60-4-120.
ఇతరులకు		45-2-85

ఇతరులకువలె మాకుకూడా 5రూ. క్రాఫ్టు అలవెన్సు నివ్వా.

ఒక వ్యాయామోపాధ్యాయుడు.

ఆంధ్రరత్న రచనలు

గత మాసములో ఢిల్లీలోను, విజయవాడలోనూ, తదితర స్థలములందును జరిగిన శ్రీ ఆంధ్రరత్న గోపాలకృష్ణుని షష్టిపూర్తి ఉత్సవ సందర్భమున వారి రచనలు సంపూర్ణముగ ప్రచురించవలెనని పలువురు ఉపన్యాసకులు అభిప్రాయములనొసంగిరి. ఇందుగూర్చి శ్రీ కళా వెంకట్రావుగారి అధ్యక్షతను ఢిల్లీలో కూడిన ఒకసభయు, యిచ్చటి స్థానిక గోష్ఠి కార్యవర్గమును తీర్మానములుకూడ గావించినవి.

ఇంతవరకు యీ ఆంధ్రరత్నవాఙ్మయమందీ దిగువ పుస్తకములు, చిన్నవి, పెద్దవి, ప్రచురింపబడినవి. (1) 'ఆంధ్రరత్నచాటువులు'; (2) 'పురుషార్థములు'; (3) 'శ్రీరామదండు'; (4) 'ఆంధ్రరత్నప్రశంస' అను లఘుచరిత్ర; (5) ఆంగ్లమున యాతని లేఖలు; (6) ఆంగ్లమందాతని 'జీవితచరిత్ర, సందేశము' అను పెద్ద పొత్తము. వీనిలో (4), (6) నాచే రచింపబడినవి. ఇందు 'చాటువులు', 'ఆంధ్ర రత్న ప్రశంస' అను పుస్తకములు మాత్రమే కొలది ప్రతులు మిగిలినవి. మిగత గ్రంథములన్నియు అయిపోయినవి.

ఇక నావద్ద నూతనముగ ప్రచురణకు సిద్ధముగానున్న గ్రంథములెవ్వియన:—(1) 'ఆంధ్రరత్నస్మృతి' యను ఆంధ్రరత్న ప్రశంసా పద్యములు: (2) తెనుగున ఆతని ఉపన్యాసములు, రచనలు, (4) ఆంగ్లమున ఉపన్యాసములు, రచనలు; (4) తెనుగున నాచే రచింపబడిన యాతని పూర్తి చరిత్ర; (5) ఆతని జీవితమందలి కొన్ని రసఘట్టములను చిన్ని పొత్తము. వీనిలో మొదటి పొత్తమును విజయవాడ స్థానిక గోష్ఠి సంఘము వారు 'మన గోపాలకృష్ణుడ'ను పేరిట ఆంధ్రరత్న షష్టిపూర్తి ఉత్సవ కానుకగ యిప్పుడు ప్రచురించుచున్నారు. ఈ సెలాఖరులోగా పూర్తికావచ్చును.

ఈ సందర్భమున శ్రీఆంధ్రమిత్రులును పుస్తకప్రియులును, గ్రంథాలయోద్ధారకులునగు శ్రీ అయ్యంకి వెంకట రమణయ్య పంతులుగారు షష్టిపూర్తి సంవత్సరములో పై చెప్పిన అప్రచురిత గ్రంథములేగాక, లోగడ ప్రచురితమైన గ్రంథములను కూడ చేర్చి, చక్కని "షష్టిపూర్తి వాల్యూము"ల క్రింద ప్రచురించుట అవసరమనియు, మంచిదనియు సూచించిరి. ఈసూచన విలువగల సూచన యనుట నిస్సంశయము. ఇవన్నియు కలిపి నూతనముగ ముద్రించినచో షుమారు వెయ్యి పుటలలో అయిదారు గ్రంథములగును, ఇందుగూర్చి తగు ప్రజాదరణలభించుచో నావద్దనున్న వాఙ్మయమును చిరకాలములోనే మహాజనుల కందింప సంసిద్ధుడనని మనవి చేయుచు, అభిమానులగువారు తమ విలువగల సలహాలను, సూచనలను తెలుపగలరని కోరుచున్నాను.

గ. వెం. సుబ్బారావు,

తెనుగు పండితుల గోడు

ప్రభుత్వమువారు సెకండరీ పాఠశాలలలో బని చేయుచున్న పండితులలో జూనియర్లనియు, సీనియర్లనియు, వేరుచేసి, తదనుసారము వేతనముల నొసంగుచున్నారు. జూనియర్ పండితులకు 45-2-85 స్కేలును నిర్ణయించి 4½ మాసముల పర్యంత మొసంగినారు. పిమ్మట జూనియరు పండితులలో 1-1-48 పూర్వముద్యోగమందు ప్రవేశించువారికి రు. 45-2-85 స్కేలును, తరువాత నుద్యోగమందు ప్రవేశించువారికి రు. 40-1-60 స్కేలును నిర్ణయించిరి. అదనముగ నిచ్చిన ధనమును తిరిగిరాబట్టుకొనిరి.

పూర్వము నుండియు పండితులలో సీనియర్లనియు, జూనియర్లనియు, రెండే విభాగములు గలవు. కాని మన జాతీయప్రభుత్వము జూనియర్లలో మరిరెండు తెగలుగ విభాగము చేసి, స్కేళ్ళనుగూడ వ్యత్యాసముగ నిర్ణయించిరి. పాఠశాలలలో సమానహోదాతో, సమాన ప్రయాసముతో నున్న జూనియర్ పండితులలో నిట్టి వ్యత్యాసమును గల్పించుట మిగుల విచారకరము. మాతృభాషల కగ్రస్థాన మొసంగుచు, తద్వారా, ఆ శాఖలో బనిచేయువారికి చేదోడు వాదోడుగ సహాయము చేయుటకు బదులు నిరుత్సాహము కలిగించుటవలన ప్రయోజన ముండదు గదా! కావున ప్రభుత్వము వారు *G. O. No. 526 Educationi Dated* 15-3-48 నాటిది పరిశీలించి, పండితులలో సీనియర్లనియు, జూనియర్లనియు, రెండే విభాగముల నేర్పాటు చేయుచు, జూనియరు పండితులకు యల్. టి. స్కేళ్ళను నిర్ణయింప కోరుచున్నాను.

పార్నంది ఈశ్వరప్ప,
హీరమండలం.

పందువగండి ప్రాజక్టును వెంటనే నిర్మించాలి


అయ్యా,

నెల్లూరు జిల్లా కనిగిరి తాలూకాలో పాలేరు నది ప్రవహిస్తోంది. పందువగ్రామం వద్ద ఈ నదికి ఇరువైపుల రెండు కొండలు వ్యాపించియున్నవి. ఈ రెండు కొండల మధ్య రెండు ఫర్లాంగుల కట్ట వేస్తే అపూర్వమైన జలాశయం, ఏర్పడి 15 వేల జనాభాగల్గిన షుమారు 18 గ్రామములకు నీటివసతి ఏర్పడగలదు. దీని మూలమున సాలుకు 800 టన్నుల బియ్యం ఉత్పత్తియై పేద ప్రజలు గల ఈ మెట్ట తాలూకాకు కొంతవరకైనా సహాయపడగలదు. ఈ ప్రాజక్టును వెంటనే అమలు పర్చమని పబ్లిక్ వర్క్సు మంత్రికి మూడుసార్లు, ఆర్థిక మంత్రికి రెండు సార్లు, ప్రధానమంత్రికి రెండు సార్లు, ఛీఫ్ ఇంజనీరుకు రెండు సార్లు వినతిపత్రములు సమర్పించితిమి. కాని ఇంతవరకు అమలుపర్చలేదు. మా ప్రాంతపు పేదప్రజలయెడ మాచే ఎన్నుకోబడిన అసెంబ్లీ సభ్యులుసైతము ఎంతో ఉదాసీనముగా ఉన్నారు. ఇక మా ప్రాంతపు పేదల గతిని, నీటి వసతుల నిర్మాణ విష[illegible] గూర్చి సమగ్రవిచారణ జరిపి ఆచరణలో పెట్టునట్లు చేసే నాథుడు కనపడలేదు.


కనుక ప్రస్తుతప్రధానిగారైనా ఈ ప్రాజక్టు విషయం సమగ్రంగా పరిశీలించి వెంటనే అమలు పర్చమనిన్నీ, పేదలకు జీవనాధారం కల్పించమనిన్నీ కోరుతున్నాను.

ధూళిపాళ్ల కృష్ణమూర్తి,
కనిగిరి.

నేటి అమెరికన్ చిత్రకళకు ఆయువుపట్లు అయిన చిత్రాలు



'లాంగ్ బ్రాచ్, న్యూ జెర్సీ'—చిత్రకారుడు: విన్‌స్లో హోమర్




'బ్రీజింగ్ అప్'—చిత్రకారుడు: విన్‌స్లో హోమర్

Regd. No. M. 4479

కళాప్రపూర్ణ కీ॥ శే॥ కాశీనాథుని నాగేశ్వరరావుగారి

ఉత్కృష్టరచన

ఆంధ్రవాఙ్మయ చరిత్ర



నరికొత్తపద్ధతిని, సంగ్రహరూపంలో నడిచిన సమగ్రసమీక్ష. వెయ్యేండ్ల వాఙ్మయచరిత్రకు విశుద్ధదర్పణం. పాతచరిత్రలనన్నిటిని అవలోకన చేసి, సమన్వయించి క్రోడీకరించిన సిసలయినచరిత్ర.

శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండి ఉండి, నన్నయధర్మమా అని ఒక్క ఊపున దివ్యాకారంతో బైలుపడి, నానాటికి నవనవోజ్జ్వలంగా వికసించిన మన వాఙ్మయం పోయిన పలుపోకడలను పోడిమితో చూపెట్టజాలిన ఉత్తమ గ్రంథం.

వెల రు 2-0-0 లు, తపాలాఖర్చు 0-7-0 **ఆంధ్రగ్రంథమాల, పో. బా. 212, మద్రాసు.**

ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము

ప్రథమ ద్వితీయ సంపుటములు

ప్రథమసంపుటమునందు డిమ్మీ ౮-వ ఆకృతియందు ౬౦౦ పుటలు గలవు. ఇందు 'అ' నుండి "అధ్వర్య" వరకును గల విషయము గలదు. త్రివర్ణ పటములు ౮, ఇతర పటములు ౧౨౯, వివిధవిషయములు ౮౦౦ కలవు.

రెండవ సంపుటమునందు డిమ్మీ ౮-వ ఆకృతియందు ౬౦౦ లకు మించిన పుటలు కలవు. "అధ" మొదలుకొని "అశ్విని" వరకు గల విషయము గలదు. త్రివర్ణపటములు ౧౦. వానిలో ౨ అమరావతీస్తూపమునకును, ౨ అనాహతమునకును చెందినవియు, ౬ దేశచిత్రపటములును గలవు. ఇవిగాక మరి ౫౫ సాదా దేశపటములు కలవు. ప్రాచీనాంధ్రుల కళాసంపదను వ్యక్తముచేయు అమరావతిస్తూపమును గురించిన గొప్ప వ్యాసమునందు అమరావతీ శిల్పమునకు సంబంధించిన హాఫ్‌టోన్ బొమ్మలు రమారమి ౧౦౦ ను, వేషభూషాదుల వెల్లడించు బొమ్మలు ౫౦ వఱకును గలవు. మరియు అభినయ మను వ్యాసమున భరతశాస్త్రమునందలి వేఱువేఱుహస్తములను సూచించు బొమ్మలు ౫౭ ను, 'అనాహతము' నందుపట్టాదుల చిత్రములును గలవు. ఇట్లు ఆ యా వ్యాసములకు చెందిన చిత్రములు మొత్తముమీద ౨౫౦ కి పైగా నున్నవి. వివిధవిషయముల సంఖ్య ౮౦౦ వరకు నుండును. సంపుటము చక్కని స్వదేశీచర్మముతోడను, బంగారురేఖలతోడను సంపుటీకృతము. ప్రతిసంపుటమున ౬౦౦ పుట లుండును.

ప్రతి సంపుటము వెల రూ. ౧౦.

పోస్టుఖర్చులు: రూ. ౧-౮-౦.

రైలుద్వారా దగ్గర చోట్లకు ఖర్చులు అ. ౧౨.


మేనేజరు,

ఆంధ్రవిజ్ఞానసర్వస్వ కార్యాలయము,

నెం. 7, తంబుశెట్టివీధి, మదరాసు.

గాంధిమహాత్ముని

ఆత్మకథ



రెండుసంపుటములు

[చతుర్థముద్రణము]

శతావధాని

వేలూరి శివరామశాస్త్రిగారి

అనువాదము

ఖద్దరు బైండు

ప్రతిసంపుటము పోస్టేజితో సహా

వెల రూ. 5-9-0

ఒకేసారి 2 సంపుటములు

పోస్టేజితో రూ. 10-12-0

ఆంధ్ర గ్రంథమాల, పోస్టుబాక్సు నెం. 212, మదరాసు.

శ్రీమద్భగవద్గీత

సంస్కృత మూలము, తెలుగున టీకాతాత్పర్య విశేషార్థ వివరణములు గల 400 పుటల గ్రంథము. గీతాధ్యయన పరులకు మిక్కిలి ఉపయుక్తమైనది.

ఖద్దరు బైండు.

వెల రు 4-0-0 లు.

తపాలా ఖర్చు అ. 0-9-0.

ఆంధ్రగ్రంథమాల

పోస్టుబాక్సు 212 మదరాసు 1.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras 1